

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 27-9-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 163 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి మ.12.04 తదుపరి షష్ఠి, నక్షత్రం: అనూరాధ రా.1.08 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.6.08-7.43, అమృతఘడియలు: మ.1.26-3.14, రాహుకాలం: ఉ.9.00-10.30, సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.03 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బిజినెస్

సోఫా విభాగంలోకి సెంచరీ మ్యాట్రెసెస్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్లీపింగ్ సొల్యూషన్స్ సంస్థ సెంచరీ మ్యాట్రెసెస్.. సోఫా విభాగంలోకి ప్రవేశించింది. రూ.1.3 లక్షల కోట్ల విలువైన ఫర్నీచర్ మార్కెట్లో అవకాశాలు చేజిక్కించుకోవాలనే లక్ష్యంతో ఇందులోకి అడుగుపెట్టినట్లు సెంచరీ సోఫా ఈడీ ఉత్తమ్ మలానీ తెలిపారు. శుక్రవారం నాడిక్కడ సంస్థ బ్రాండ్ అంబాసిడర్ పీవీ సింధుతో కలిసి ఆరు కలెక్షన్స్‌తో కూడిన సోఫాలను ఆయన మార్కెట్లోకి విడుదల చేశారు. అనంతరం మలానీ మాట్లాడుతూ.. మ్యాట్రెసెస్ వ్యాపార పరిమాణంతో పోల్చితే ఈ విభాగం దాదాపు ఐదు రెట్లు ఎక్కువగా ఉంటుందన్నారు. సోఫా విభాగంలో 10 శాతం మాత్రమే సంఘటిత రంగంలో ఉందని పేర్కొన్నారు. సోఫాల తయారీ కోసం హైదరాబాద్ సమీపంలో ఉన్న మ్యాట్రెసెస్ ప్లాంట్‌లోనే రూ.35 కోట్లతో యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆ తర్వాత మరో రూ15 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు చెప్పారు.



కుటుంబాల సంపద మరింత పైకి

గత ఏడాది 14.5 శాతం అప్.. దేశంలో మారుతున్న పెట్టుబడుల ట్రెండ్

షేర్లు, డిబెంచర్ల వైపు మొగ్గు.. అలియాంజ్ గ్లోబల్ వెల్త్ రిపోర్ట్ వెల్లడి

న్యూఢిల్లీ: భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా కుటుంబాల సంపద పెరిగిపోతోంది. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఇది 8.7 శాతం వృద్ధితో 315.9 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.28,026 లక్షల కోట్లు) చేరింది. ఇందులో సగం వాటా అమెరికాదే. దాదాపు 60 దేశాల్లోని పెరుగుతున్న కుటుంబ సంపదలను పరిశీలించి అలియాంజ్ గ్లోబల్ అనే సంస్థ ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం గత పదేళ్లలో పెరిగిన ప్రపంచ కుటుంబాల సంపదలో 47 శాతం అమెరికా నుంచి రాగా 20 శాతం చైనా నుంచి, 12 శాతం పశ్చిమ ఐరోపా దేశాల నుంచి సమకూరింది.

భారత్‌లోనూ: మన దేశంలోనూ కుటుంబాల సంపద బాగానే పెరుగుతోంది. గత ఏడాది భారత్‌లోని కుటుంబాల సంపద గత ఎనిమిదేళ్లలో ఎన్నడూ లేనంతగా 14.5 శాతం పెరిగిందని అలియాంజ్ గ్లోబల్ వెల్త్ నివేదిక-2025 తెలిపింది. గత రెండు దశాబ్దాల్లో మన దేశ కుటుంబాల పెట్టుబడుల స్వరూపంలోనూ అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. గతంలోలా ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పొలాలు, నగ నట్రా కంటే బ్యాంక్ డిపాజిట్లు, షేర్లు, డిబెంచర్లు, పెన్షన్ ఫండ్లు, బీమా పాలసీల్లో మదుపు చేసేందుకు కుటుంబాలు ఇష్టపడుతున్నాయి. దీంతో గత 20 ఏళ్లలో భారత్‌లోని కుటుంబాల ఫైనాన్షియల్ ఆస్తులు ఐదు రెట్లు పెరిగాయి.

మరే వర్ధమాన దేశంలోనూ కుటుంబాల ఫైనాన్షియల్ ఆస్తులు ఈ స్థాయిలో పెరగలేదని నివేదిక తెలిపింది. ఈ కాలంలో షేర్లు, డిబెంచర్ల ఆస్తులు 28.7 శాతం, బీమా-పెన్షన్ పథకాల ఆస్తులు 19.7 శాతం పెరిగాయి. అయితే ఇప్పటికే భారతీయ కుటుంబాల ఫైనాన్షియల్ ఆస్తుల్లో 54 శాతం వాటా బ్యాంక్ డిపాజిట్లదేనని ఆ నివేదిక పేర్కొంది.

ఇతర ప్రధానాంశాలు

- 2024లో 15.6 శాతం వృద్ధితో 2,818 డాలర్లకు చేరిన భారత కుటుంబాల సగటు నికర ఫైనాన్షియల్ ఆస్తులు
- 12.1 శాతం వృద్ధితో జీడీపీలో 41 శాతానికి చేరిన భారత కుటుంబాల అప్పులు
- ద్రవ్యోల్బణాన్ని తీసివేస్తే గత ఏడాది 9.4 శాతం పెరిగిన భారత కుటుంబాల ఫైనాన్షియల్ ఆస్తులు
- కొవిడ్ తర్వాత 40 శాతం పెరిగిన భారత కుటుంబాల కొనుగోలు శక్తి
- మొత్తం కుటుంబ ఫైనాన్షియల్ ఆస్తుల పెట్టుబడుల్లో షేర్లు, డిబెంచర్ల వాటా 13 శాతం మాత్రమే
- ప్రపంచ కుటుంబాల సంపదలో 60 శాతం.. 10 శాతం కుటుంబాల చేతుల్లో కేంద్రీకృతం
- భారత్‌లోని 10 శాతం కుటుంబాల చేతిలో 65 శాతం కుటుంబ సంపద
- గత 20 ఏళ్లలో 13 రెట్లు పెరిగిన భారతీయ కుటుంబాల ఫైనాన్షియల్ ఆస్తులు

మరణించిన వ్యక్తుల ఖాతాల

సత్వర సెటిల్‌మెంట్

బ్యాంకులకు కొత్త మార్గదర్శకాలు జారీ చేసిన ఆర్‌బీఐ

ముంబై: మరణించిన ఖాతాదారుల బ్యాంక్ ఖాతాలు, లాకర్లు, వాటిలోని వస్తువులను వారి నామినీలకు అప్పగించే సెటిల్‌మెంట్ ప్రక్రియను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సులభతరం చేసింది. దీనికి సంబంధించి కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. వచ్చే ఏడాది మార్చి 31లోగా వీలైనంత త్వరగా ఈ మార్గదర్శకాలు అమలు చేయాలని కోరింది.

- చనిపోయిన వ్యక్తి బ్యాంక్ ఖాతాలోని మొత్తాన్ని నామినీకి, జాయింట్ ఖాతా అయితే సర్వైవర్‌కు చెల్లించాలి
- ఒకవేళ ఖాతాదారు ఎవరినీ నామినీగా పేర్కొనక పోయినా, డిపాజిట్ మొత్తం నిర్ణీత మొత్తానికి లోబడి ఉంటే, బ్యాంకులు ఆ మొత్తాన్ని సులభతర పద్ధతిలో సెటిల్ చేయాలి
- సహకార బ్యాంకులైతే రూ.5 లక్షల లోపు, ఇతర బ్యాంకులైతే రూ.15 లక్షలను గరిష్ఠ పరిమితిగా పెట్టుకోవాలి.
- బ్యాంకుల బోర్డులు అనుమతిస్తే ఇంతకు మించిన మొత్తాన్ని కూడా అనుమతించవచ్చు
- అయితే ఇందుకు వారసత్వం సర్టిఫికెట్లు లేదా చట్టబద్ధ వారసుడనే సర్టిఫికెట్లు తీసుకోవాలి
- చనిపోయిన ఖాతాదారుల నామినీలు, వారసుల నుంచి క్లెయిమ్ అందిన 15 రోజుల్లోగా సెటిల్‌మెంట్ పూర్తి చేయాలి
- 15 రోజుల్లోగా క్లెయిమ్ సెటిల్ చేయలేకపోతే అందుకు కారణాలు ఏమిటో నామినీ, చట్టబద్ధ వారసులకు తెలియజేయాలి
- సహేతుక కారణం లేకుండా ఆలస్యం చేస్తే, ఖాతాలోని మిగులుపై బ్యాంక్ అమలు చేస్తున్న వడ్డీకి తోడు 4% వార్షిక వడ్డీ చెల్లించాలి.
- లాకర్‌లోని వస్తువుల అప్పగింతలో ఆలస్యమైతే రోజుకు రూ.500 చొప్పున జరిమానా చెల్లించాలి.

హెరిటేజ్ ఫుడ్స్‌కు గోల్డెన్ పీకాక్ అవార్డు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్.. కార్పొరేట్ గవర్నెన్స్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఓడీ) నెలకొల్పిన ప్రతిష్ఠాత్మకమైన గోల్డెన్ పీకాక్ అవార్డు గెలుచుకుంది. వివిన్న రంగాల్లో కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో సాధించిన అద్భుత ఫలితాలకు గాను హెరిటేజ్ ఫుడ్స్ ఈ అవార్డును దక్కించుకోగలిగినట్లు కంపెనీ తెలిపింది. చెక్కు చెదరని సమగ్రతతో కూడిన తమ వ్యాపార నిర్వహణకు గుర్తింపు ఈ అవార్డు అని కంపెనీ వైస్ చైర్‌పర్సన్, ఎండీ నారా భువనేశ్వరి అన్నారు. లండన్‌లో నవంబరు 4వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ కార్పొరేట్ గవర్నెన్స్ అండ్ సస్టెయినబులిటీ సదస్సులో ఈ అవార్డును హెరిటేజ్ ఫుడ్స్‌కు బహూకరించనున్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,14,880▲	1,05,300▲	1,52,000▲
విజయవాడ	1,17,000▼	1,11,000▼	1,42,000▲
విశాఖపట్నం	1,17,150▲	1,05,300▲	1,53,000▲
రాజమండ్రి	1,14,870▲	1,05,300▲	1,41,000▲
ప్రొద్దుటూరు	1,18,500▲	1,09,020▲	1,43,500▲
ముంబై	1,13,262▼	1,03,748▼	1,38,100▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	550
వరంగల్	502	గోదావరి	540
చిత్తూరు	558	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	115
వరంగల్	100	గుంటూరు	115
కరీంనగర్	100	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	92
కర్నూలు	100	నెల్లూరు	97
విశాఖపట్నం	122	అనంతపురం	97
గోదావరి	115		

ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీల్లో

మారుతి సుజుకీ @ 8

మాతృసంస్థను కూడా అధిగమించి ముందుకు

దేశంలోని అతి పెద్ద కార్ల తయారీదారు మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీల్లో టాప్ 10లోకి దూసుకుపోయింది. 5,760 కోట్ల డాలర్ల (రూ.5.11 లక్షల కోట్లు) మార్కెట్ విలువతో ప్రపంచంలో మార్కెట్ విలువ పరంగా అత్యంత విలువైన కంపెనీల్లో 8వ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో ప్రపంచ స్థాయి ఆటో దిగ్గజాలైన ఫోర్డ్ మోటార్స్ (4,630 కోట్ల డాలర్లు), జనరల్ మోటార్స్ (5,710 కోట్ల డాలర్లు), ఫోక్స్‌వేగన్ ఏజీ (5,570 కోట్ల డాలర్లు) కంపెనీలను దాటిపోయింది. చివరికి జపాన్‌కు చెందిన మాతృసంస్థ సుజుకీ మోటార్ కార్పొరేషన్‌ను (2,900 కోట్ల డాలర్లు) కూడా మారుతి సుజుకీ వెనక్కి నెట్టేసింది.

ప్రపంచంలో టాప్ 8 ఆటో కంపెనీలు

కంపెనీ	మార్కెట్ విలువ (డాలర్లలో)
టెస్లా	147 లక్షల కోట్లు
టయోటా	31,400 కోట్లు
బీవైడీ	13,300 కోట్లు
ఫెరారీ ఎన్‌వీ	9,270 కోట్లు
బీఎండబ్ల్యూ	6,130 కోట్లు
మెర్సిడెస్ బెంజ్	5,980 కోట్లు
హోండా మోటార్	5,900 కోట్లు

సీక్యూటీ వెపన్‌తో బ్రైట్‌కామ్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రక్షణ టెక్నాలజీ అభివృద్ధి కోసం అమెరికాకు చెందిన సీక్యూటీ వెపన్ సిస్టమ్స్‌తో వ్యూహాత్మక ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకున్నట్లు హైదరాబాద్‌కు చెందిన బ్రైట్‌కామ్ గ్రూప్ శుక్రవారం ప్రకటించింది. ఇది తమ రక్షణ విభాగం ప్రయాణంలో ఒక మైలురాయి అని తెలిపింది. ఫలితంగా ఈ కంపెనీకి చెందిన రక్షణ విభాగం దేశీయంగా అభివృద్ధి చేసిన మానవ రహిత ఏరియెల్ వాహనాలు (యూఏవీ), మాస్ట్రో ఓఎస్‌లు, ఏఐ ఆధారిత డిఫెన్స్ ఆపరేటింగ్ సిస్టమ్‌లను విడుదల చేసేందుకు సమాయత్తం అవుతోంది.

ఫార్మా సుంకాల షాక్

- సెన్సెక్స్ 733 పాయింట్లు పతనం
- 81,000 దిగువ స్థాయికి సూచీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా ఆరో రోజూ నష్టపోయింది. తమ దేశంలోకి దిగుమతయ్యే బ్రాండెడ్ ఔషధాలపై వచ్చే నెల 1 నుంచి 100% సుంకాలు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ఫార్మా రంగ షేర్లలో అమ్మకాలు పోటెత్తాయి. ట్రంప్ హెచ్1బీ వీసా ఫీజును కూడా భారీగా పెంచిన నేపథ్యంలో ఐటీ రంగ షేర్లలో వరుసగా ఐదో రోజూ అమ్మకాలు కొనసాగాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) నిరవధిక అమ్మకాలు మార్కెట్‌పై ఒత్తిడిని మరింత పెంచాయి. దాంతో ప్రామాణిక సూచీలు శుక్రవారం భారీ నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ 733.22 పాయింట్లు పతనమై 80,426.46 వద్ద ముగిసింది. ఒక దశలో సూచీ 827.27 పాయింట్లు క్షీణించి 80,332.41 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 236.15 పాయింట్లు కోల్పోయి 24,654.70 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీకి మూడు వారాల కనిష్ఠ ముగింపు స్థాయిలివి. ఈ వారంలో గడిచిన 6 ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,587.50 పాయింట్లు (3.16 శాతం) క్షీణించింది. నిఫ్టీ సైతం 768.9 పాయింట్లు (3%) పతనమైంది. ఈ ఆరు రోజుల్లో ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.16.34 లక్షల కోట్లు తగ్గి రూ.450.55 లక్షల కోట్లకు (5.08 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

ఐపీఓకు ఆర్వీ ఇంజనీరింగ్

హైదరాబాద్‌కు చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కన్సల్టెన్సీ సంస్థ ఆర్వీ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.202.5 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్‌కు చెందిన 67.5 లక్షల షేర్లను ఓఎఫ్ఎస్ ద్వారా విక్రయించనుంది.

ఫార్మా షేర్ల పతనం

కంపెనీ	నష్టం (%)
వోకార్డ్ లిమిటెడ్	9.40
ఎస్ఎంఎస్ ఫార్మా	6.56
ఇండోకో రెమెడీస్	5.35
సువెన్ లైఫ్ సైన్సెస్	4.56
జైడస్ లైఫ్‌సైన్సెస్	4.21
దివీస్ ల్యాబ్స్	3.53
గ్లెన్‌మార్క్ ఫార్మా	2.99
గ్రాన్యూల్స్ ఇండియా	2.72
నాట్కో ఫార్మా	2.65
సన్ ఫార్మా	2.55
లుపిన్	2.07
డాక్టర్ రెడ్డీస్	1.73
సిప్లా	0.72
గ్లాండ్ ఫార్మా	0.58
అరబిందో ఫార్మా	0.57

స్పోర్ట్స్

సాకేత్‌కు డిప్యూటీ కలెక్టర్ పోస్టు



అమరావతి (ఆంధ్రజ్యోతి): భారత టెన్నిస్ స్టార్, అర్జున అవార్డు గ్రహీత సాయి సాకేత్ మైనేనికి డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇచ్చే సవరణ బిల్లుకు శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. 'నియామకాల క్రమబద్ధీకరణ, సిబ్బంది సరళి, చెల్లింపుల విధానం' సవరణ బిల్లును ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అంతర్జాతీయ స్థాయిలో సాకేత్ ప్రతిభ కనబర్చారని, మొత్తంగా 43 పతకాలు సాధించారని వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి పేరు తీసుకొచ్చిన సాకేత్‌కు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని చెప్పారు.

పారా పండుగ

నేటినుంచి ప్రపంచ పారా అథ్లెటిక్స్

100 దేశాలు, 1500 మంది అథ్లెట్లు

బరిలో తెలుగు అథ్లెట్లు దీప్తి, రవి, అకీరా



రవి



దీప్తి

న్యూఢిల్లీ: ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌కు శనివారం ఇక్కడి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో తెరలేవనుంది. వచ్చే నెల ఐదు వరకు జరిగే ఈ ప్రతిష్ఠాత్మక పోటీలలో ప్రపంచ మేటి పారా అథ్లెట్లు బరిలో దిగుతున్నారు. 100 దేశాల నుంచి మొత్తం 1500 మందికి పైగా పారా అథ్లెట్లు 186 పతక (101 పురుషులు, 84 మహిళలు, ఒక మిక్స్‌డ్ విభాగం) ఈవెంట్లలో తలపడుతున్నారు. ఇక.. 76 మంది బృందంతో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఆతిథ్య భారత్ పతకాల పట్టికలో టాప్-5లో ఉండడమే లక్ష్యంగా నిర్దేశించుకుంది. కిందటిసారి (17 పతకాలు) మించి..ఈసారి 20 మెడల్స్ దక్కించుకోవాలని మనోళ్లు పట్టుదలగా ఉన్నారు. తెలంగాణకు చెందిన డిఫెండింగ్ చాంపియన్ దీప్తి జీవాంజి (మహిళల 400 మీటర్లు) టైటిల్ నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఉండగా.. పురుషుల 400 మీటర్లలో తెలంగాణకే చెందిన బానోతు అకీరా నందన్ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. ఆంధ్ర అథ్లెట్, అనకాపల్లికి చెందిన రొంగలి రవి షాట్‌పుట్‌లో తలపడనున్నాడు. మిగతా స్టార్ అథ్లెట్లలో సుమిత్ అంటిల్, సుందర్‌సింగ్ (జావెలిన్ త్రో), ప్రవీణ్ (హైజంప్), సుమిత్, ఎక్తా బ్యాన్ (మహిళల క్లబ్ త్రో), సిమ్రన్ శర్మ (మహిళల 200 మీ.) తదితరులు భారత్ నుంచి ప్రధాన ఆకర్షణ కానున్నారు.

వైదొలగిన పాకిస్థాన్

ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ నుంచి వైదొలగుతున్నట్టు పాకిస్థాన్ శుక్రవారం ప్రకటించింది. భారత్‌తో పెరుగుతున్న ఉద్రిక్తల నేపథ్యంలో తమ ప్రభుత్వ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పాక్ జాతీయ పారా ఒలింపిక్ కమిటీ వివరించింది.

సూపర్ ఓవర్ సాగిందిలా..

శ్రీలంక (2/2)	బంతి	భారత్ (3/0)
పెరీరా (అవుట్)	1	సూర్య(3)
మెండిస్ (1)	2	
షనక (0)	3	
షనక (వైడ్, 1)	4	
షనక (0)	4	
షనక (అవుట్)	5	
బౌలర్: అర్ష్‌దీప్		బౌలర్: హసరంగ



అభిషేక్ (61)

భారత్ సూపర్

సూపర్ ఓవర్‌లో శ్రీలంక ఓటమి

నిస్సాంక శతకం వృథా



నిస్సాంక (107)

దుబాయ్: ఆసియాకప్ సూపర్-4లో నామమాత్రపు మ్యాచే అయినా భారత్-శ్రీలంక మ్యాచ్ అభిమానులను ఉర్రూతలూగించింది. అయితే 203 పరుగుల ఛేదనలో లంక ఓపెనర్ నిస్సాంక (58 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 107) సెంచరీతో గెలుపు దిశగా తీసుకెళ్లినా.. చివరి ఓవర్‌లో తడబాటుతో మ్యాచ్‌ను టై చేసుకుంది. ఇక సూపర్ ఓవర్‌లో లంక ఐదు బంతుల్లో 2/2 స్కోరుతో నిలువగా, భారత్ తొలి బంతికే మూడు రన్స్ చేసి అద్భుత విజయాన్నందుకుంది. ఆదివారం పాక్‌తో సూర్య సేన ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 202 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (31 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 61), తిలక్ (34 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 49 నాటౌట్), శాంసన్ (23 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 39) వేగంగా ఆడారు. ఆ తర్వాత భారీ ఛేదనలో శ్రీలంక 20 ఓవర్లలో 5 వికెట్లకు 202 పరుగులే చేయడంతో మ్యాచ్ టై అయింది. కుశాల్ పెరీరా (32 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 58) సహకరించాడు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ మెండిస్ డకౌటైనా.. మరో ఓపెనర్ నిస్సాంక జోరుకు జట్టు తొలి 10 ఓవర్లలోనే 114/1 స్కోరుతో పటిష్ఠంగా నిలిచింది. అలాగే పెరీరాతో కలిసి రెండో వికెట్‌కు 70 బంతుల్లో 127 పరుగులు జత చేశాడు. ఆఖరి ఓవర్‌లో 12 రన్స్ కావాల్సిన వేళ తొలి బంతికే నిస్సాంక అవుట్ కావడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. ఇక చివరి బంతికి మూడు రన్స్ చేయాల్సిన వేళ లంక 2 పరుగులే తీయడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. నిస్సాంకకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది.

కలిసికట్టుగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఎప్పటిలాగే ఓపెనర్ అభిషేక్ మెరుపు ఆరంభాన్ని అందించగా, మిడిలార్డర్‌లో అక్షర్-శాంసన్ జోడీ భారీ స్కోరుకు సహకరించారు. మరో ఓపెనర్ గిల్ (4) రెండో ఓవర్‌లోనే వెనుదిరిగినా.. అభిషేక్ దూకుడు ఆగలేదు. ప్రతీ బంతిని బాదడమే లక్ష్యంగా లంక బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఐదో ఓవర్‌లో 6,4,4తో 15 రన్స్ రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లో మరో రెండు ఫోర్లతో 22 బంతుల్లోనే వరుసగా మూడో అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. దీంతో పవర్‌ప్లేలోనే జట్టు స్కోరు 71/1కి చేరుకుంది. కెప్టెన్ సూర్య (12) మాత్రం మరోసారి విఫలమై స్పిన్నర్ హసరంగకు చిక్కడంతో రెండో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం తిలక్-శాంసన్ జోడీ రన్‌రేట్ తగ్గకుండా ఆడింది. ముఖ్యంగా శాంసన్ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపిస్తూ 3 సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. నాలుగో వికెట్‌కు 66 రన్స్ జోడించాక 16వ ఓవర్‌లో శాంసన్ అవుటయ్యాడు. ఆ వెంటనే హార్దిక్ (2) నిరాశపర్చగా డెత్ ఓవర్లలో తిలక్-అక్షర్ (21 నాటౌట్) జోడీ జోరు కొనసాగించింది. చివరి బంతికి అక్షర్ సిక్సర్‌తో స్కోరు 200 దాటింది.

స్కోరుబోర్డు

భారత్: అభిషేక్ (సి) మెండిస్ (బి) అసలంక 61, గిల్ (సి అండ్ బి) తీక్షణ 4, సూర్యకుమార్ (ఎల్బీ) హసరంగ 12, తిలక్ (నాటౌట్) 49, శాంసన్ (సి) అసలంక (బి) షనక 39, హార్దిక్ (సి అండ్ బి) చమీర 2, అక్షర్ (నాటౌట్) 21, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 202/5; వికెట్ల పతనం:** 1-15, 2-74, 3-92, 4-158, 5-162; బౌలింగ్: తుషార 4-0-43-0, తీక్షణ 4-0-36-1, చమీర 4-0-40-1, హసరంగ 4-0-37-1, షనక 2-0-23-1, అసలంక 2-0-18-1.

శ్రీలంక: నిస్సాంక (సి) వరుణ్ (బి) హర్షిత్ 107, కుశాల్ మెండిస్ (సి) గిల్ (బి) హార్దిక్ 0, పెరీరా (స్టంప్డ్) శాంసన్ (బి) వరుణ్ 58, అసలంక (సి) గిల్ (బి) కుల్దీప్ 5, మెండిస్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 3, షనక (నాటౌట్) 22, జనిత్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 202/5; వికెట్ల పతనం:** 1-7, 2-134, 3-157, 4-163, 5-191; **బౌలింగ్:** హార్దిక్ 1-0-7-1, అర్ష్‌దీప్ 4-0-46-1, హర్షిత్ 4-0-54-1, అక్షర్ 3-0-32-0, కుల్దీప్ 4-0-31-1, వరుణ్ 4-0-31-1.

1 ఒకే ఆసియాకప్‌లో ఎక్కువ పరుగులు (309) సాధించిన బ్యాటర్‌గా అభిషేక్. అలాగే టీ20ల్లో ఎక్కువసార్లు వరుస (7) 30+ స్కోర్లు సాధించిన ప్లేయర్‌గా రిజ్వాన్, రోహిత్‌తో సమంగా నిలిచాడు.

అలా ఆడడం మాకు కీలకం



భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్

బెంగళూరు: వన్డే వరల్డ్ కప్‌లో తమపై భారీగా అంచనాలుంటాయని భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అంగీకరించింది. ఈ నేపథ్యంలో ఒత్తిడికి లోనుకాకుండా ఉండడమే టోర్నీలో ముఖ్యమని పేర్కొంది. ప్రతిష్ఠాత్మక మహిళల వన్డే ప్రపంచ కప్ ఈనెల 30న భారత్, శ్రీలంక వేదికలుగా ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఎనిమిది జట్ల కెప్టెన్లు శుక్రవారం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హర్మన్ మాట్లాడుతూ.. '12 ఏళ్ల తర్వాత స్వదేశంలో మెగా టోర్నమెంట్ జరగడం అద్భుతంగా ఉంది. సొంత గడ్డపై జరుగుతుండడంతో జట్టుపై సహజంగానే ఫ్యాన్స్ అంచనాలు భారీగా ఉంటాయి. అయితే ఒత్తిడికి గురికాకుండా మ్యాచ్‌లో ప్రతిక్షణాన్ని ఆస్వాదిస్తూ ఆడడం చాలా కీలకం' అని హర్మన్ వివరించింది. 30న గువాహటిలో జరిగే టోర్నీ ప్రారంభ మ్యాచ్‌లో శ్రీలంకతో భారత్ తలపడనుంది. అక్టోబరు 5న కొలంబోలో పాకిస్థాన్‌ను టీమిండియా ఢీకొననుంది. ఆ మ్యాచ్‌పై హర్మన్ మాట్లాడుతూ..పాకిస్థాన్‌తో పోరుపై దృష్టి సారిస్తామే తప్ప..ఆ మ్యాచ్ చుట్టూ జరిగే రాజకీయ అంశాలతో తమకు సంబంధంలేదని స్పష్టంజేసింది. ఇక, భారత్‌ను వారి గడ్డపై ఓడించడం కష్టమని ఆస్ట్రేలియా సారథి అలీసా హీలీ చెప్పింది. కాగా, భయంలేని క్రికెట్ ఆడతామని న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డివైన్ ప్రకటించింది.

రౌఫ్, సూర్యలకు జరిమానా

- మ్యాచ్ ఫీజులో 30 శాతం కోత
- ఫర్హాన్‌కు ఐసీసీ మందలింపు
- తీర్పుపై బీసీసీఐ అప్పీలు

దుబాయ్: భారత్‌తో జరిగిన ఆసియాకప్ సూపర్-4 మ్యాచ్‌లో రెచ్చగొట్టేలా హావభావాలు ప్రదర్శించిన పాకిస్థాన్ పేసర్ హారిస్ రౌఫ్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సీరియస్ అయ్యింది. ఈ విషయమై భారత జట్టు ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం పాక్ బస చేసిన హోటల్‌లో ఐసీసీ రెఫరీ రిచీ రిచర్డ్‌సన్ విచారణ జరిపాడు. అనంతరం.. రౌఫ్ లెవెల్ 1 నిబంధన అతిక్రమించినందుకు అతని మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధిస్తున్నట్టు రిచీ ప్రకటించాడు. గత ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో రౌఫ్ బౌండరీ లైన్ దగ్గర భారత అభిమానులకు 6-0 అనే సంకేతాన్ని చూపించాడు. ఆపరేషన్ సిందూర్‌లో తమ సైన్యం భారత్‌కు చెందిన రఫేల్ విమానాలను కూల్చారనే ఉద్దేశంతో అతను ఈ సైగలు చేశాడు. అలాగే అదే మ్యాచ్‌లో అర్ధసెంచరీ అయ్యాక ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ బ్యాట్‌తో గన్‌ఫైర్ సంబరాలు చేసుకున్నాడు. అయితే ఫర్హాన్ మాత్రం ఐసీసీ మందలింపుతో బయటపడ్డాడు. తమ పఖ్తూన్ తెగలో అలా వేడుకలు చేయడం సహజమేనంటూ ఫర్హాన్ వాదించాడు.

సూర్యకుమార్‌పైనా..: పాక్‌తో జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో విజయం సాధించాక భారత కెప్టెన్ సూర్యకుమార్ కామెంట్స్ చర్చనీయాంశమయ్యాయి. పహల్గామ్ ఉగ్రదాడికి దీటుగా భారత సైన్యం చూపిన తెగువకు ఈ విజయం అంకితమని ప్రకటించాడు. అయితే ఆటలో రాజకీయాలెందుకని పాక్ బోర్డు ఐసీసీకి ఫిర్యాదు చేసింది. దీంతో సూర్యకుమార్‌ను కూడా ఐసీసీ విచారించింది. భవిష్యత్‌లో అలాంటి వ్యాఖ్యలకు దూరంగా ఉండాలనే హెచ్చరికతో పాటు అతని మ్యాచ్ ఫీజులో ఐసీసీ 30 శాతం కోత విధించింది. అయితే, ఈ తీర్పుపై బీసీసీఐ అసంతృప్తి వ్యక్తం చేసింది. సూర్యకు జరిమానా విధించడాన్ని తప్పుపట్టిన బీసీసీఐ.. ఈ తీర్పుపై అప్పీలు చేసింది. బీసీసీఐ అప్పీలు విషయంలో ఐసీసీ సోమవారం నిర్ణయం తీసుకునే అవకాశముంది.

రాహుల్, సుదర్శన్ శతకాలు

భారత్ 'ఎ'దే సిరీస్



రాహుల్ (176 నాటౌట్)

లఖ్‌నవూ: ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో జరిగిన రెండో అనధికార టెస్టులో భారత్ 'ఎ' 5 వికెట్ల తేడాతో నెగ్గింది. కేఎల్ రాహుల్ (176 నాటౌట్), సాయి సుదర్శన్ (100) శతకాలతో రాణించారు. ఈ ఫలితంతో సిరీస్‌ను సైతం 1-0తో భారత్ దక్కించుకుంది. 412 పరుగుల భారీ ఛేదన కోసం బరిలోకి దిగిన భారత్ 'ఎ' ఆఖరిదైన నాలుగో రోజు శుక్రవారం 5 వికెట్లకు 413 పరుగులు చేసి నెగ్గింది. దేశవాళీ క్రికెట్‌లో ఇది ఆరో అతిపెద్ద విజయం. కెప్టెన్ జురెల్ (56) అర్ధసెంచరీ సాధించాడు. ఆసీస్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 420, భారత్ 'ఎ' 194 పరుగులు చేయగా.. ఆసీస్ 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు కుప్పకూలింది.

భారత కుర్రాళ్ల క్లీన్‌స్వీప్

మూడో వన్డేలోనూ ఆసీస్ చిత్తు

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత్ అండర్-19 కుర్రాళ్లు అదరగొడుతున్నారు. శుక్రవారం జరిగిన మూడో యూత్ వన్డేలో భారత్ ఏకంగా 167 పరుగులతో గెలిచింది. దీంతో ఆసీస్ అండర్-19 జట్టుతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను ఆయుష్ మాత్రే బృందం 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ముందుగా భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 280 పరుగులు చేసింది. వేదాంత్ (86), రాహుల్ (62), విహాన్ (40) రాణించారు. ఛేదనలో ఆసీస్ అండర్-19 జట్టు 28.3 ఓవర్లలో 113 పరుగులకే ఆలౌటైంది. ఖిలాన్ పటేల్‌కు 4, ఉధవ్‌కు 3, కనిష్కకు 2 వికెట్లు లభించాయి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 27-9-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

రష్యా చమురు ఎగుమతుల నిలిపివేత!

చమురుశుద్ధి కేంద్రాలపై ఉక్రెయిన్ దాడులతో రష్యాలో ఇంధన కొరత

పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై నిషేధం
ఈ ఏడాది చివరి వరకు అమలు
ఇరాన్, వెనెజువెలా నుంచి చమురు కొనుక్కుంటాం.. అనుమతించండి
అమెరికాను కోరిన భారత్? 2



ఇదేనా పద్ధతి?

సభలో పలువురు ఎమ్మెల్యేల తీరుపై సీఎం ఆగ్రహం

వ్యక్తిగత అజెండా, మంత్రులు లక్ష్యంగా వ్యాఖ్యలా?
బొజ్జల సుధీర్ రెడ్డి 'లెటర్‌ప్యాడ్' వ్యాఖ్యలపై క్లాస్
పితాని, బూర్ల ఆంజనేయులుపైనా అసహనం
పీసీబీ చైర్మన్ లక్ష్యంగా బొండా ఉమా ఆరోపణలపై ఆగ్రహం
కామినేని, బాలకృష్ణ సంవాదం జరగాల్సింది కాదనే అభిప్రాయం
మంత్రి పయ్యావుల, చీఫ్ విప్, విప్‌లు చూసుకోవాలి కదా అని ప్రశ్న
చాంబర్‌లో మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలతో సీఎం భేటీ



కొంత మంది ఎమ్మెల్యేలు పార్టీ లైన్ దాటి మాట్లాడుతున్నారు. వ్యక్తిగత అజెండాలు పెట్టుకుని మాట్లాడటం సరైన పద్ధతి కాదు. అసెంబ్లీని పైర వీలకు వేదికగా చేసుకోవడం సరైన విధానం కాదు!

అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ఏం మాట్లాడాలనే విషయాన్ని విప్‌లు, మంత్రులు చూసుకోవాలి కదా!

అక్రమ నిర్బంధాలు, అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేస్తే మనకూ, వైసీపీకీ మధ్య తేడా ఏమిటి?

-సీనియర్ నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

శాసనసభలో 'ప్రతిపక్షం' లేని మాట నిజం! అధికార పార్టీ సభ్యులే ప్రతిపక్షపాత్ర పోషిస్తూ... ప్రజా సమస్యలను లేవనెత్తుతుండటమూ నిజం! కానీ... కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు మరింత 'స్వేచ్ఛ' తీసుకుని మంత్రులపై తీవ్ర వ్యాఖ్యలతో విమర్శలకు దిగడం, సొంత అజెండాలతో ప్రశ్నలు సంధించడంపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. పలువురు ఎమ్మెల్యేల పేర్లను ప్రస్తావిస్తూ ఇటీవలి కాలంలో ఎన్నడూలేనట్లుగా ఆయన తీవ్ర స్వరంతో మండిపడ్డారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఏం మాట్లాడుతున్నారు, ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారో శాసన సభా వ్యవహారాల మంత్రిగా చూసుకోవాలి కదా అని పయ్యావుల కేశవ్‌నూ ప్రశ్నించినట్లు తెలిసింది. చీఫ్ విప్, విప్‌లూ దీనికి బాధ్యులే అని స్పష్టం చేసినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం... శుక్రవారం మధ్యాహ్నం అసెంబ్లీకి వచ్చిన వెంటనే తన చాంబర్‌లో కొందరు పార్టీ సీనియర్ నేతలు, సీనియర్ మంత్రులతో చంద్రబాబు భేటీ అయ్యారు. గురువారం నాటి పరిణామాలపై వారితో చర్చించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి గురువారం సభలో మాట్లాడుతూ.. 'ఓ ఉద్యోగి బదిలీ విషయంలో చంద్రబాబుకు, లోకేశ్‌కు, హోం మంత్రికి

మిగతా 13వ పేజీలో...

నాలా రద్దు బిల్లుకు ఆమోదం

భూవినియోగ మార్పిడి ఫీజు స్థానిక సంస్థలకే
ఈ ఫీజు ఎంత ఉండాలో అవే నిర్ణయిస్తాయి
పెండింగ్‌లో ఉన్న నాలా దరఖాస్తులు 1,281
రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

విశాఖలో జీఎంఆర్ ఏవియేషన్ వర్సిటీ, లాజిస్టిక్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తాం
పారిశ్రామికవేత్తలకు నాడు నరకం
ఎమ్మెల్యేలూ.. అభివృద్ధికి అడ్డుపడొద్దు
అజమాయిషీకి ప్రయత్నిస్తే సహించను
అసెంబ్లీలో సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

లాజిస్టిక్స్ హబ్ ఏపీ


టూరిజం, పరిశ్రమలు, క్వాంటమ్ కంప్యూటింగ్‌లోనూ నం.1 కావాలి: సీఎం

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): లాజిస్టిక్స్, రవాణా, పరిశ్రమలు, క్వాంటమ్ కంప్యూటింగ్, టూరిజం రంగాల్లో సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తంచేశారు. తెలుగువారంతా నంబర్‌వన్‌గా ఉండాలని, ప్రపంచంలోనే భారత్ ముందుండాలని చంద్రబాబు ఆకాంక్షించారు. లాజిస్టిక్స్, పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగావకాశాలు తదితర అంశాలపై శుక్రవారం అసెంబ్లీలో జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. లాజిస్టిక్స్ అంశంపై సభలో తొలిసారి మాట్లాడుతున్నానని చంద్రబాబు తెలిపారు. "వస్తురవాణాతోపాటు ప్రయాణికుల రవాణా రంగాలనూ మరింత అభివృద్ధి చేస్తాం. దేశ రవాణా రంగ వ్యయం రూ.24.07 లక్షల కోట్లు. జీడీపీలో లాజిస్టిక్స్ వాటా 7.97%. రవాణారంగంలో రహదారి వాటా 41%. లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించాల్సిన అవసరంఉంది. తూర్పు తీర ప్రాంతంలో ఉన్న రాష్ట్రం మనది. అందువల్ల వస్తురవాణా రంగంలో మనమే కీలకం. లాజిస్టిక్స్ యాజమాన్య నిర్వహణలో ప్రత్యేక ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తాం. రైల్, రోడ్, విమాన, జల

మిగతా 13వ పేజీలో...

సొమ్ము చెల్లిస్తే చెక్ బౌన్స్ నుంచి విముక్తి!

ట్రయల్ కోర్టులో వాంగ్మూలం నమోదుకు ముందే చెల్లించాలి
ఆ తర్వాత అయితే.. 5 శాతం జరిమానా
కేసు హైకోర్టుకు వెళ్తే 7.5%, సుప్రీంకోర్టుకు వస్తే 10%
చెక్ బౌన్స్ కేసుల్లో సుప్రీంకోర్టు తాజా మార్గదర్శకాలు
భారీ సంఖ్యలో పేరుకుపోతున్న చెక్ బౌన్స్ కేసులు 2



నెతన్యాహూ ప్రసంగిస్తున్న సమయంలో కుర్చీలు ఖాళీగా ఉన్న దృశ్యం

హమాస్‌ను అంతం చేస్తాం 2

ఇజ్రాయెల్ ఎలాంటి ఒత్తిళ్లకూ లొంగదు
నిరసనల నడుమ ఐరాసలో నెతన్యాహూ ప్రసంగం
పలు దేశాల ప్రతినిధుల సామూహిక వాకౌట్
వెస్ట్‌బ్యాంక్ ఆక్రమణకు గురికానీయం: డొనాల్డ్ ట్రంప్

డిప్యూటీ సీఎం పవన్‌కు తగ్గని జ్వరం


చికిత్స నిమిత్తం హైదరాబాద్ పయనం 11

పేదలకు అన్నం పెట్టే 'అన్న క్యాంటీన్ల'ను మూసేసిన మీరా మాట్లాడేది?

వైసీపీపై వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్
ఇబ్బందులు ఉన్నా హామీలను నెరవేర్చామని వెల్లడి 13
సూపర్ సిక్స్.. సూపర్ హిట్: మండలిలో మంత్రులు

ప్రజా పిటిషన్లకు ఆధార్ తప్పనిసరి!

భూ సమస్యలకు సర్వే నంబర్
పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపైనా సంబంధిత వ్యక్తి పూర్తి వివరాలు ఉండాలి 12
ప్రభుత్వానికి రెవెన్యూ శాఖ ప్రతిపాదనలు



పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆ దేశ సైన్యాధిపతి అసీం మునీర్‌తో ట్రంప్

ఫార్మాపైనా కొరడా

బ్రాండెడ్, పేటెంట్ ఔషధాలపై 100% టారిఫ్
అక్టోబరు1 నుంచి అమలు: డొనాల్డ్ ట్రంప్
2.75% పతనమైన నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 2
తగ్గిన పలు ప్రముఖ ఫార్మా కంపెనీల షేర్ల విలువ
ఈ సుంకాల పెంపు జనరిక్ ఔషధాలపై కాదు
కాబట్టి భారతీయ కంపెనీలపై ప్రభావం తక్కువే
ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయెన్స్ ప్రకటన

భారత వైరి దేశాలతో ట్రంప్ భేటీలు!

తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్‌తో.. పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్‌తో సమావేశం

ఉక్రెయిన్‌పై రష్యా వ్యూహాన్ని మోదీ ఆరా తీశారు!

అమెరికా సుంకాల నేపథ్యంలో పుతిన్‌తో మోదీ ఫోన్ సంభాషణ
నాటో చీఫ్ మార్క్ రుట్టె వ్యాఖ్యలు.. ఖండించిన విదేశాంగ శాఖ

బెయిల్ కోసం ఎత్తులు?

లిక్కర్ నిందితులు.. రోజుకో అనారోగ్య కారణం!

వెన్నునొప్పి కథ చెప్పి విఫలమైన చెవిరెడ్డి
యూరాలజీ సమస్య ఉందని చెప్పి..
ఆర్థోపెడిక్ పరీక్షలు చేయించుకున్న కసిరెడ్డి
ఎముక క్యాన్సర్ కారకాలు ఉండొచ్చని 'నివేదిక'
నిగ్గు తేల్చేందుకు కమిటీ.. 29న పరీక్షలు
నిందితులు చెబుతున్న కారణాలపై సిట్ అధికారుల సందేహాలు
పీఎస్ఆర్‌కు బెయిల్ వచ్చాక ఎత్తుగడ

ఏపీపీఎస్సీలో అక్రమాల కేసుతో పాటు ముంబై నటిని వేధించిన కేసులో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు అనారోగ్య కారణాలతో బెయిల్ పొందిన తర్వాత.. లిక్కర్ స్కామ్ నిందితులూ ఏవేవో అనారోగ్య సమస్యలు చెబుతున్నారు. నిందితులు చెబుతున్న కారణాలు, తీరుపై సిట్ అధికారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. బెయిల్ పొందేందుకే అనారోగ్యం పేరిట ఎత్తులు వేస్తున్నారని అనుమానిస్తున్నారు.





(అమరావతి-ఆంధ్రజ్యోతి)

లిక్కర్ స్కామ్‌లో నిందితుడిగా ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రెగ్యులర్ బెయిల్ రిజెక్ట్ అయింది. పీఎస్ఆర్‌కు బెయిల్ వచ్చిన తర్వాత తనకు వెన్నునొప్పి ఉందంటూ ఫిజియోథెరపీ కోసం బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన కోర్టులో పిటిషన్ వేశారు. అందుకోసం బెయిల్ అవసరం లేదని, జైలులో ఉంటూనే ఫిజియోథెరపీ చేయించుకోవచ్చని కోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. విజయవాడ జైలులో ఉన్న తనను తిరుపతి లేదా నెల్లూరు జైలుకు తరలిస్తే అక్కడ ఫిజియోథెరపీ చేయించుకుంటానన్న వాదనతోనూ కోర్టు విభేదించింది. చెవిరెడ్డి చెబుతున్న అనారోగ్య కారణాల్లో నిజం లేదన్న పోలీసుల తరఫు న్యాయవాది వాదనతో న్యాయాధికారి ఏకీభవించారు. ఇక వరుసగా రెగ్యులర్ బెయిల్ పిటిషన్లు కోర్టులో రిజెక్ట్ అవుతుండటంతో మద్యం కుంభకోణంలో కర్త, కర్మ, క్రియగా భావిస్తున్న ఏ1 రాజ్ కసిరెడ్డి కూడా అనారోగ్య కారణాలతో బెయిల్ కోరారు. ఏప్రిల్ నుంచి విజయవాడ జైలులో ఉంటున్న రాజ్ కసిరెడ్డికి మూత్రనాళంలో ఇన్‌ఫెక్షన్ వచ్చింది. జైలు మెడికల్ ఆఫీసర్ ఆయన్ను పరీక్షించి మందులు ఇవ్వడంతో నయమైంది. ఇటీవల మరోసారి తనకు మూత్రంలో

మిగతా 11వ పేజీలో...

'లడ్డూ' సిట్‌కు పచ్చజెండా

హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యిపై సిట్ యథావిధిగా దర్యాప్తు చేయవచ్చు
నిర్దిష్ట అధికారిని దర్యాప్తు బృందం నియమించుకుంటే తప్పేంటి?
మొత్తం పర్యవేక్షణ సీబీఐ డైరెక్టర్‌దే కదా!.. చీఫ్ జస్టిస్ గవాయ్ అసహనం
వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్నకు త్రిసభ్య ధర్మాసనం నోటీసులు
విచారణ నవంబరు 14కు వాయిదా 11



బంగాళాఖాతంలో వాయుగుండం

నేడు ఒడిసాలో తీరం దాటే అవకాశం 3
కోస్తాలో వర్షాలు, నేడు భారీ వర్ష సూచన
ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక
2న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం



కర్నూలు జిల్లా కోడుమూరులోని పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు



మిగ్‌లకు వీడ్కోలు సందర్భంగా వైమానిక దళ విన్యాసం 2

మిస్ యూ మిగ్!

మిగ్-21 ఫైటర్‌జెట్ సేవలకు వీడ్కోలు
వాయుసేనలో ఓ సువర్ణాధ్యాయానికి తెర
ఎన్నో యుద్ధాలు, ఆపరేషన్లలో పరాక్రమం
ఆరు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ సేవలు

ఫార్మాపైనా ట్రంప్ సుంకాల కొరడా

బ్రాండెడ్, పేటెంటెడ్ ఔషధాలపై 100% టారిఫ్.. అక్టోబరు 1 నుంచి అమల్లోకి రానున్నట్టు వెల్లడి



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాల కత్తి ఝుళిపించారు. బ్రాండెడ్, పేటెంటెడ్ ఫార్మాస్యూటికల్ డ్రగ్స్‌పై 100శాతం, కిచెన్ క్యాబినెట్లు, బాత్‌రూమ్ వ్యానిటీ (సింక్, దాని కింద ఉండే స్టోరేజీ క్యాబినెట్)లపై 50%, అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్‌పై (కుషన్ ఉన్న సోఫాలు/కుర్చీల వంటివి) 30%, హెవీ ట్రక్కులపై 25% దిగుమతి సుంకాలు విధిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఈ సుంకాల గురించి ట్రంప్ తన సొంత సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్' పోస్టు ద్వారా వెల్లడించారు. "అక్టోబరు 1 నుంచి.. బ్రాండెడ్, పేటెంటెడ్ ఫార్మా ఉత్పత్తులపై 100శాతం సుంకం విధిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులన్నీ విదేశాల నుంచి అమెరికాను వరదలా ముంచెత్తుతున్నాయని.. ఇది చాలా అన్యాయమని.. అమెరికా జాతీయ భద్రతను కాపాడుకోవడం కోసం, ఇతర కారణాలరీత్యా, అమెరికా తయారీ రంగాన్ని రక్షించుకోవడానికే వాటిపై సుంకాలు విధిస్తున్నానని పేర్కొన్నారు. అమెరికాలో తయారీ ప్లాంట్లను నిర్మిస్తున్న కంపెనీలకు (నిర్మాణం మొదలుపెట్టినవి/ఇప్పటికే జరుగుతున్నవి) ఈ సుంకాలు వర్తించవని ట్రంప్ తెలిపారు. ఇప్పటికే అమెరికాలో ఫ్యాక్టరీలు నిర్మించిన కంపెనీలకు ఈ సుంకాలు వర్తిస్తాయా? లేదా అనే అంశంపై స్పష్టత లేదు.

మన కంపెనీలపై..

ట్రంప్ సుంకాల ప్రకటనతో నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ శుక్రవారం 2.5శాతం పతనమైంది. సన్ ఫార్మా షేరు ధర 4.87శాతం తగ్గి 52వారాల కనిష్టానికి (రూ.1,548), గ్లాండ్ ఫార్మా షేరు 4.7% తగ్గి రూ. 1,880కి.. బయోకాన్ షేర్ 3.68% తగ్గి రూ.342.85కు చేరాయి. లారస్‌ల్యాబ్స్, ఇప్కా ల్యాబ్స్, దివీస్, జైడస్ లైఫ్, అలెంబిక్ ల్యాబ్స్, సిప్లా, అజంతా ఫార్మా, డాక్టర్ రెడ్డీస్, టొరెంట్ ఫార్మా, అబ్బాట్ ఇండియా, గ్లెన్‌మార్క్ తదితర కంపెనీల షేర్లు 0.8%-3.2% పతనమయ్యాయి. ట్రంప్ విధించిన సుంకాలు బ్రాండెడ్, పేటెంటెడ్ ఔషధాలపైనే కాబట్టి జనరిక్ ఔషధాలకు మినహాయింపు ఉండటంతో ఈ సుంకాల ప్రభావం భారత కంపెనీలపై తక్షణమే పెద్దగా పడదని డాక్టర్‌రెడ్డీస్, సన్ ఫార్మా సహా దేశంలోని 23ప్రముఖ ఫార్మా కంపెనీల సమాహారమైన ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయెన్స్ (ఐపీఏ) సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ తెలిపారు. భారత ఫార్మా ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించే ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్స్‌ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) చైర్మన్ నమిత్ జోషీ ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. మన కంపెనీల ఎగుమతుల్లో ఎక్కువ సాధారణ జనరిక్ ఔషధాలే కాబట్టి.. పెద్దపెద్ద భారతీయ కంపెనీలన్నీ ఇప్పటికే అమెరికాలో కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి కాబట్టి సుంకాల తక్షణ ప్రభావం అంతగా ఉండదన్నారు. భారత్ వీలైనంత త్వరగా అమెరికాతో, ఈయూతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలని ఫౌండేషన్ ఫర్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ వ్యవస్థాపక సంచాలకుడు రాహుల్ అహ్లూవాలియా సూచిస్తున్నారు.

ఇదిలా ఉండగా.. భారతదేశ ఫార్మా ఉత్పత్తులకు అతిపెద్ద ఎగుమతి మార్కెట్.. అమెరికానే! ఫార్మెక్సిల్ లెక్కల ప్రకారం.. 2024-25ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి 27.9 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు వివిధ దేశాలకు ఎగుమతి కాగా.. అందులో అత్యధికంగా 31శాతం ఉత్పత్తులు అమెరికాకే వెళ్లాయి. ఆ ఉత్పత్తుల విలువ 8.7బిలియన్ డాలర్లు (దాదాపు రూ.77,138కోట్లు). ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరునెలల్లో 3.7బిలియన్ డాలర్ల (దాదాపు రూ.32,505 కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతయ్యాయి. అమెరికాలో వాడే జనరిక్ మందుల్లో 45%, బయోసిమిలర్ డ్రగ్స్‌లో (జనరిక్ అంటే అసలు మందుకు పూర్తిస్థాయి నకళ్లు. బయోసిమిలర్ అంటే.. అసలు మందుతో దాదాపు సమానమైన మిశ్రమాలుండే ఔషధాలు)15% ఔషధాలు భారత్ నుంచే సరఫరా అవుతాయి. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జైడస్ లైఫ్‌సైన్సెస్, సన్ ఫార్మా, గ్లాండ్ ఫార్మా వంటి కంపెనీల మొత్తం ఆదాయంలో 30-50శాతం ఆదాయాన్ని అమెరికా నుంచే ఆర్జిస్తాయి. అమెరికా నుంచి వచ్చే ఆదాయంలో అధికభాగం ఆయా కంపెనీలకు.. జనరిక్ ఔషధాలతోనే వస్తుంది. భారత్ నుంచి ఎగుమతయ్యే 8.7 బిలియన్ డాలర్ల ఉత్పత్తుల్లో బ్రాండెడ్ ఔషధాల విలువ 10%లోపు ఉంటుందని అంచనా. ఈమేరకు సుంకాల ప్రభావం భారత ఫార్మాపై ఉంటుందని పరిశ్రమ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

అమెరికాకే నష్టం

తాజా సుంకాల పెంపు అమెరికా ఆర్థిక వ్యవస్థపై మరో దశ అనిశ్చితికి కారణమవుతుందని.. ఆ దేశ స్టాక్‌మార్కెట్లు బలంగానే ఉన్నా, సుంకాల భారాన్ని ప్రజలపై వేయడం వల్ల ధరలు, ద్రవ్యోల్బణం పెరిగి, ఉద్యోగాలు తగ్గుతాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. సుంకాల వల్ల ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం లేదని ట్రంప్ చెబుతున్నప్పటికీ..గణాంకాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో 2.3శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం సెప్టెంబరుకు 2.9శాతానికి చేరడమే ఇందుకు నిదర్శనమని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదొక్కటే కాదు.. సుంకాల దెబ్బకు ముడిపదార్థాల ధరలు పెరిగి ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోతున్నాయి. దీంతో కంపెనీలు పెద్ద ఎత్తున ఉద్యోగుల్ని తొలగిస్తున్నాయి. అమెరికా బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ ప్రకారం.. ఏప్రిల్ నుంచి ఇప్పటి దాకా ఉత్పత్తి రంగంలో 42వేల ఉద్యోగాలు, నిర్మాణ రంగంలో 8 వేల ఉద్యోగాలు పోయాయి.

వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం కుదిరేలా చర్చలు

- భారత్, అమెరికా నిర్ణయం
- కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: పరస్పర ప్రయోజనకర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని వీలైనంత త్వరగా కుదుర్చుకునేందుకు చర్చలు కొనసాగించాలని భారత్, అమెరికా నిర్ణయించినట్టు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వాణిజ్య చర్చల నిమిత్తం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలో న్యూయార్క్‌కు వెళ్లిన భారత ప్రతినిధుల బృందం మూడు రోజుల చర్చల అనంతరం బుధవారం భారత్‌కు తిరిగి వచ్చింది. ఈ నేపథ్యంలో వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటన చేసింది. వాణిజ్య ఒప్పందంపై ఇరుపక్షాలు నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించినట్టు పేర్కొంది. ఒప్పందంలోని వివిధ అంశాలపై ఇరుపక్షాలు అభిప్రాయాలను వ్యక్తం చేశాయని, పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందాన్ని త్వరగా కుదుర్చుకునేందుకు చర్చలను కొనసాగించాలని నిర్ణయించినట్టు తెలిపింది. కాగా తదుపరి చర్చలకు సంబంధించిన తేదీలను ఇంకా ఖరారు చేయలేదు. భారత్‌పై తొలుత 25శాతం సుంకం విధించిన అమెరికా.. రష్యా నుంచి ముడిచమురును కొనుగోలు చేస్తున్నందుకు అదనంగా మరో 25శాతం సుంకాన్ని విధించడంతో మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. కాగా భారత్ 25శాతం అదనపు సుంకాన్ని తొలగించాలని కోరినట్టు ఓ అధికారి తెలిపారు. బ్రాండెడ్ ఫార్మాసూటికల్ డ్రగ్స్‌పై 100శాతం దిగుమతి సుంకం విధించాలన్న డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం వల్ల భారత్ ఎగుమతులపై ప్రభావం ఉంటుందన్నారు.

సోనమ్ వాంగ్‌చుక్ అరెస్ట్

- ఎన్ఎస్ఏ కింద అదుపులోకి.. జోధ్‌పూర్ జైలుకు తరలింపు

లద్దాఖ్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. లద్దాఖ్‌లో హింసకు ఆయనే కారణమని, యువతను రెచ్చగొట్టే ప్రకటనలు చేశారని కేంద్ర హోం శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇదే కారణంతో తనను అరెస్టు చేస్తే సంతోషమని వాంగ్‌చుక్ గురువారం ప్రకటించారు. మర్నాడే అంటే శుక్రవారమే పోలీసులు ఆయన్ను అరెస్టు చేయడం గమనార్హం. డీజీపీ ఎస్డీ సింగ్ ఆధ్వర్యంలోని పోలీసుల బృందం వాంగ్‌చుక్‌ను అదుపులోకి తీసుకుంది. కఠినమైన జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద ఆయన్ను అరెస్టు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ చట్టం కింద అరెస్టు చేస్తే బెయిలు రావడం కష్టం. అరెస్టు అనంతరం ఆయనను రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైలుకు తరలించారు. వాంగ్‌చుక్ అరెస్టును జమ్మూకశ్మీరు సీఎం ఒమర్ అబ్దుల్లా ఖండించారు. అరెస్టు అన్యాయమని కాంగ్రెస్ పేర్కొంది. వాంగ్‌చుక్ అరెస్టును ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా ఆప్ అధినేత కేజ్రీవాల్ అభివర్ణించారు. దేశంలో నియంత పాలన కొనసాగుతోందని ఆరోపించారు.

చెక్కుల క్లియరెన్స్ చిటికెలో..!

- సుదీర్ఘ నిరీక్షణకు ఆర్బీఐ చెక్.. 4 నుంచి అమలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: వివిధ అవసరాల నిమిత్తం బ్యాంకుల్లో వేసే చెక్కులు పరిష్కారం అయి.. నగదు ఖాతాల్లోకి చేరేందుకు రోజుల తరబడి నిరీక్షిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం చెక్కులు పరిష్కారం అయి, నగదు ఖాతాలో పడేందుకు రెండు నుంచి ఒక్కొక్కసారి నాలుగు రోజుల సమయం పడుతోంది. అయితే, వచ్చే నెల నుంచి ఈ నిరీక్షణ తప్పనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) తీసుకువచ్చిన కొత్త నిబంధన ఖాతాదారులకు కేవలం కొన్ని గంటల్లోనే సొమ్ము చేతికి అందేలా చేయనుంది. దీని ప్రకారం ఏదైనా బ్యాంకులో చెక్కు వేసిన రోజే దానిని పరిష్కరించనున్నారు. అంతేకాదు.. చెక్కు పరిష్కారమైన గంటల వ్యవధిలోనే నిర్దేశిత బ్యాంకు ఖాతాలోకి సొమ్ము జమకానుంది. చెక్కుల పరిష్కారంలో మైలురాయి వంటి ఈ నిబంధన అక్టోబరు 4వ తేదీ నుంచి అమలులోకి రానుంది.

ఓపీటీ విద్యార్థులపై ట్రంప్ సర్కారు కన్ను

- విద్యార్థుల నివాసాలు, హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు
- వారి ఐ-983 ఫామ్‌లు, ఇతర పత్రాల పరిశీలన
- స్టెమ్ ఓపీటీలో దాదాపు లక్ష మంది భారతీయ విద్యార్థులు!

వాషింగ్టన్, సెప్టెంబరు 26: ఇన్నాళ్లుగా అమెరికాలో అక్రమంగా నివాసం ఉంటున్న వలసదారులపైనే దృష్టి పెట్టిన ట్రంప్ సర్కారు.. తాజాగా ఆ దేశంలో ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్) ప్రోగ్రాంలో ఉన్న విద్యార్థులపై నిఘా పెంచింది! ముఖ్యంగా.. రెండేళ్ల స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమెటిక్స్) ఓటీపీ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న విద్యార్థుల ఇళ్లు, హాస్టళ్లలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నారా లేదా ఆరా తీస్తున్నారు. 2023-24 నాటి ఓపెన్‌డోర్స్ రిపోర్ట్ ప్రకారం.. 3.3 లక్షల మంది భారతీయ విద్యార్థులు అమెరికాలో చదువుకుంటున్నారు. 97,556 మంది ఓపీటీ ప్రోగ్రామ్‌లో ఉన్నారు. వారిలో అత్యధికులు స్టెమ్ ఓపీటీలో ఉన్నారు. సాధారణ ఓపీటీ 12 నెలలు మాత్రమే ఉంటుంది. అదే స్టెమ్ విద్యార్థులైతే.. అదనంగా మరో 2 సంవత్సరాల ఓపీటీ పొందగలరు. అంటే.. మొత్తం మూడేళ్ల పని అనుభవం వారికి లభిస్తుంది. అలా స్టెమ్ ఓపీటీపై ఉన్నవారంతా అధికారుల నిఘానేత్రం పరిధిలో ఉన్నట్టే. వారి 'ఫామ్-ఐ983ని తనిఖీ చేసే అధికారం.. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్ సీఐఎస్)లోని 'ఫ్రాడ్ డిటెక్షన్ అండ్ నేషనల్ సెక్యూరిటీ (ఎఫ్‌డీఎన్ఎస్)' విభాగం అధికారులకు ఉంటుంది. స్టెమ్ ఓపీటీలో ఉన్నవారు సంబంధిత రంగంలోనే శిక్షణ పొందుతున్నారా లేదా? వారి ఎఫ్-1 వీసా హోదా అమల్లో ఉందా లేదా? తదితర అంశాలను పరిశీలిస్తారు. ఈ క్రమంలోనే అధికారులు తాను ఉన్న చోటుకు అకస్మాత్తుగా వచ్చి.. తన పత్రాలు పరిశీలించారని, మరిన్ని ధ్రువ పత్రాలు చూపించాల్సిందిగా కోరారని ఇటీవలే స్టెమ్ ఓపీటీకి అనుమతి పొందిన ఒక విద్యార్థి తెలిపాడు. పలు వర్సిటీల హాస్టళ్లలో కూడా తనిఖీలు చేస్తున్నట్టు మరో విద్యార్థి వివరించాడు. ట్రంప్ సర్కారు ఇకపై ఈ తనిఖీలను మరింత విస్తృతం చేస్తుందని ఫ్లోరిడాకు చెందిన ఇమ్మిగ్రేషన్ అటార్నీ అశ్విన్ శర్మ అభిప్రాయపడ్డారు. విద్యార్థులంతా పత్రాలను అప్-టు-డేట్‌గా ఉంచుకోవాలని... అధికారులు వచ్చినప్పుడు ఆందోళనకు గురి కావొద్దని, వారు అడిగిన ప్రశ్నలకు నిజాయతీగా జవాబులు చెప్పాలని సూచించారు. సమాధానాలు చెప్పకున్నా.. అధికారులకు సహకరించకున్నా ఓపీటీనే కాక విద్యార్థి వీసాను సైతం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

హమాస్‌ను అంతం చేస్తాం

ఇజ్రాయెల్ ఎలాంటి ఒత్తిళ్లకు లొంగదు.. ఐరాసలో నెతన్యాహూ

ఐక్యరాజ్యసమితి, సెప్టెంబరు 26: హమాస్‌ను అంతం చేయడమే లక్ష్యమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ ప్రకటించారు. శుక్రవారం ఐక్యరాజ్యసమితిలో ప్రసంగిస్తూ ఇజ్రాయెల్ తప్పకుండా ఆ పనిని పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. అంతర్జాతీయంగా ఏకాకిగా మిగిలినప్పటికీ, పలు దేశాల ప్రతినిధులు నిరసన తెలిపి మూకుమ్మడిగా వాకౌట్ చేసినప్పటికీ ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించారు. పాశ్చాత్య దేశాలు ఒత్తిళ్లకు లొంగినా ఇజ్రాయెల్ మాత్రం ఎలాంటి ఒత్తిళ్లకు లొంగదన్న గ్యారెంటీ ఇస్తున్నట్టు తెలిపారు. పాలస్తీనా దేశాన్ని గుర్తించడమంటే యూదులు, అమాయకులకు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్టేనని వ్యాఖ్యానించారు. దీనికి వ్యతిరేకంగా కొందరు కేకలు వేయగా, మరో మూల కొందరు చప్పట్లు కొట్టడం కనిపించింది. తమ ఆధీనంలోని వెస్ట్ బ్యాంక్, తూర్పు జరూసలేం, గాజా స్ట్రిప్‌లను ప్రత్యేక దేశంగా గుర్తించాలంటూ పాలస్తీనియన్లు చేస్తున్న డిమాండును తిరస్కరించారు. నెతన్యాహూ ప్రసంగానికి సిద్ధం కాగా, నిరసన తెలుపుతూ పలు దేశాల ప్రతినిధులు సామూహికంగా వాకౌట్ చేశారు. ఆయన మాట్లాడుతున్నప్పుడు చాలా మంది కేకలు వేసి గొడవ చేశారు. నెతన్యాహూ 'శాపం' అని రాసి ఉన్న తమ దేశం మ్యాప్‌ను చూపించారు.

బందీలను గాజాలో సెల్‌ఫోన్లు లాక్కొని ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం

ఐరాసలో నెతన్యాహూ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడం కోసం ఇజ్రాయెల్ సైన్యం గాజా వాసుల సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొంది. అందరూ దాన్నే వీక్షించేలా ఒత్తిడి తీసుకొచ్చింది. ఈ విషయాన్ని నెతన్యాహూ తన ప్రసంగంలో ప్రస్తావించారు కూడా. హమాస్ వద్ద ఇంకా బందీలుగా ఉన్న 20 మంది పేర్లను చదివారు. ఇంతవరకు వారితో మాట్లాడలేకపోవడంతో ఐరాస వేదికగా సంభాషిస్తున్నట్టు తెలిపారు. అజ్ఞాత ప్రదేశంలో ఉన్న బందీలకు ప్రసంగం వినపడేలా గాజాలో క్రేన్లు, లారీలకు లౌడ్ స్పీకర్లు బిగించి తిప్పారు. 'మిమ్మల్ని ఇంటికి తీసుకొచ్చే వరకు విశ్రాంతి లేదు' అంటూహిబ్రూ, ఇంగ్లీషు భాషల్లో మాట్లాడారు.

లోకం తీరు



ఉక్రెయిన్‌పై మాస్కో వ్యూహాన్ని మోదీ ఆరా తీశారు!

- నాటో చీఫ్ మార్క్ రుట్టె కీలక వ్యాఖ్యలు
- నిరాధారం.. అవాస్తవం: విదేశాంగ శాఖ

వాషింగ్టన్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి.. ఉత్తర అట్లాంటిక్ ఒప్పంద సంస్థ (నాటో) చీఫ్ మార్క్ రుట్టె కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధిస్తున్న సుంకాలతో భారత్ తీవ్ర ప్రభావానికి గురవుతోందని, ఆ ప్రభావం రష్యాపైనా పరోక్షంగా పడుతోందని తెలిపారు. ఈ క్రమంలో ఉక్రెయిన్‌పై రష్యా అనుసరిస్తున్న వ్యూహం ఏంటనే విషయాన్ని భారత ప్రధాని పదే పదే రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఆరా తీస్తున్నారని వ్యాఖ్యానించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి 80వ సర్వప్రతినిధుల సభకు హాజరైన రుట్టె సీఎన్ఎన్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత ప్రభుత్వం.. రష్యా సర్కారుతో టచ్‌లో ఉంది. ఉక్రెయిన్‌పై రష్యా అనుసరిస్తున్న వ్యూహాన్ని.. ప్రధాని మోదీ పదేపదే కోరినట్టు తెలిసింది." అని అన్నారు. భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలు.. రష్యాపైనా పెద్ద ప్రభావమే చూపిస్తున్నాయని తెలిపారు. "పుతిన్‌కు ఫోన్ చేసిన మోదీ.. ఉక్రెయిన్‌పై వ్యూహాన్ని వివరించాలని కోరారు. దీనికి కారణం.. భారత్‌పై సుంకాల ప్రభావం తీవ్రంగా ఉండడమే." అని రుట్టె వ్యాఖ్యానించారు. కాగా ప్రధాని మోదీ.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేసి.. ఉక్రెయిన్‌పై అనుసరిస్తున్న వ్యూహాన్ని అడిగారంటూ నాటో చీఫ్ మార్క్ రుట్టె చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యలను తిప్పికొడుతున్నట్టు భారత విదేశాంగ శాఖ తెలిపింది. రుట్టె చేసిన వ్యాఖ్యలు అవాస్తవం, నిరాధారమని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇలాంటి వ్యాఖ్యలు చేసే ముందు ఆలోచించుకోవాలని, బాధ్యతగా వ్యవహరించాలని నాటో చీఫ్‌ను కోరింది. ఎప్పుడూ జరగని సంభాషణ గురించి ఊహాజనిత వ్యాఖ్యలు చేశారని పేర్కొంది.

సొమ్ము చెల్లిస్తే చెక్ బౌన్స్ నుంచి విముక్తి!

- చెక్‌బౌన్స్ కేసుల్లో సుప్రీంకోర్టు తాజా మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: చెక్ బౌన్స్ కేసులో నిందితులు తమ వాంగ్మూలం నమోదుకు ముందే చెక్‌లోని మొత్తాన్ని చెల్లిస్తే ఎటువంటి జరిమానా విధించకుండా ట్రయల్‌కోర్టు న్యాయాధికారి ఆ కేసు కొట్టేయవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ నిందితుడు తన వాంగ్మూలం నమోదు తర్వాత (విచారణ కోర్టు తీర్పునకు ముందే) చెక్‌లోని మొత్తాన్ని చెల్లిస్తే.. న్యాయాధికారి, చెక్‌లో పేర్కొన్న మొత్తం మీద 5 శాతాన్ని న్యాయసేవల ప్రాధికార సంస్థకు లేదా సంబంధిత సంస్థకు చెల్లించాలని ఆదేశిస్తూ కేసును ముగించవచ్చని తెలిపింది. చెక్ బౌన్స్ కేసు సెషన్స్ కోర్టు లేదా హైకోర్టు వరకు వస్తే.. న్యాయమూర్తి చెక్‌లోని మొత్తం మీద అదనంగా 7.5% చెల్లింపునకు ఆదేశించవచ్చని, సుప్రీంకోర్టుకు ఆ కేసు వస్తే అదనంగా 10% చెల్లింపునకు ఆదేశించి కేసును కొట్టేయవచ్చని తెలిపింది. దేశంలోని ప్రధాన నగరాల జిల్లా కోర్టుల్లో చెక్ బౌన్స్ కేసులు భారీగా పేరుకుపోతున్న నేపథ్యంలో, వాటి పరిష్కారానికి సుప్రీంకోర్టు శుక్రవారం కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుతం చెక్‌బౌన్స్ కేసులను నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ (ఎన్ఐ) యాక్ట్‌లోని 15ఏళ్ల నాటి నిబంధనలకు అనుగుణంగా విచారిస్తున్నారు. వీటిలో సవరణలు చేస్తూ జస్టిస్ మన్మోహన్, జస్టిస్ ఎన్వీ అంజారియాల సుప్రీంకోర్టు ధర్మాసనం తాజా మార్గదర్శకాలను వెలువరించింది. చెక్‌బౌన్స్ కేసులు భారీగా పేరుకుపోతుండటంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్ఐ చట్టంలోని సెక్షన్ 138 కింద నమోదైన (చెక్‌బౌన్స్) కేసుల్లో నిందితుడికి సమన్లు జారీ చేసే ప్రక్రియ కూడా కేసులు పెండింగులో ఉండటానికి ఓ ప్రధాన కారణమవుతోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనికి పరిష్కారంగా దస్తీ సమన్లను కూడా ఇకమీదట అనుమతించాలని ఆదేశాలు జారీ చేసింది.

భారత వైరి దేశాలతో ట్రంప్ వరుస భేటీలు!

తొలుత తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగన్‌తో సమావేశం.. పౌర అణు భాగసామ్య ఒప్పందంపై సంతకాలు

- తర్వాత పాక్ ప్రధాని ఆర్మీ చీఫ్‌తో సమావేశం



తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో ట్రంప్ భేటీ

న్యూయార్క్/ఇస్లామాబాద్, సెప్టెంబరు 26: భారత వైరి దేశాలు తుర్కియే, పాకిస్థాన్‌లతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వరుస భేటీలు నిర్వహించారు. అమెరికా కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం శ్వేతసౌధంలో ఈ సమావేశాలు జరిగాయి. మొదట తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో ట్రంప్ సమావేశమయ్యారు. యూఎస్ఏ, తుర్కియే మధ్య పౌర అణు సహకారం, టర్కీకి ఎఫ్-35 యుద్ధ విమానాల విక్రయం అంశంపై చర్చించారు. యుద్ధ విమానాల కొనుగోలుపై స్పష్టత రాకపోయినా పౌర అణు సహకారంపై మాత్రం ఒప్పందానికి వచ్చారు. ఈ మేరకు ట్రంప్, ఎర్డోగాన్‌ల సమక్షంలో 'వ్యూహాత్మక పౌర అణు సహకారం' ఒప్పందంపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, తుర్కియే మంత్రి బేరాక్తర్ సంతకాలు చేశారు. నిజానికి నాటో సభ్యదేశమైన తుర్కియేకు అత్యాధునిక ఎఫ్-35 ఫైటర్లను సరఫరా చేయడానికి గతంలో అమెరికా ముందుకొచ్చింది. కానీ తుర్కియే 2019లో రష్యా నుంచి ఎస్-400 క్షిపణి రక్షణ వ్యవస్థను కొనుగోలు చేయడంతో ఎఫ్-35 ఫైటర్లు ఇవ్వలేదు. రష్యా క్షిపణి రక్షణ వ్యవస్థను వదులుకుంటే ఎఫ్-35 ఫైటర్లను ఇవ్వడానికి సిద్ధమని ఇటీవల ఆఫర్ చేసింది. దీనిపైనే ట్రంప్, ఎర్డోగాన్ తాజాగా చర్చలు జరిపారు. ఫైటర్ల విక్రయం, ఆంక్షల ఎత్తివేతపై ట్రంప్ సానుకూల సంకేతాలు ఇచ్చినట్టు భేటీ అనంతరం ఎర్డోగాన్ పేర్కొన్నారు.

పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్‌తో సుదీర్ఘ భేటీ..

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌లతోనూ శ్వేతసౌధంలో ట్రంప్‌తో భేటీ అయ్యారు. చాలావరకు ట్రంప్ భేటీలకు మీడియాను అనుమతిస్తారు. కానీ ఈ భేటీకి మీడియాను అనుమతించకుండా సుమారు 80 నిమిషాల పాటు చర్చించారు. ఇందులో వారితోపాటు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా పాల్గొన్నారు. ప్రాంతీయ భద్రత, ఉగ్రవాద వ్యతిరేక చర్యలపై సహకారం తదితర అంశాలపై వారు చర్చించినట్టు అమెరికా అధికార వర్గాలు పేర్కొన్నాయి. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ శ్వేతసౌధంలో అడుగుపెట్టడం ఇదే మొదటిసారి. అంతకు ముందు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్) ఆసిమ్ గొప్ప వ్యక్తులని ట్రంప్ అభివర్ణించారు.

కశ్మీర్‌పై టర్కీ వ్యాఖ్యలు.. భారత్ అభ్యంతరం

పాకిస్థాన్‌కు ఆప్తమిత్ర దేశమైన టర్కీ మరోసారి కశ్మీర్ అంశంలో కల్పించుకుంది. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సాధారణ సభ సమావేశంలో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ ప్రసంగిస్తూ.. కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. "భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ హర్షణీయం. ఇరు దేశాల మధ్య ఉన్న కశ్మీర్ వంటి కీలక వివాదాన్ని ఐక్యరాజ్యసమితి తీర్మానాల ఆధారంగా, చర్చలతో పరిష్కరించుకోవాలి" అని పేర్కొన్నారు. దీనిపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మండిపడ్డారు. "ఎర్డోగాన్ వ్యాఖ్యలు అభ్యంతరకరం. భారత సార్వభౌమత్వం, సమగ్రత అంశాల్లో ఎలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని ఒప్పుకొనే ప్రసక్తే లేదు. కశ్మీర్ విషయంలో మా వైఖరి చాలా స్పష్టంగా ఉంది. భారత్, పాక్ ద్వైపాక్షిక అంశాల్లో మరో దేశం జోక్యం ఏ మాత్రం అవసరం లేదు" అని పేర్కొన్నారు.

కోటుకు యుద్ధ విమానం పిన్ పెట్టుకుని..

శ్వేతసౌధంలో టర్కీ, పాక్ నేతలతో చర్చల సమయంలో ట్రంప్ తన కోటుకు యుద్ధ విమానం చిత్రమున్న పిన్‌ను పెట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఆ రెండూ భారత్‌కు వైరి దేశాలు కావడంతో.. ట్రంప్ పరోక్షంగా ఏవో సంకేతాలు ఇస్తున్నారనే ప్రచారం జరిగింది. అయితే టర్కీకి ఎఫ్-35 విమానాలు విక్రయించే అంశంపై చర్చ నేపథ్యంలోనే ట్రంప్ అలా పిన్ పెట్టుకున్నారని శ్వేతసౌధం అధికారవర్గాలు పేర్కొన్నాయి. కానీ తర్వాత మీడియా సమావేశంలోనూ, పాక్ ప్రధాని, ఆర్మీ చీఫ్‌లతో భేటీ సమయంలోనూ ట్రంప్ ఆ యుద్ధ విమానం పిన్‌ను పెట్టుకునే ఉండటం గమనార్హం.

రష్యా చమురు ఎగుమతుల నిలిపివేత!

- చమురుశుద్ధి కేంద్రాలపై ఉక్రెయిన్ దాడులతో రష్యాలో ఇంధన కొరత

మాస్కో/న్యూఢిల్లీ, సెప్టెంబరు 26: చమురు ఎగుమతులపై రష్యా నిషేధం విధించింది. చమురుశుద్ధి కేంద్రాలపై ఉక్రెయిన్ వరస దాడులతో ఈ నిర్ణయం తీసుకుంది. రష్యా ఇంధన సరఫరా వ్యవస్థలపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో చమురు కొరత ఏర్పడింది. ఉక్రెయిన్ దాడుల కారణంగా రష్యాలో కొన్ని రోజుల్లో అయితే దాదాపు ఐదో వంతు చమురు శుద్ధి సామర్థ్యం పడిపోతోంది. ఈ నేపథ్యంలో అన్ని రకాల ఇంధన ఎగుమతులను నిలిపివేయాలని రష్యా నిర్ణయించింది. ఈ నిషేధం ఈ ఏడాది చివరి వరకు అమల్లో ఉండనుందని రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నోవాక్ తెలిపారు. చమురు ఉత్పత్తుల్లో కొద్దిపాటి కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అయితే, ఈ కొరతను తమ వద్ద ఉన్న చమురు నిల్వలు భర్తీ చేస్తాయని పేర్కొన్నారు. రష్యా నుంచి ఎగుమతి అయ్యే పెట్రోలుపై మార్చిలో కొంత మేరకు నిషేధం విధించగా.. దాన్ని జూలైలో మళ్లీ పొడిగించారు. తాజాగా ఆ నిషేధాన్ని మరోసారి పొడిగిస్తున్నట్లు అలెగ్జాండర్ ప్రకటించారు. డీజిల్ ఎగుమతులను కూడా కొంత మేరకు నిషేధించినట్లు వెల్లడించారు. కాగా, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాల కారణంగానే కొన్ని చమురుశుద్ధి కర్మాగారాలను మూసివేయాల్సి వచ్చిందని రష్యా అధికారులు పేర్కొనడం గమనార్హం.

ఇరాన్, వెనెజువెలా నుంచి చమురు దిగుమతికి అనుమతి ఇవ్వండి: భారత్

రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నారన్న కారణంతో భారత్‌పై అమెరికా 25% ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్, వెనెజువెలాల నుంచి చమురు దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని భారత్ అమెరికాను కోరినట్లు సమాచారం. ఉక్రెయిన్‌తో పోరు వల్ల తనపై అంతర్జాతీయ ఆంక్షలు విధించడంతో రష్యా చమురు ధరలను భారీగా తగ్గించింది. దీంతో భారత్ పెద్దఎత్తున రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటోంది. చౌకగా వస్తున్న చమురుతో భారీగా లబ్ధి పొందుతోంది. కాగా, ఇరాన్, వెనెజువెలాలోని సరఫరాదారులు కూడా తక్కువ ధరకే చమురు ఆఫర్ చేస్తున్నారు. ఈ క్రమంలో అమెరికా పర్యటనలో ఉన్న భారత అధికారులు చమురు దిగుమతుల విషయంలో తమ వైఖరిని ట్రంప్ సర్కారుకు స్పష్టంచేసినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదిక పేర్కొంది.

ముగిసిన మిగ్ శకం

- మిగ్-21 ఫైటర్‌జెట్ సేవలకు వీడ్కోలు



చండీగఢ్, సెప్టెంబరు 26: భారత వాయుసేన (ఐఏఎఫ్)లో ఓ సువర్ణాధ్యాయానికి తెరపడింది. ఆరు దశాబ్దాలకుపైగా భారత గగనతల రక్షణ భారాన్ని తన రెక్కలపై మోసిన మిగ్-21 శకం ముగిసింది. ఎన్నో యుద్ధాలు, ఆపరేషన్లలో భారత విజయపతాకాన్ని రెపరెపలాడించిన రష్యా తయారీ మిగ్-21 యుద్ధ విమానాలు వాయుసేన నుంచి గౌరవంగా రిటైరయ్యాయి. చండీగఢ్ ఎయిర్ బేస్‌లో శుక్రవారం జరిగిన డీకమిషన్ కార్యక్రమంలో వాయుసేన చీఫ్ మార్షల్ ఏపీ సింగ్.. ఈ ఐకానిక్ యుద్ధ విమానాలకు ఘనంగా వీడ్కోలు పలికారు. 1963లో ఇదే ఎయిర్ బేస్ వేదికగా ఐఏఎఫ్‌లోకి అడుగుపెట్టిన మిగ్-21లు.. ఇప్పుడు ఇక్కడే తన సేవలు ముగించడం విశేషం. ఐఏఎఫ్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్.. మిగ్-21 బైసన్ యుద్ధ విమానంలో చివరిసారిగా ప్రయాణించి వీడ్కోలు పలికారు. ఆయనతోపాటు 23వ స్క్వాడ్రన్ లీడర్ ప్రియాశర్మ కూడా ఉన్నారు. కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఐఏఎఫ్ మాజీ చీఫ్‌లు ఏవై టిప్నిస్, ఎస్పీ త్యాగి, భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్థానిక సంస్థల్లో బీసీలకు 42% కోటా

- రేవంత్ ప్రభుత్వ ఉత్తర్వులు.. రేపు ఎన్నికల షెడ్యూల్?

హైదరాబాద్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అందుకు సంబంధించి జీవో జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్ శుక్రవారం ఉత్తర్వులు (జీవో నంబర్ 09) జారీ చేశారు. పంచాయతీల సీట్లు, చైర్‌పర్సన్‌ల విషయంలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందంటూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డి(6) పేర్కొంటుందని తెలిపింది. మునిసిపాలిటీలు, వాటి చైర్‌పర్సన్‌ల విషయంలో రిజర్వేషన్లు కల్పించే అధికారాన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 టి(6) రాష్ట్ర ప్రభుత్వానికి దఖలు పరిచిందని పేర్కొంది. ఏకసభ్య కమిషన్, డెడికేటెడ్ కమిషన్‌ల సిఫారసులు, రాజ్యాంగం కల్పించిన అధికారాల ఆధారంగా స్థానిక సంస్థల సీట్లు, పదవుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను వర్తింపజేస్తున్నట్లు వివరించింది. జీవో జారీతో.. తెలంగాణలో స్థానిక ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం అయింది. సోమవారం షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. అన్ని వ్యవహారాలు పూర్తయితే ఆదివారం సాయంత్రానికే షెడ్యూల్ వచ్చే అవకాశం కూడా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మహాలక్ష్మిగా కనకదుర్గమ్మ

» నేడు లలిత త్రిపురసుందరిగా దర్శనం

విజయవాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ శుక్రవారం శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడానికి ఉదయం మూడు గంటల నుంచే భక్తులు పోటెత్తారు. సాయంత్రం ఆరు గంటల సమయానికి 90,006 మంది అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం లలిత త్రిపురసుందరి దేవిగా జగన్మాత దర్శనమివ్వనున్నారు.



స్కందమాతగా దర్శనమిచ్చిన భ్రమరాంబిక

శ్రీశైలం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం భ్రమరాంబికాదేవి స్కందమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు శేష వాహన సేవ నిర్వహించాల్సి ఉండగా వర్షం కారణంగా రద్దయింది. శనివారం భ్రమరాంబికా అమ్మవారు కాత్యాయనిగా దర్శనమిస్తారు. స్వామి, అమ్మవార్లకు హంస వాహన సేవ, పుష్ప పల్లకీ సేవ ఉంటుంది.





ముత్యపు పందిరి వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

సింహ, ముత్యపు పందిరి వాహనాల్లో శ్రీనివాసుడు

తిరుమల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు శుక్రవారం శ్రీవారి ఉత్సవమూర్తి శ్రీమలయప్ప స్వామి సింహ, ముత్యపు పందిరి వాహనాలపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. యోగనారసింహుడిగా శక్తికి ప్రతీకైన సింహ వాహనాన్ని అధిరోహించి ఉదయం మాడవీధుల్లో విహరించిన స్వామి.. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా ముత్యపు పందిరి వాహనంలో విహరించారు. కాగా.. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం సింహ వాహన సేవలోనూ పాల్గొన్నారు. అలాగే మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.



సింహ వాహన సేవలో పాల్గొన్న జస్టిస్ ఎన్వీ రమణ

తెలుగు భాష, సంస్కృతులను ప్రోత్సహించండి

» తెలుగేతర రాష్ట్రాలలో సంస్థలకు చేయూతనివ్వాలి

» సీఎం చంద్రబాబుకు తెలుగు విజ్ఞాన సమితి వినతి

బెంగళూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగుభాష, సంస్కృతులను ప్రోత్సహించాలని.., దీనికోసం తెలుగేతర రాష్ట్రాలలో పనిచేస్తున్న సంస్థలకు చేయూతనివ్వాలని ఏపీ సీఎం చంద్రబాబుకు బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు రాధాకృష్ణరాజు విన్నవించారు. అమరావతిలోని అసెంబ్లీలో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో కలసి ఆయన ముఖ్యమంత్రిని శుక్రవారం కలిశారు. బెంగళూరులో దశాబ్దాలకాలం నుంచి తెలుగు భాష, సంస్కృతి మనుగడ కోసం పలు సంస్థలు పనిచేస్తున్నాయని సీఎం చంద్రబాబుకు వివరించామని ఈసందర్భంగా రాధాకృష్ణరాజు తెలిపారు. గతంలో ఏపీ ప్రభుత్వం సాంస్కృతిక కార్యక్రమాలకు నిధులు మంజూరు చేసేదని, ఐదేళ్లుగా నిలిపివేశారని, వాటిని పునరుద్ధరించాలని చంద్రబాబును కోరినట్టు తెలిపారు. తెలుగు అధ్యయన కేంద్రాన్ని అమరావతికి తరలించడం సంతోషంగా ఉందని, భాష, సాహిత్యంపై మరిన్ని పరిశోధనలు చేసేందుకు అనుకూలత ఏర్పడుతుందని పేర్కొన్నారు.

అసత్య ప్రచారాలకు అడ్డుకట్ట

» అందుబాటులోకి 'ఫ్యాక్ట్ చెక్ టీటీడీ'

తిరుమల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారాలకు అడ్డుకట్ట వేసేందుకు 'ఫ్యాక్ట్ చెక్ టీటీడీ' పేరుతో సోషల్ మీడియాలో చానల్స్, గ్రూప్, పేజీలను టీటీడీ ప్రారంభించింది. ఇటీవల అసత్యాలను పోస్టు చేసి తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా కొందరు వ్యవహరిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. 'ఫ్యాక్ట్ చెక్ టీటీడీ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి వేదికల్లో పేజ్‌లు, వాట్సాప్ చానల్స్ గ్రూప్‌ను క్రియేట్ చేసి అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటి ద్వారా భక్తులు నిజాలు తెలుసుకోవచ్చని టీటీడీ చెబుతోంది.

డిజిటల్ అరెస్టు పేరిట మస్కా

» విశ్రాంత వైద్యుడి నుంచి రూ.1.10 కోట్లు స్వాహా

» కర్ణాటకలో ఇద్దరిని అరెస్టు చేసిన బాపట్ల పోలీసులు

బాపట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్ అంటూ బెదిరించి ఓ విశ్రాంత వైద్యుడి నుంచి కోటీ పది లక్షల రూపాయలు కాజేసిన సైబర్ నేరగాళ్లను బాపట్ల జిల్లా పోలీసులు కర్ణాటకలో అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆ వివరాలను శుక్రవారం విలేకరులకు తెలియజేశారు. బాపట్ల జిల్లా చీరాల పట్టణానికి చెందిన ఓ విశ్రాంత వైద్యుడికి ఈ నెల 19న సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి.. డిజిటల్ అరెస్టు చేసినట్టు చెప్పారు. ఈ కేసు నుంచి బయటపడాలంటే కొంత డబ్బు చెల్లించాలని బెదిరించి.. ఆయన వద్ద నుంచి రూ.1.10 కోట్లు కాజేశారు. తాను మోసపోయినట్టు గుర్తించిన ఆ వైద్యుడు.. చీరాల పట్టణ పోలీసులను ఆశ్రయించగా తక్షణమే స్పందించిన ఎస్పీ ఉమామహేశ్వర్ ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. సాంకేతిక సాయంతో సైబర్ నేరగాళ్లు కర్ణాటకలో ఉన్నట్టు గుర్తించిన ఈ బృందం.. అక్కడకు వెళ్లి ఇద్దరిని అరెస్టు చేసి తీసుకొచ్చింది. వారి వద్ద నుంచి రూ.2.5 లక్షలు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో పరిశీలించగా వారిపై 8 రాష్ట్రాల్లో రూ.14 కోట్లకు సంబంధించిన సైబర్ నేరాలు నమోదైనట్లు గుర్తించారు. కాగా, ఈ కేసులో వారం రోజుల్లోనే ఇద్దరిని అరెస్టు చేయడం అభినందనీయమని ఎస్పీ అన్నారు. డిజిటల్ అరెస్ట్ అనగానే భయభ్రాంతులకు గురై మోసపోవద్దని ప్రజలకు సూచించారు. సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలన్నారు.



వాయుగుండం ప్రభావంతో విశాఖ నగరంలో వర్షం కురుస్తున్న దృశ్యం

» కోస్తాలో వర్షాలు, నేడు భారీ వర్షసూచన

» ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక

» 2 న బంగాళాఖాతంలో అల్పపీడనం

బంగాళాఖాతంలో వాయుగుండం

విశాఖపట్నం, అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో రెండు రోజులుగా కొనసాగుతున్న అల్పపీడనం శుక్రవారం ఉదయానికి మధ్య, వాయవ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించే క్రమంలో తీవ్ర అల్పపీడనంగా, సాయంత్రానికి వాయుగుండంగా బలపడింది. వాయుగుండం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. ఇది ప్రస్తుతం ఒడిశాలో పూరీకి 60 కి.మీ దక్షిణ ఆగ్నేయంగా, గోపాల్‌పూర్‌కు 130 కి.మీ. తూర్పుగా, కళింగపట్నానికి 230 కి.మీ. తూర్పు ఈశాన్యంగా కేంద్రీకృతమై ఉంది. వాయుగుండం పశ్చిమంగా పయనించి శనివారం ఉదయం కళింపట్నం-పూరీ మధ్య గోపాల్‌పూర్‌కు సమీపంలో తీరం దాటుతుందని వాతావరణశాఖ తెలిపింది. కాగా తీవ్ర అల్పపీడనం ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి కోస్తా, రాయలసీమల్లో మేఘాలు ఆవరించాయి. ఉత్తరకోస్తాలో ఎక్కువ చోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ విజయనగరంలో 58.75, ఆమదాలవలసలో 54, శ్రీకాకుళంలో 48.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు

శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నంద్యాల, కడప, కర్నూలు జిల్లాల్లో భారీవర్షాలు కురవనున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకూ కోస్తా, రాయలసీమల్లో అనేక చోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయి. శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం హెచ్చరించింది. అన్ని ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు. ఇదిలావుండగా ఈనెల 30 నాటికి అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఆవరించనుందని, ఆ తర్వాత వాయవ్యంగా పయనించి వచ్చే నెల రెండో తేదీకల్లా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనంగా బలపడనుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. దీనివల్ల ఉత్తరకోస్తాలో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు.



నంద్యాల జిల్లా చాగలమర్రిలో మొక్కజొన్న పంటను కాపాడుకుంటున్న రైతులు

కొనసాగుతున్న వరద ప్రవాహం

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా, గోదావరి నదులకు వరద ప్రవాహం కొనసాగుతోందని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రకాశం బ్యారేజ్ వద్ద 2.39 లక్షల క్యూసెక్కులు, ధవళేశ్వరం వద్ద 5.34లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉందని తెలిపింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. మరో 24 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉండటంతో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత కలెక్టర్లతో సమీక్ష చేశారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టాలని ఆదేశించారు. సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలను కోరారు.

పెరిగిన గోదావరి నీటిమట్టం

» పోలవరం నుంచి 7,62,862 క్యూసెక్కులు విడుదల

పోలవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం 43.90 అడుగులకు చేరుకుంది. అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 7,62,862 క్యూసెక్కుల వరద జలాలను జలవనరుల శాఖ అధికారులు ప్రాజెక్టు 48 గేట్ల నుంచి దిగువకు విడుదల చేశారు.

శ్రీశైలం జలాశయానికి తగ్గిన వరద

శ్రీశైలం జలాశయానికి వరద తగ్గముఖం పట్టింది. జలాశయం 10 గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్న జలవనరుల శాఖ అధికారులు శుక్రవారం రెండు గేట్లను మూసివేశారు. 8 క్రస్ట్ గేట్ల స్పిల్‌వే గుండా 2,15,424 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు.

ఉగ్ర మూసీ

మూసీ ఉగ్రరూపం దాల్చింది. ఆ తీవ్రతకు హైదరాబాద్‌లోని మూసీ పరిసర ప్రాంతాలు వణికిపోతున్నాయి. ఎంజీబీఎస్ బస్టాండ్‌లోకి వరద నీరు పోటెత్తింది. చాదర్‌ఘాట్ కాజ్‌వేపై నుంచి నీరు వెళుతుండటంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. మూసారంబాగ్ వంతెనపై నుంచి నాలుగు అడుగుల మేర వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపివేశారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్





వీసీ చాంబర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఏయూలో విద్యార్థుల ఆందోళన విరమణ

» క్యాంపస్‌లో వైద్య సదుపాయాలపై కమిటీ నియామకం

» వారం రోజుల్లో సమస్యల పరిష్కారానికి వీసీ హామీ

విశాఖపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా కొనసాగిన విద్యార్థుల ఆందోళన ముగిసింది. హాస్టల్ విద్యార్థి మణికంఠ గురువారం సకాలంలో వైద్యం అందక మరణించడంతో విద్యార్థులు ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. హెల్త్ సెంటర్‌లో మౌలిక వసతులు కల్పించాలని తాము చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నా వైస్ చాన్సలర్ రాజశేఖర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కనీస చర్యలు చేపట్టకపోవడం వల్లే ఆక్సిజన్ అందక మణికంఠ మృతిచెందాడని విద్యార్థులు ఆరోపించారు. దీనికి బాధ్యత వహిస్తూ వీసీ రాజీనామా చేయాలని, మణికంఠ కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. యూనివర్సిటీ బంద్‌కు పిలుపు ఇవ్వడంతో విద్యార్థులంతా తరగతులు బహిష్కరించి ధర్నా వద్దకు చేరారు. పరిస్థితి గమనించిన కలెక్టర్ హరేంధిరప్రసాద్ క్యాంపస్‌లో వైద్య సదుపాయాలపై అధ్యయనానికి కేజీహెచ్ సూపరింటెండెంట్, డీఎంహెచ్‌ఓ, ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌తో కమిటీ వేస్తున్నట్టు ప్రకటించారు. అదేవిధంగా విద్యార్థులతో చర్చలకు జిల్లా సహకార శాఖ అధికారిణి ప్రవీణను పంపించారు. వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ రాంబాబు, తదితరులు అక్కడకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. వారం రోజుల్లో సమస్యలకు పరిష్కారం చూపిస్తామని వారు హామీ ఇచ్చారు. ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ఆందోళన విరమించాలని ప్రవీణ కోరగా.. విద్యార్థులు అంగీకరించి, ఆందోళన విరమిస్తున్నట్టు ప్రకటించారు.

నత్తల నివారణకు అధికారుల చర్యలు

» క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): 'నత్తలు వచ్చేశాయి జాగ్రత్త' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా ఉద్యానవన శాఖాధికారులు స్పందించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పలు చోట్ల నత్తల దాడితో పంటలు దెబ్బతింటున్నాయి. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలోని పెంట్లమ్మ అడవి ప్రాంతం సమీపంలోని వ్యవసాయ భూముల్లో ఆఫ్రికా జాతి నత్తలు తిష్ట వేశాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు నష్టనివారణ చర్యలు చేపట్టారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాకిస్థాన్ తన ప్రజలను తానే ఊచకోతకోస్తోందని ఐక్యరాజ్య సమితిలో భారత్ విమర్శించినప్పటికీ, ఎన్నడైనా ఆ ప్రావిన్సులోని జనాన్ని పాక్ తనవారని అనుకున్నదా? ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్సులోని తిరా లోయలో ఇటీవల పాకిస్థాన్ యుద్ధవిమానాలు బాంబుల వర్షం కురిపించి ముప్ఫైమంది ప్రాణాలు తీశాయి. చనిపోయినవారిలో మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో ఉన్నారని, గాయపడినవారి లెక్కలు బయటకు తెలియలేదని వార్తలు వచ్చాయి. నేలమట్టమైన ఇళ్ళు, కుప్పకూలిన భవనాలు, తగలబడుతున్న వాహనాలు, శిథిలాల్లో చిక్కుబడిన మృత దేహాలు ఇత్యాది దృశ్యాలతో ఒళ్ళు గగుర్పొడిచే రీతిలో ఈ మారణకాండ సాగింది. ఇటీవలే వరుస వరదలతో తీవ్రంగా దెబ్బతిని ఉన్న ఈ పాక్ వాయవ్య ప్రావిన్సు ప్రజలకు ఇది మరో దెబ్బ. తెహ్రీక్ తాలిబాన్ పాకిస్థాన్ (టీపీటీ)కు చెందిన పేలుడు పదార్థాల గోదాము పేలిపోయి ఈ మరణాలు సంభవించాయని పాకిస్థాన్ ప్రభుత్వం బుకాయిస్తోంది. అయితే, అఫ్ఘానిస్థాన్ సరిహద్దు సమీపంలో జరిగిన ఈ వైమానిక దాడుల మీద సమగ్ర విచారణ జరపాలని పాకిస్థాన్ మానవహక్కుల సంఘం డిమాండ్ చేయడాన్ని బట్టి జరిగినదేమిటో అర్థమవుతూనే ఉంది.

నిరాయుధులైన ప్రజలను బాంబులతో హతమార్చడం ఎన్నడైనా చూశామా అంటూ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పార్టీ ప్రభుత్వాన్ని తప్పుబట్టింది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది మంది వైమానిక దాడులను నిరసిస్తూ పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారట. పాకిస్థాన్ సైనికబలగాలు తిరా లోయలో ఇలా ఘాతుకాలకు పాల్పడటం, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటివి ఖండిస్తూండటం, పాకిస్థాన్‌లోని పలు సంస్థలు విచారణకు డిమాండ్ చేయడం సర్వసాధారణమైపోయింది. పాకిస్థాన్‌తో దాదాపు యుద్ధమే చేస్తున్న టీపీటీకి ఇది అత్యంత కీలకమైన ప్రాంతం. ఇటీవల భారత్ చేపట్టిన

పాక్‌లో ప్రజాసంహారం

ఆపరేషన్ సిందూర్‌తో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో స్థావరాలు ధ్వంసమైన చాలా ఉగ్రసంస్థలు కూడా తమ మకాం ఇటు మార్చాయని వార్తలు వస్తున్నాయి.

తెల్లవారుజామునే జరిపిన ఈ వైమానికదాడిలో చైనా తయారీ విమానాలను, బాంబులను పాకిస్థాన్ వాడిందట. బలూచిస్థాన్ తరువాత అత్యధిక ఉగ్రదాడులను చవిచూస్తున్న ఈ పర్వత ప్రాంతాల మీద ఆధిపత్యం సాధించడానికి పాకిస్థాన్ వరుస ప్రభుత్వాలు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అఫ్ఘానిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వం టీపీటీకి అండదండలు అందిస్తున్నదని పాకిస్థాన్ ఆరోపణ. అఫ్ఘాన్ ప్రభుత్వ నీడలో ఉంటూ, సొరంగ మార్గాలద్వారా పాకిస్థాన్‌లోకి ప్రవేశించి టీటీపీ ఉగ్రదాడులకు పాల్పడుతున్నదని, దానిని నియంత్రించాలని పాక్ ప్రభుత్వం కోరడం, అఫ్ఘాన్ పాలకులు కొట్టిపారేయడం తెలిసిందే. శాంతిభద్రతలు కాపాడుకోలేని పాక్ పాలకులు తమను ఆడిపోసుకుంటున్నారని అఫ్ఘాన్ నేతలు అంటారు. అఫ్ఘానిస్థాన్‌లో నాలుగేళ్ళ క్రితం తిరిగి అధికారంలోకి వచ్చిన తాలిబాన్ గతంలో మాదిరిగా పాకిస్థాన్ మాట వినడం మానేసింది. అల్లా దయవల్ల తాలిబాన్ తిరిగి తమ పొరుగుదేశంలో అధికారం చేపట్టిందని ఎగిరిగంతేసిన ఇమ్రాన్ ఖాన్‌కు అతి త్వరలోనే సత్యం తెలిసొచ్చింది. తాలిబాన్‌ను కట్టడి చేయడానికి పాక్ ప్రయత్నించినప్పుడల్లా టీటీపీ తన ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తోంది. ఇటీవల పన్నెండుమంది పాక్ సైనికులను టీటీపీ ఊచకోత కోసినందుకు ప్రతీకారంగా పాక్ సైన్యం సోమవారం ఖైబర్ ప్రావిన్సులో ఈ వైమానిక దాడి జరిపిన మాట నిజం.

ఖైబర్ పఖ్తున్‌ఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులు పాక్ పాలకులకు పెద్ద తలనొప్పిగా మారాయి. ఖైబర్‌లోని కొన్ని ప్రాంతాలను టీపీటీ ఏలుతున్నదని, ఆర్థికవ్యవహారాలు, కోర్టులు, భద్రత ఇత్యాదివన్నీ అదే నిర్వహిస్తున్నదని అంటారు. మరోపక్క స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న బలూచ్ వేర్పాటువాదులు సైనిక స్థావరాలు, గ్యాస్ పైప్‌లైన్లు, రైల్వేలైన్లు, చైనా–పాక్ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా ఉన్న ప్రాజెక్టులమీద భీకర దాడులకు పాల్పడుతున్నారు. ఖైబర్, బలూచ్ ప్రావిన్సులలో నెగ్గుకురాలేని పాకిస్థాన్ పాలకులు అఫ్ఘానిస్థాన్, ఇండియాలను ఆడిపోసుకుంటూ, అంతర్జాతీయ వేదికలమీద అర్థంలేని ఆరోపణలు చేస్తూ, అంతిమంగా తమ ప్రజలను తామే చంపుకుంటున్నారు.

జీఎస్టీ తగ్గింపు ఎలాంటి సంస్కరణ?

దేశ ఆర్థిక వ్యవస్థ స్థితి ఏమిటి? ఈ విషయాన్ని తెలుసుకునేందుకు నేను నెల నెలా రిజర్వ్ బ్యాంక్ బులెటిన్ కోసం ఎదురుచూస్తుంటాను. స్థూల దేశీయోత్పత్తి, ద్రవ్యోల్బణం, ఉపాధి, వాణిజ్యం మొదలైన కీలక సూచికల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం పనితీరును విశ్లేషించే 'స్టేట్ ఆఫ్ ది ఎకానమీ' (దేశ ఆర్థిక వ్యవస్థ స్థితి) వ్యాసాన్ని శ్రద్ధాసక్తులతో చదువుతాను. ఆ వ్యాసం ఆరంభంలో ఒక హెచ్చరిక ఉంటుంది. అది నన్ను తప్పక ఉల్లాసపరుస్తుంది. సెప్టెంబర్ బులెటిన్‌లోని ఆ హెచ్చరిక ఇలా ఉన్నది: 'ఈ వ్యాస రచనలో డాక్టర్ పూనమ్ గుప్తా (డిప్యూటీ గవర్నర్) సమకూర్చిన మార్గదర్శకత్వం, నిశితంగా చదివి మార్పులు, చేర్పులకు చేసిన సూచనలను కృతజ్ఞతాపూర్వకంగా అంగీకరిస్తున్నాము... ఈ వ్యాసంలో వ్యక్తమైన అభిప్రాయాలు రచయితలవే గానీ, భారతీయ రిజర్వ్ బ్యాంక్ అభిప్రాయాలు కావు'. ఈ మాటలు నాకు గొప్ప వినోదం. ఎందుకంటే గవర్నర్ ఆమోదం, అనుమతి లేకుండా ఒక్క మాట కూడా ఆర్బీఐ నుంచి వెల్లడవదు. డిప్యూటీ గవర్నర్ అకడమిక్ పరిశోధనా పత్రం లేదా ప్రసంగం సైతం ముందుగా గవర్నర్ ఆమోదం పొంది తీరుతుంది. ఏదైనా ఆయన అనుమతితో మాత్రమే జరుగుతాయి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు


ఆ హెచ్చరికను ఎవరూ సీరియస్‌గా తీసుకోరు. ఆ వ్యాసాన్ని దేశంలో చాలా మంది, ముఖ్యంగా అర్థశాస్త్ర బోధన, పరిశోధనలలో ఉన్నవారు చదువుతుంటారు. దాని నుంచి విస్తారంగా ఉటంకింపులు చేస్తారు. ఆ వ్యాసంలో పదే పదే ప్రస్తావితమయ్యే పదం ఒకటి ఉన్నది: 'అనిశ్చితి'. అవును, అనిశ్చితే, ఒకచోట కాదు, ఎల్లెడలా. ద్రవ్యోల్బణం, ధరలు, ఉద్యోగిత, వేతనభత్యాలు, పెట్టుబడులు, ఆదాయాలు, పన్నులు, విదేశీ వాణిజ్యం మొదలైన విషయాలలో ఎంతో అనిశ్చితి. ప్రభుత్వమూ, రిజర్వ్ బ్యాంక్ కూడా ఎన్నో నిర్ణయాలు తీసుకున్నాయి, మరెన్నో చర్యలు చేపట్టాయి. అయినా అనిశ్చితే! ఈ అనిశ్చితి ఆర్థికేతర రంగాలకూ వ్యాపించింది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్, ఓటర్ జాబితాలు, ఎన్నికల, చట్టాలు, వాటిని అమలుపరిచే విధి విధానాలు, విదేశాంగ విధానం, ఇరుగుపొరుగు దేశాల పట్ల అనుసరించాల్సిన విధానం మొదలైన విభిన్న విషయాలలో కూడా అనిశ్చితి ఎక్కువగానే ఉన్నది. వాస్తవంగా అనిశ్చితి అనేది ఆర్థికంగా, ఇతరత్రా దేశ ప్రస్తుత స్థితిగతులను నిర్వచిస్తోంది.

భారత ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుత అనిశ్చిత పరిస్థితులకు కారణమేమిటి? రిజర్వ్ బ్యాంక్ చెప్పే మాట ఒక్కటే: 'ఆర్థిక వ్యవస్థ శీఘ్రగతిన కోలుకొంటోంది'. ఇక్కట్ల నుంచి బయటపడేందుకు ప్రభుత్వం మాదిరిగానే రిజర్వ్ బ్యాంక్ కూడా ఏదో ఒక అంశాన్ని ఆసరాగా తీసుకోవడం పరిపాటి. ఆర్థిక వ్యవస్థను సమస్యల నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వానికి తట్టిన తరుణోపాయం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రేట్ల తగ్గింపు. ఈ రేట్ల తగ్గింపు జీఎస్టీ సంస్కరణల్లో ఒక మైలు రాయి అని రిజర్వ్ బ్యాంక్ అభివర్ణించింది. అవునా? జీఎస్టీని అధిక స్థాయిలో బహు విధంగా నిర్ణయించడమే అసలు పాపం. మరి ఆ అధిక, అనేక రేట్లను తగ్గించడంలో 'సంస్కరణ' ఏముంది? అయినా అదెలా సంస్కరణాత్మక చర్య అవుతుంది? జీఎస్టీ చట్టాల రూపకల్పన సక్రమంగా లేదు. జీఎస్టీ వ్యవస్థ నిర్మాణం తప్పుడు రీతుల్లో ఉన్నది. దాని నియమ నిబంధనలు తప్పు. పన్ను రేట్లు శుద్ధ తప్పు. బహు విధంగా, అందునా అత్యధికంగా ఉన్న పన్ను రేట్లను తగ్గించడమనేది పథ నిర్దేశక సంస్కరణ ఎలా అవుతుంది?

అయితే జీఎస్టీ రేట్ల తగ్గింపుతో దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక కొత్త ఉత్సాహం ఉరకలు వేస్తోంది. ఆ రేట్ల తగ్గింపుతో వినియోగదారులకు 2,00,000 కోట్ల రూపాయలు ఆదా అవుతాయని అంచనా వేస్తున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ. 3,57,00,000 కోట్లు నామమాత్ర స్థూల దేశీయోత్పత్తికి వ్యతిరేకంగా 'అదనపు' డబ్బు 0.56 శాతం (ఇది జాతీయ రుణం– జీడీపీ నిష్పత్తిని కచ్చితంగా సూచిస్తుంది. ఈ నిష్పత్తిని దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణంతో పోలిస్తే అప్పులను తిరిగి చెల్లించగల సామర్థ్యాన్ని సూచిస్తుంది. జాతీయ రుణం–జీడీపీ నిష్పత్తి అధికంగా ఉంటే ఆర్థిక స్థిరత్వానికి ప్రమాదం వాటిల్లవచ్చు) మన దేశంలో కిరాణా విపణి వార్షిక విలువ రూ. 82,00,000 కోట్లు అని అంచనా. దీనికి వ్యతిరేకంగా 'అదనపు' డబ్బు 2.4 శాతంగా ఉన్నది. అదనపు కిరాణా వ్యయం వినియోగాన్ని పెంపొందిస్తుంది. అయితే దేశ ఆర్థిక వ్యవస్థపై ఈ పెరుగుదల ప్రభావాన్ని అత్యుక్తులతో చెప్పడం సబబేనా?

జీఎస్టీ రేట్ల తగ్గింపుతో వినియోగదారులకు ఆదా అయ్యే రూ.2,00,000 కోట్లు పూర్తిగా వినియోగంలోకి వెళ్లతుందా? వెళ్లదు. అధికారిక సమాచారం ప్రకారం కుటుంబ రుణాల మొత్తం పరిమాణం జీడీపీలో 40 శాతానికి పెరిగింది. కుటుంబ పొదుపుల మొత్తం జీడీపీలో 18.1 శాతానికి పడిపోయింది. ఈ కారణంగా ఆదా అయ్యే జీఎస్టీ 'డబ్బు'లో కొంత రుణాలు తీర్చుకోవడానికి, మరి కొంత పొదుపులు పెంచుకోవడానికి వినియోగమవుతుంది జీఎస్టీ రేట్ల తగ్గింపుతో వినియోగ వ్యయం పెరుగుతుందనే అంచనాతో నేను ఏకీభవిస్తున్నాను. అయితే అది వినియోగం, ఉత్పత్తి, పెట్టుబడి ఆవృతిని వేగవంతమూ, సమృద్ధమూ చేసేందుకు దోహదపడుతుందా? సర్కారీ–ఆర్థికవేత్తలు మాత్రమే ఈ ప్రశ్నకు సానుకూలంగా ప్రతిస్పందిస్తున్నారు. ఇతర ఆర్థికవేత్తలు సంభావ్య సానుకూలతలను సంశయిస్తున్నారు.

జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రభావంపై ఆర్థిక మంత్రిత్వశాఖ, రిజర్వ్ బ్యాంక్ సంపూర్ణ ఏకీభావంతో ఉన్నాయి. జూన్ 19, 2025న ఆర్థిక మంత్రిత్వశాఖ సంప్రతింపుల కమిటీ పరిశీలనకు నివేదించిన ఒక పత్రంలో మొదటి రెండు పేజీలలోనే ఈ శీర్షికలు ఉన్నాయి: 'ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెరిగిన అనిశ్చితి; మందగించిన ప్రపంచ వాణిజ్యం, పెట్టుబడులు'. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు ఇలా ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు సజావుగా, సుదృఢంగా ఉన్నది. అయినా



> వస్తుసేవల పన్ను తగ్గింపు అనేది గతంలో అధిక స్థాయిలో, అనేక శ్లాబులలో రేట్లు నిర్ణయించడమనే అసలు పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవడం మాత్రమే. అంతకుమించి మరేమీ కాదు. ఆనందోత్సాహాలతో వేడుక చేసుకునేందుకు ఆ నిర్ణయం తగదు. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లకు అది ఎంతమాత్రం సరైన జవాబు కానేకాదు.

ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు కఠిన సంస్కరణలను అమలుపరిచేందుకు సుముఖంగా లేరు. నిజం చెప్పాలంటే వాటిని అమలుపరచగల పరిస్థితి కూడా లేదు. 'జీవన సౌలభ్యం', (ఒక వ్యక్తి లేదా సమాజం జీవన స్థితిగతుల నాణ్యతను సూచించే భావన. ఆర్థిక అవకాశాలు, విద్యా వైద్య వసతులు, మౌలిక సదుపాయాలు, పర్యావరణ స్వచ్ఛత మొదలైన అంశాల ప్రాతిపదికన జీవన సౌలభ్య స్థాయిని నిర్ధారిస్తారు) 'వ్యాపార సౌలభ్యం' (ఒక దేశంలో లేదా ప్రాంతంలో వ్యాపారం ప్రారంభించడం, నిర్వహించడం, నియమ నిబంధనలు పాటించడం ఎంత సులభంగా ఉందో తెలిపే సూచిక ఇది) గురించి ప్రధాన మంత్రి చక్కగా మాట్లాడుతున్నారు. అయితే మాటలతో అవి సిద్ధిస్తాయా? కఠిన సంస్కరణలను అమలుపరిచి తీరాల్సిందే.

భారత్ సంపూర్ణంగా ఒక బహిరంగ, పోటీదాయక ఆర్థిక వ్యవస్థగా పరిణమించి తీరాలి. బహిరంగ ఆర్థిక వ్యవస్థగా మారే విషయంలో మన అనుభవం ఏమిటి? మనం ఒక ద్వారం తెరిస్తే ఒక కిటికీని మూసివేస్తాం! బహిరంగ ఆర్థిక వ్యవస్థ అనేది ప్రపంచంలోని సమస్త దేశాలతోనూ వాణిజ్య సంబంధాలు నెలకొల్పుకునేందుకు సుముఖంగా, సంసిద్ధంగా ఉండాలి. 'పోటీదాయక' ఆర్థిక వ్యవస్థగా రూపొందాలంటే ప్రపంచ దేశాలతో మనం ద్వైపాక్షిక, బహుళ పాక్షిక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలి. చిప్‌లు, నౌకలు తయారు చేయగలగడంతోనే ఏ ఆర్థిక వ్యవస్థా పోటీదాయక ఆర్థిక వ్యవస్థ కాదు, కాబోదు, కాలేదు. ఏ వస్తు సేవలతో ఏ దేశంతోనైనా పోటీ పడగలమో ఆ వస్తు సేవలనే మనం ఉత్పత్తి చేయాలి.

దక్షిణాసియా, ఆసియాన్ (ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య)తో మనం తొలుత పోటీపడాలి. ప్రపంచంలో అతి తక్కువగా ఏకీకృతమైన వాణిజ్య మండలాలలో సార్క్ (దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం)నే మొదట చెప్పాలి. సార్క్ దేశాల మధ్య వాణిజ్యం ఆ దేశాల మొత్తం అంతర్జాతీయ వాణిజ్యంలో 5 నుంచి 7 శాతం మాత్రమే. సార్క్ దేశాలతో భారత్ వాణిజ్యం 8 శాతం మాత్రమే. ఆసియాన్ దేశాలతో భారత్ వాణిజ్యం 11 శాతంగా ఉన్నది.

మరో కఠిన సంస్కరణ నియంత్రణల తొలగింపు. ప్రతి ఒక్కరికీ– చట్టాలు అమలుపరిచే వారి నుంచి పన్నుల శాఖ అధికారుల దాకా– నియమ నిబంధనల పట్ల మహా ప్రీతి. బిల్లుల ఉద్దేశాలు, లక్ష్యాల గురించి వివరిస్తారు గానీ నియమ నిబంధనలు, నియంత్రణలు, నోటిఫికేషన్లు, మార్గదర్శక సూత్రాల గురించి వెల్లడించరు. మన పాలనా వ్యవస్థలోని ఇటువంటి ధోరణుల వల్లే ఒక ఉత్తమ నిర్దుష్ట భావన అయిన జీఎస్టీ 'గబ్బర్ సింగ్ ట్యాక్స్'గా మారింది. సరళీకృత ఆర్థిక విధానాలు ప్రారంభమైన తొలి దశ (1991–96 సంవత్సరాల మధ్య)లో వివిధ ఆర్థిక కార్యకలాపాలపై తొలగించిన నియంత్రణలు చాలా వరకు ఏదో ఒక రూపంలో మళ్లీ వ్యవస్థలో అంతర్భాగమయ్యాయి! అయినా ప్రతిరోజూ మరిన్ని నియమ నిబంధనలు, నియంత్రణలు ప్రవేశపెడుతున్నారు!

ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలకు అనవసర అవరోధాలుగా ఉన్న నియమ నిబంధనలు నియంత్రణలను తొలగించేందుకు ఒక సాధికార కమిటీని నియమించాలి. తద్వారా ఒక పెద్ద సంస్కరణకు ప్రభుత్వం పూనుకోవాలి. ప్రధానమంత్రి పదే పదే మాట్లాడుతున్న 'జీవన సౌలభ్యం' 'వ్యాపార సౌలభ్యం'కు అది విశేషంగా తోడ్పడుతుంది. వృద్ధిరేటు పెరుగుదలకు కూడా అది దోహదం చేయగలదని నేను విశ్వసిస్తున్నాను. వస్తుసేవల పన్ను రేట్లు తగ్గింపు నిర్ణయం అనేది అసలు పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవడం మాత్రమే. అంతకు మించి మరేమీ కాదు. ఆనందోత్సాహాలతో ఉత్సవం చేసుకునేందుకు ఆ నిర్ణయం తగదు. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లకు అది ఎంతమాత్రం సరైన జవాబు కానేకాదు.


(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

అణచివేతకు అద్దం పట్టిన 'గబ్బిలం'

సత్కవి గుర్రం జాషువా డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ సమకాలికుడు. అస్పృశ్యతను చవిచూసిన ఈ కవివరేణ్యుడు తన ఖండకావ్యం 'గబ్బిలం'లో నాటి సామాజిక వ్యవస్థ మూలాలను, అమానవీయ దౌష్ట్యాన్ని కరుణారసభరితంగా వర్ణించి సాహిత్య వేదికపై మానవ జాతిని మేలుకొల్పిన సంఘసంస్కర్త. మరీ ముఖ్యంగా అరుంధతీయుల దుర్భర జీవనగతులను ప్రశ్నించే చైతన్యంతో అనుసంధించి సమర సత్యాత్మక ప్రబోధంతో, సమాజాన్ని తట్టి లేపిన విశ్వనరుడు. జాతీయోద్యమ స్ఫూర్తితో దేశభక్తి కొత్తపుంతలు తొక్కుతున్న సమయాన పేదల పక్షాన నిలబడ్డ దార్శనికుడు.

చిట్టి 'చందమామ కథలతో సంతృప్తి చెందే చిన్నతనంలో ఆత్రంగా చదివిన ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి', గురజాడ 'కన్యాశుల్కం', బోయి భీమన్న 'పాలేరు', జాషువా 'గబ్బిలం' వంటి సాంఘిక నవలలు, నాటికలు, కావ్యాల సారాన్ని పునఃశ్చరణ చేసుకుని సారాన్ని సంగ్రహించటానికి ఆరు పదుల వయస్సు మీద పడిన తరువాత గానీ సాధ్యపడలేదు. 'కోవిడ్–19' సమయంలోనే ఈ పుస్తక పఠనం వీలైంది.

కుల వ్యవస్థను, సామాజిక అంతరాల్ని నిరసిస్తూ వెలువడిన సాహిత్యానికి శతాబ్దాల చరిత్ర ఉంది. పాల్కురికి సోమన, యోగి వేమన, దున్నా ఇద్దాసు, పోతులూరి వీరబ్రహ్మం, నారాయణగురు, చొక్కామేళ ఇత్యాది విముక్త సాహిత్య స్రష్టలు, సాంఘిక సంస్కర్తలు దక్షిణ భారత దేశాన సామాజిక పరివర్తన దిశగా తమదైన ముద్ర వేశారు. ఉత్తరాదిన కూడా సంత్, సాధువులైన రవిదాసు, కబీరు, తుకారాం వంటి సంఘ సంస్కర్తలు కులాధిపత్యాన్ని నిలదీశారు. ఈ పరంపరలోని మహావ్యక్తి స్వానుభవంతో జాషువా కవి శత్రువును సైతం క్షమించాలనే బౌద్ధ సుగుణం ఈయన పద్యాల్లో మరింత వెలుగు చూపింది.



శ్రీకృష్ణదేవరాయల ఎడబాటు నాలుగుదిక్కులా, సాహితీ చీకట్లు కమ్మిన సమయాన, తెలుగు కవితా సరస్వతి దారిబత్తెంతో తంజాపురం వైపు వలసపోయిన వేళలో అపర రాయలైన రఘునాథరాజు తన ఆస్థానంలో ఆశ్రయం ఇచ్చిన వైనం జాషువా కవి వర్యుడు తన ఈ ఉద్గ్రంథంలో వర్ణించిన తీరు అజరామరం. చేమకూర వెంకట కవి తెలుగనే పద్మాక్షికి రెండర్థాల మాటలు నేర్పిన సమయం అది. మువ్వగోపాలుణ్ణి స్తుతించటానికి క్షేత్రయ్య కలం పట్టుకున్న తరుణమది. ఈ సాహిత్య నేపథ్య నిలువుటద్దంలో బాసటగా, రఘునాథుడి ఏలుబడిలో తంజావూరుకు దక్షిణాన నివాసమేర్పరుచుకున్న ఒక అరుంధతీయుడు, అతడు గర్భదరిద్రుడు. తన ఊరట లేని దీనావస్థను స్నేహపూర్వకంగా ఓ పక్షికి వివరించే వృత్తాంతమే ఈ 'గబ్బిలం' జాషువా కావ్యసృష్టి.

కుల మదంతో పొగరెక్కిన ఈ సమాజంలో, పురుగు, పుట్ర కాక పేదలకు ఆప్తులు, ఆత్మీయులు ఎవరున్నారని ప్రశ్నిస్తూనే, అతని గోరు వెచ్చటి కన్నీటికి చక్రవాక పక్షులతో వ్యాఖ్యానం పలికించటం మానవతా వాదిగా జాషువాకే చెల్లింది. కావ్య నాయకుడిగా చెప్పుకోవలసి వస్తే, ఈ అరుంధతీయుడు భారతమాతకు పుట్టిన కడగొట్టు బిడ్డ, మూలవాసి. అందరికీ నాల్గు దిక్కులుంటే, ఏ దిక్కూ మొక్కు లేని దీనుడితడు. సవర్ణులు ఈతనికి ఎన్నో మనః క్లేశాల్ని మిగిల్చినా, ఏనాడూ వారికి ఎదురు తిరగాలని అనుకోలేదు. పైపెచ్చు వారి పాదాలు కందిపోకుండా చెప్పులు కుట్టి ఇస్తాడు. ఈతడు మాత్రం చెప్పులు తొడుక్కుని సాటి నరుని కంటపడరాదు. ఈతడు ఆలయాన్ని తాకితే త్రిమూర్తులు కూడా ఉపవాసం ఉండవల్సిందే. ఈతడు చేసిన సేవకు యావత్తు భారతావని అప్పు పడిందని వాపోతాడు జాషువా.

కులం లేని పేదవాడిగా, పుట్టు బానిసగా బ్రహ్మచర్య దీక్ష పూనిన ఈ అరుంధతీయుడు, పగలంతా రెక్కాడించి, సూర్యుణ్ణి సాగనంపి తన గూటి (గుడిసె)కి చేరి, కాసిన్ని గంజి నీళ్ళు తాగి, నిద్రకై కుక్కి మంచంపై మేను వాల్చాడు ఒకనాడు. ముక్కూ, ముఖం లేని చీకటి ముద్దలాగ ఉన్న గబ్బిలం ఒకటి అటు తిరుగాడుతూ వచ్చింది గుడిసెలోకి. దాని రెక్కల గాలికి ఈతని ఇంటవున్న ఆముదపు ప్రమిద కొండెక్కింది. చీకటిలో దయ్యపు పిల్లలాగా తిరుగుతున్న ఆ తాపసి పిట్టను చూచి, ఈతనిలో కొత్త ఊహలు మొగ్గతొడిగి చిగురించటం ఊహాతీతం. ఆ గబ్బిలాల రాణికి స్వాగతం పలుకుతూ 'పవిత్ర ఆలయాల్లో తిరుగాడేవు నీవు, ఈ అంటరాని వాడి నిషిద్ధ గృహానికి వస్తే ఈ లోకం నిన్ను కూడా బహిష్కరిస్తుందేమో? ఇది హృదయం లేని లోకం సుమీ!' అంటూ హెచ్చరిస్తాడు.

'జంతు ధర్మం, పక్షి ధర్మం నీలో ఉన్నాయని ఇప్పటికే ఈ లోకం నీ ముఖం చూడదు. ఈ నిరుపేదకు అలాంటి పట్టింపులు లేవు, ఈ కాళ రాత్రి నా గుండె దిగులు పోగొట్టి, ఆ త్రిశూలధారికి నా ఈ సందేశాన్ని చేరవేద్దువు గానీ, ఆలయంలో తలకిందులుగా వేలాడేటపుడు శివయ్య చెవికి కాస్త దగ్గరగా ఉన్నపుడు, పూజారి లేని వేళలో, నా దీనావస్థను వినిపించు స్వామికి. పూజార్లు వింటే నీకు ప్రాయశ్చిత్తం చేసేరు సుమీ!' అంటూనే, ఇక్కడ బ్రహ్మాది దేవుళ్ళూ ధనం గలవాడి అడుపాజ్ఞలలో బందీలయినారని వాపోతాడు.

జాషువా 'గబ్బిలం' కేవలం కవిత్వం కాదు. ఒక అస్పృశ్యుడి ఆర్తనాదం. భారతీయతత్వం, భాషలు, సాంస్కృతిక, చారిత్రక వైభవాన్ని లోకానికి తెలియజెప్పిన 'భారతదర్శిని'.

● దాసరి శ్రీనివాసులు
రిటైర్డ్ ఐఏఎస్ అధికారి

(రేపు: గుర్రం జాషువా 130వ జయంతి)

పఠనాసక్తిని పెంపొందించాలి

గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా గ్రంథాలయ వారోత్సవాలు జరుపుతారు. ఈ ఉత్సవాల్లో గ్రంథాలయాల అభివృద్ధి, పాఠకుల ప్రేరణ, పుస్తకాల విలువను చెప్పే పలు అంశాలు ఉంటాయి. ఇటీవల విద్యార్థులు చాలా సమయం మొబైల్ వినియోగంతో వృథా చేస్తున్నారు. దీంతో అనారోగ్యం, చదువులో వెనుకబాటు కలుగుతున్నాయి. ఈ జాడ్యం బాగా విస్తరించింది. దీనిని కొంతవరకైనా తగ్గించే విధంగా తల్లితండ్రులు దృష్టి సారించాలి. పాఠశాలలో రెండవ పూట ఒక పీరియడ్ లేదా వీలైన సమయంలో ఏదైనా ఒక వాచకాన్ని విద్యార్థులతో విధిగా చదివించాలి. కొన్ని నగరాల్లోని పార్కుల్లో శ్రద్ధ గల యువకులు అక్కడికి వచ్చిన పిల్లలను ఏదో వాచకం లేదా నోట్సు చదివిస్తున్నారు. ఆహ్లాదకరమైన ప్రదేశంలో ఉండడం, చదవడం విద్యార్థులకు ఉపయోగం. మరికొన్ని చోట్ల ఒక బుక్ అల్మారా ఏర్పాటు చేసి, అందులో పుస్తకం ఉంచి, 'పుస్తకం చదవండి' అనే సూచన పెట్టారు. కథలు, విజ్ఞాన విశేషాలు, మహాత్ముల జీవిత కథలు తెలుసుకోవడం ముఖ్యం. కార్పొరేషన్, జిల్లా విద్యాశాఖ, గ్రంథాలయ సమాఖ్య ఆధ్వర్యంలో పుస్తక పఠనాన్ని పెంపొందించడానికి వివిధ ప్రక్రియలను చేపడితే విద్యార్థులలో ఆసక్తి పెరుగుతుంది. ఆ దిశలో విద్యాభిమానులు కృషి చేయాలి.

– బొల్లోజు మేఘనాథం
విశాఖపట్నం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

అఖండ పల్నాడు రాజ్య స్థాపకుడు 'అనుగురాజు'

మధ్యయుగంలో వినుతికెక్కినదే పల్నాడు రాజ్యం. విస్తీర్ణంలో, గ్రామాల పరంగా రాజ్యం చిన్నదే కావచ్చు. కానీ ఈ రాజ్య చరిత్ర మాత్రం అగణితం. ఎన్నో సామ్రాజ్యాలకు సైతం లేని స్వర్ణ చరిత పల్నాడుకి దక్కింది. 194 గ్రామాలకు మాత్రమే పరిమితమైన పల్నాటి రాజ్య చరిత తొలి వీరగాథ. ప్రపంచ చరిత్రలో రోమ్ నగరం తరువాత పల్నాడులోనే యుద్ధంలో మృతి చెందిన వీరుల ఆయుధాలనే వీరులుగా భావించి, నేటికీ కొలుస్తూ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వైధవ్యం ప్రాప్తించిన ఒక స్త్రీమూర్తిని తొలి మహామంత్రిణిగా స్వీకరించిన ఘనత మొదటగా ఈ రాజ్య పాలకులకే దక్కింది. ఇది ఒక గొప్ప సంస్కరణ.

12వ శతాబ్దంలో చరితార్థమైన ఈ గాథ నేటికీ ప్రజల నాలుకలపై నడయాడుతూనే ఉంది. తొలుత 300 ఏళ్ల పాటు మౌఖిక గాథగా మొగ్గ తొడిగిన ఈ చరిత్ర 15వ శతాబ్దిలో శ్రీనాథ మహాకవి మొట్టమొదటిగా అక్షరీకరించి ఒక ద్విపద కావ్యంగా సృజించారు. అట్లా వికసించిన ఈ గాథను భూమికగా చేసుకొని కవులు, రచయితలు, గణ కవిత్వంగా, కథనాలుగా, నవలలుగా, నాటకాలుగా మలిచారు. వీరిలో మూల వాస్తవ గాథకు తూట్లు పొడిచి చెప్పినవారే అధికం. కల్పనలు, మాయలు, మంత్రాలు, తంత్రాలు జోడించి అతిశయాలు పండించినవారే మిక్కుటం. భౌతికతత్వాన్ని వీడి తమ బుర్ర ఏ విధంగా చెబితే ఆ విధంగా వండివార్చినవారు, కల్పితాలకు రంగులు అద్ది చరిత్రను చిత్రించి భ్రష్టు పట్టించిన వారూ లేకపోలేదు. నిజాయితీగా చెప్పడానికి ప్రయత్నించిన వారు పిడికెడు మంది కూడా లేరంటే అతిశయోక్తి కాదు.

ప్రధానంగా పల్నాడు చరిత్రకు శాసనాధారాలు బహు తక్కువ. మనకి ఇప్పుడు లభిస్తున్న పల్నాడు చరిత్ర సారస్వతంలో పల్నాటి రాజులను విస్మరణకు గురిచేసి, మంత్రులైన బ్రహ్మనాయుడు, నాయకురాలు నాగమ్మ చుట్టూనే కలం పట్టిన వారంతా ప్రదక్షిణలు చేశారు. ఇకముందు సైతం పల్నాటి చరిత్ర ఎవరు రాయబూనినా ఇతరత్రా కోణాలు దర్శించలేని వివశమైన స్థితినే ఎదుర్కొంటారు. అఖండ పల్నాడు స్థాపకులు అనుగురాజు యాదవ్ నుంచి, అనంతరం రెండు తరాలు నలగామరాజు యాదవ్, పెదమలి దేవరాజు యాదవ్, నలగాముని కుమారుడు అనుంగు కామరాజు యాదవ్ వీరెవరి గురించి పెద్దగా విషయాలు పొందుపరచకపోవడం ఒక వివక్షే. వీరి గురించి రాయాలంటే దుర్భిణితో వెతుక్కునే కసరత్తు చేయాలి.

అనుగురాజు హైహయ వంశజుడు. కార్తవీర్యార్జునుని పరంపరగా కొన్ని రచనలు నమోదు చేశాయి. ప్రస్తుత బిహార్ రాష్ట్రంలోని పాలమాచాపురి పట్టణం నుంచి వచ్చినట్లుగా బోధపడుతున్నది. 15వ శతాబ్దిలో శ్రీనాథుని సమకాలీనుడూ, ప్రౌఢకవి వినుకొండ వల్లభరాయుడు 'క్రీడాభిరామం' శీర్షిక కలిగిన తన ఖండకావ్యంలోని 'పలనాటి వీరుల చరిత్ర' ఖండికలో అనుగురాజును యాదవుడని స్పష్టం చేశాడు. ఆ ఖండికలోని ఒక పద్యంలో "ఇచ్చోట బోరిరి ఇలపఙంబుగ గొల్ల/ సవతి తల్లుల బిడ్డలవని పతులు" అంటూ చెప్పుకొచ్చాడు. కోడి పోరు సందర్భాన్ని వర్ణిస్తూ గొల్ల(యాదవ) సవతి తల్లుల బిడ్డలైన నలగామరాజు యాదవ్, పెదమలి దేవరాజు యాదవ్ రాజ్యాలను పందెంగా పెట్టినట్లుగా వివరించాడు. ఈ మొదటి పాదంలోని 'గొల్ల' పదం కులాన్ని ప్రస్తావిస్తూ తెలిపిన విషయంగా అర్థమవుతున్నది. ఈ క్రమంలో అనుగురాజు యాదవ్ 'యాదవ కుల సంజాతుడని' ధృవపడుతోంది. పాలమాచాపురి నుంచి సైన్యసమేతుడై దివ్యక్షేత్రాలను దర్శిస్తూ, పుణ్యతీర్థాలు సేవిస్తూ మోటుపల్లి చేరుకున్నట్లు పూర్వపు రచనల ద్వారా తెలుస్తున్నది.

అప్పటికే ఆయనకు ఇరువురు రాణులున్నారు. ఒకరు విద్యలదేవి, మరొకరు భూ రమాదేవి. విద్యలదేవి పుట్టినింటి సంగతులను ఏ రచయితా ప్రస్తావించలేదు. భూ రమాదేవి గయను ఏలిన భీమరాజు కుమార్తె అని నమోదైంది. మోటుపల్లి వద్దనున్నప్పుడు తెల్ల జొన్నకంకుల నేపథ్యంగా ప్రారంభమైన వివాదం చిలికి చిలికి యుద్ధంగా పరిణమించి, ఆ సమరంలో విజయం సాధించిన అనుగురాజు యాదవ్‌కి పరాజయం పాలైన చందవోలునేలే గొంకరాజు యాదవ్ తన కుమార్తె మైలమాదేవిని ఇచ్చి పరిణయం జరిపించాడు. అప్పటి తన ఏలుబడిలో ఉన్న పల్నాడు ప్రాంతాన్ని కుమార్తె మైలమాదేవికి అరణంగా ఇచ్చాడు. భార్యకు అరణంగా వచ్చినప్పటికీ పాలకునిగా అనుగురాజు యాదవ్ ఏలుబడిలోకే వచ్చి, ఆయన అఖండ పల్నాడు స్థాపకునిగా గుర్తింపు పొందాడు. అఖండ పల్నాడును గురజాల రాజధానిగానే ఈయన పాలించారు. అనుగురాజు యాదవ్ పాలన మొదలై ఆయన పరమపదించే వరకూ పల్నాడు అఖండంగా ప్రగతి మార్గాన పయనించింది.

> అనుగురాజు యాదవ్ అఖండ పల్నాడు స్థాపకునిగా గుర్తింపు పొందాడు. గురజాల రాజధానిగా ఈయన పాలించాడు. ఆయన పరమపదించే వరకూ పల్నాడు అఖండంగా ప్రగతి మార్గాన పయనించింది. అనుగురాజు యాదవ్ కుల వివక్షను దాటిన పాలనా సంస్కర్త.



అనుగురాజు యాదవ్, ఆయన అనుచరులు అందరు కూడా శైవ మతస్థులు. ఈయన పాలనలో గురజాలలో ఇష్టకామేశ్వర దేవాలయం, జిట్టగామాలపాడులో చెన్నమల్లి కార్జునస్వామి ఆలయం, తాడుట్ల బుగ్గమల్లేశ్వరస్వామి గుడి, సత్రశాల, దైద, కొదమగుండ్ల, గొళ్ళపాడు, గురజాల కోట గడ్డలు, గుత్తికొండ చీకటి మల్లయ్య కారంపూడి సూరేశ్వరాలయం, జూలకల్లు, మిరియాల శివాలయాలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. ఆ నాటికి పల్నాడులో శివాలయం లేని గ్రామం ఉండదనడం సత్యదూరమేమీ కాదు. దాదాపుగా పల్నాడంతా శివమయమే. అనుగురాజు యాదవ్ పాలనలోనూ, అనంతరం ఆయన వారసుల పాలనలోనూ శక్తి ఆరాధన కూడా జరిగినట్లు వెల్లడవుతోంది. గురజాల మాత, కారంపూడి అంకాళమ్మ దేవాలయాలు పై సంగతిని రుజువు చేస్తున్నాయి.

అనుగురాజు యాదవ్ బ్రహ్మనాయుని తండ్రి దొడ్డ నాయుడిని మంత్రిగా, కన్నమదాసు తండ్రి తెప్పలనీడుని సైన్యాధ్యక్షునిగా నియమించుకుని పాలన సాగించాడు. పల్నాటి చరిత్ర కన్నమదాసుని దళితునిగా (గోసంగి కులస్థునిగా) వివరిస్తున్న క్రమం, తెప్పలనీడు కూడా ఆ ప్రకారమే దళితుడని తెలియవస్తున్నది. ఈ సందర్భాన్ని మూల్యాంకనం చేసుకుంటే ఒక దళితుని సైన్యాధ్యక్షునిగా నియమించుకున్న అనుగురాజు యాదవ్ కుల వివక్షను దాటిన పాలనా సంస్కర్త. ఈయన పేరున పల్నాడులో కొన్ని గ్రామాలు ఏర్పడి కొంచెం అటూ ఇటుగా చెదిరి అవే నామాలతో నేటికీ పిలుస్తున్నారు. అనుగుమల్లిపాడు– అలుగుమల్లిపాడుగా, అనుగుపాలెం–అనుపాలెంగా, అనుగురాజుపల్లె– అలుగురాజుపల్లెగా పిలుస్తున్నారు. ఇంకా అనేక గ్రామాల పేర్లు 12వ శతాబ్ది నుంచి నేటికీ అవే నామాలతో మనగలుగుతున్నాయి. జిట్టగామాలపాడు– గామాలపాడుగా, మాంచాలపాడు– మించాలంపాడుగా, రాచమల్లుపాడు– రచ్చమళ్ళపాడుగా కనిపిస్తున్నాయి. బెల్లంకొండ కొండపై అలరాజు బురుజు నేటికీ సజీవ సాక్ష్యంగా ఉంది. చెర్ల గుడిపాడు, కారంపూడి, కోలగుట్ల, మండాది, ఒప్పిచర్ల, కొదమగుండ్ల, అడిగొప్పల, గుత్తికొండ, జూలకల్లు, గుళ్ళపల్లి, నెకరికల్లు, చిన్న, పెద్ద నెమలిపురి గ్రామాలు పల్నాటి చరిత్రలో కుదురుకున్నాయి.

అనుగురాజు యాదవ్‌ను రెండు యుద్ధాలలో విజయం వరించింది. ఒకటి జొన్నకంకుల యుద్ధం, దీనినే కోరుట్ల యుద్ధం అని చెపుతారు. ఈ యుద్ధం మూలంగా మూడవ రాణి అయిన మైలమాదేవిని బహుమానంగా పొందాడు. కాగా రెండవ యుద్ధం ఆరణగండ్ల యుద్ధం. ఈ యుద్ధం విజయం వల్ల ఆయనకు అధిక మొత్తంలో కప్పం, విలువైన కానుకలు లభించాయి.


సెప్టెంబర్ 28న పిడుగురాళ్ళలో అనుగురాజు యాదవ్ విగ్రహం ఆవిష్కరణ జరగనుంది. రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి, టీడీపీ రాష్ట్ర శాఖాధ్యక్షులు పల్లా శ్రీనివాస యాదవ్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డ్ సభ్యులు జంగా కృష్ణమూర్తి ఈ కార్యక్రమానికి రానున్నారు.

■ వై.హెచ్.కె. మోహన్‌రావు

(రేపు అనుగురాజు యాదవ్ విగ్రహావిష్కరణ)







ఓంకార హారతి

ఓవైపు కళకళలాడుతున్న ఇంద్రగిరి.. ఇంకోవైపు కిటకిటలాడుతున్న భక్తసిరి.. దసరా శరన్నవరాత్రులను మరింత శోభాయమానం చేశాయి. సిరుల మాలక్ష్మి శ్రీమహాలక్ష్మిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ సుందర స్వరూపాన్ని చూసేందుకు శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా, వినాయకుడి గుడి వరకు క్యూలైన్లు కిటకిటలాడుతూ కనిపించాయి. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగగా, ఎక్కడా ఆగకుండా కదలడంతో దర్శనానికి పెద్దగా ఇబ్బందులు ఎదురుకాలేదు. సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సవాల వైభవాన్ని చాటగా, ఆదిదంపతుల నగరోత్సవం నయనానందకరమై భక్తులను ఆధ్యాత్మిక తన్మయత్వంలో ముంచెత్తింది.



నాగ హారతి

సింహ హారతి

కుంభ హారతి

నక్షత్ర హారతి

భక్తసిరి

ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న భక్తుల తాకిడి

మహాలక్ష్మీదేవి దర్శనానికి భారీగా

- శుక్రవారం కావడంతో పోటెత్తిన భక్తులు
- నేటి నుంచి రద్దీ మరింత పెరిగే అవకాశం



అపర కాళికగా కళాకారిణి



నగరోత్సవంలో ఆదిదంపతులు



గవర్నర్ నజీర్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు



కనకదుర్గానగర్‌లో భక్తుల కోలాహలం

విజయవాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి భక్తులతో నిండుగా కనిపించింది. శుక్రవారం వినాయకుడి ఆలయం నుంచి ప్రధానాలయం వరకు క్యూలు భక్తులతో నిండిపోయాయి. శ్రీమహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మను చూసేందుకు భారీగా భక్తజనం తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు క్యూలు కిటకిటలాడుతూనే ఉన్నాయి. రాత్రి 7 గంటల సమయానికి 80 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. 20 వేల మంది వరకు అన్నప్రసాదం స్వీకరించారు. దర్శనానికి 2 గంటల వరకు సమయం పట్టింది. కాగా, శనివారం దుర్గమ్మ శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమివ్వనుండగా, భక్తుల సంఖ్య మరింతగా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇదే ఒరవడి కొనసాగితే మూలా నక్షత్రం రోజున భక్తులు మరింతగా వస్తారని భావిస్తున్నారు. శనివారం, ఆదివారం సెలవు రోజులు కావడంతో ఎక్కువ మంది వస్తారని అంటున్నారు.





క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

దసరా, విజయవాడ ఉత్సవ్ భేష్

కోల్‌కతా, మైసూరు జాబితాలో బెజవాడకు జాతీయ గుర్తింపు

- అన్ని జిల్లాల్లో పర్యాటక ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలి
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు కితాబు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంద్రకీలాద్రిపై దసరా వేడుకలు, విజయవాడ ఉత్సవ్ నిర్వహణ ద్వారా బెజవాడకు జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తోందని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. దసరా అంటే కోల్‌కతా, మైసూరు జ్ఞాపకం వస్తాయని, ఇప్పుడు విజయవాడ కూడా ఆ జాబితాలో స్థానం సంపాదించిందన్నారు. దసరా వేడుకలతో పాటు విజయవాడ ఉత్సవాలను బాగా నిర్వహిస్తున్నందుకు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో శుక్రవారం పర్యాటకాభివృద్ధి అంశాలపై సీఎం ప్రసంగించారు. టూరిజం యాంకర్ హబ్స్ గురించి మాట్లాడుతూ రాష్ట్రంలో పండుగలు బాగా జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంలోనే సీఎం దసరా ఉత్సవాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. అన్ని జిల్లాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు పర్యాటకాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు.

18 మందితో దుర్గగుడి ధర్మకర్తల మండలి

- ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులు 8
- తెలంగాణ నుంచి ఒకరికి అవకాశం

దసరా పర్వదినాన మెగా కార్నివాల్

అక్టోబరు 2, 3 తేదీల్లో నిర్వహణకు భారీ ఏర్పాట్లు

- బందరురోడ్డులో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- గిన్నిస్‌బుక్ రికార్డు సాధించే దిశగా ప్రత్యేక కార్యక్రమాలు
- 2న 3వేల మంది దసరా వేషధారణ కళాకారులతో ప్రదర్శన
- అధికారులతో కలిసి ఎంపీ చిన్ని ఏర్పాట్ల పరిశీలన

విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దసరా పర్వదినాన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో గిన్నిస్‌బుక్ రికార్డుకెక్కేలా మెగా కార్నివాల్ ప్రారంభంకానుంది. అక్టోబరు 2, 3 తేదీల్లో ఈ మెగా కార్నివాల్ మిగతా 6లో..



బందరురోడ్డులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

బందరురోడ్డంతా పండుగ వాతావరణం

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు బందరు రోడ్డంతా కార్నివాల్‌కు వేదిక కానుంది. సుమారు 3 వేల మంది దసరా వేషధారణలు, కళాకారులు తమ అద్భుత ప్రదర్శనలతో, రంగురంగుల వేషాలతో ఆకట్టుకోనున్నారు. దుర్గమ్మ వైభవాన్ని ప్రతిబింబించేలా సంప్రదాయ, జానపద, సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శించనున్నారు. ప్రత్యేకంగా తయారు చేయించిన రథంపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించనున్నారు.

పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు



రెడ్డిగూడెం పీఎస్ ముట్టడికి యత్నం

ఎస్‌ఐను సస్పెండ్ చేయాలని దళితుల నిరసన

రెడ్డిగూడెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక దళితవాడకు చెందిన నిమ్మకూరు రవీంద్రపై రెడ్డిగూడెం ఎస్‌ఐ బి.మోహన్‌రావు దాడికి పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఎమ్మార్పీఎస్ నేతలు, దళితులు శుక్రవారం చేపట్టిన పోలీస్‌స్టేషన్ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. పెద్ద ఎత్తున దళితులు తరలిరావడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మైలవరం, తిరువూరు సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు, సిబ్బంది అక్కడకు చేరుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త పడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నేతలు మాట్లాడుతూ ఎస్సై మోహన్‌రావును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మైలవరం సీఐ చంద్రశేఖర్ ఎమ్మార్పీఎస్ మిగతా 6లో..

మూలకు ముందే అంతా ఉచితం

ఇంద్రకీలాద్రికి పెరిగిన భక్తుల తాకిడి

- ప్రతి దసరాలో మూలా నక్షత్రం రోజునే అన్ని క్యూలు ఉచితం
- ఈ ఏడాది మహాలక్ష్మీ అలంకారం రోజే మొదలైన రద్దీ
- అన్ని క్యూలు ఉచితంగా వదిలేసిన అధికారులు



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : 'వీఐపీలకు అంతరాలయ దర్శనం రద్దుతో పాటు అన్ని క్యూ మార్గాల్లో ఉచిత దర్శనం..' ఏటా దసరా ఉత్సవాల్లో మూలా నక్షత్రం రోజున అమలు జరిగే విధానమిది. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో ఈ పరిస్థితి ముందే వచ్చింది. శుక్రవారం శ్రీమహాలక్ష్మీదేవి మిగతా 6లో..

డ్వాక్రా ఉత్పత్తులకు విజయ మార్కెటింగ్

కృష్ణామిల్క్ యూనియన్ 35వ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ చలసాని ఆంజనేయులు 8





విజయవాడ ఉత్సవ్-2025

అన్‌లిమిటెడ్ జోష్

పున్నమి ఘాట్‌లో కళా జాతర

- ఘంటసాల సంగీత కళాశాలలో ఘనంగా..
- పవిత్ర సంగమంలో విజయ నర్తనం
- తుమ్మలపల్లిలో ఉత్సాహభరితంగా.. 8



దుర్గమ్మ సన్నిధిలో గవర్నర్ నజీర్

ఇంద్రకీలాద్రి/చిట్టినగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై మహాలక్ష్మీదేవి అలంకారంలో కనక దుర్గమ్మను ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి హరిజవహర్‌లాల్, కమిషనర్ రామచంద్ర మోహన్, ఈవో వీకే శీనానాయక్‌లు గవర్నర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ ముఖ్య కార్యదర్శి హరిజవహర్‌లాల్ ఆలయ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. భక్తుల ఏర్పాట్లు, సౌకర్యాలపై ఆరాతీశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, జేసీ ఎస్.ఇలక్కియ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తదితరులు పాల్గొన్నారు.





అమ్మా.. దుర్గమ్మా..

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ భక్తులకు శుక్రవారం మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకోవడానికి ఉదయం మూడు గంటల నుంచే భక్తులు పోటెత్తారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి తదితర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు దుర్గమ్మను దర్శించుకున్నారు.

అరాచక శక్తుల నుంచి అమ్మ రక్షించాలి

» త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

అరాచక శక్తుల నుంచి దేశాన్ని రక్షించాలని అమ్మవారిని ప్రార్థించినట్టు త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి చెప్పారు. దసరా నవరాత్రులలో శుక్రవారం శ్రీమహాలక్ష్మిగా దర్శనమిస్తున్న అమ్మవారిని ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్‌లతో కలిసి ఆయన సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో, అర్చకస్వాములు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోని శక్తి పీఠాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. గతవారం త్రిపుర రాష్ట్రంలోని త్రిపుర సుందరీదేవిని దర్శించుకున్నానని, ఈరోజు మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రజలందరికీ ఆయురారోగ్య, ఐశ్వర్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు.

అమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి పథంలో..



- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం మహాలక్ష్మీదేవి అలంకృత దుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడుతూ, అమ్మవారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని, ప్రజలు క్షేమంగా ఉండాలన్నారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు ముఖ్యమంత్రికి మరింత శక్తి ఇవ్వాలని కోరుకున్నట్టు మంత్రి తెలిపారు.



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను శుక్రవారం మహాలక్ష్మి అలంకారంలో శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనాలు, అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

మూలకు ముందే అంతా ఉచితం

(5వ పేజీ తరువాయి)

అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమివ్వగా, రాష్ట్రం నలు మూలల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. సాయంత్రం 6 గంటలకు 90 వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. ఇంకా క్యూల్లో 18 వేల నుంచి 20 వేల మంది వరకు భక్తులు ఉన్నారు. దీంతో అధికారులు ఆలస్యానికి ఆస్కారం ఉన్న పరిస్థితులను రద్దు చేశారు. రూ.100, రూ.300 క్యూల్లోని భక్తులను ఉచితంగా దర్శనానికి పంపారు. ఈ రెండు క్యూల్లో ఉన్న భక్తుల వద్ద ఎలాంటి టికెట్ తీసుకోవద్దని అధికారులు ప్రకటించారు. క్యూల్లో ఉన్న భక్తులకు రాత్రి 12 గంటల వరకు దర్శనం కల్పిస్తామని వెల్లడించారు.

ఇంద్రకీలాద్రికి పెరిగిన భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలలో వివిధ అలంకారాల్లో దుర్గమ్మను దర్శించుకోవటానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. విజయవాడ నుంచే కాకుండా పరిసర ప్రాంతాలు, రూరల్ గ్రామాలు ఇతర జిల్లాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకోవటానికి తరలివస్తుండటంతో కెనాల్ రోడ్డు, దుర్గాఘాట్, రథం సెంటర్, మునిసిపల్ ఆఫీస్, సీతమ్మవారి పాదాలు ఇలా ఇంద్రకీలాద్రి పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో కోలాహలంగా కనిపిస్తున్నాయి. పలువురు భక్తులు కాలినడకన తరలివస్తున్నారు. అత్యధిక సంఖ్యలో భక్తులు కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి క్యూలో కొండపైకి చేరుకుంటున్నారు. జై దుర్గా జైజై దుర్గా అంటూ అమ్మవారి స్మరణ చేస్తున్నారు. రద్దీ సమయంలో అమ్మవారి దర్శనం రెండు గంటలకు పైగా పడుతోంది. ముఖ్యంగా మూలా నక్షత్రం నాడు సరస్వతీ దేవీ అలంకారంలో దుర్గమ్మను దర్శించుకోవటానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఆదివారం, శుక్రవారాలు అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈసారి 11రోజులు మహోత్సవాలు రావటంతో ప్రత్యేకంగా గురువారం కాత్యాయనీ దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. పదేళ్లకోసారి కాత్యాయనీదేవిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు వేకువజామునుంచే తరలివచ్చారు. మహాలక్ష్మీదేవి అలంకారంలో శుక్రవారం దుర్గమ్మను దర్శించేందుకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. వేకువజామున 3 గంటల నుంచే దర్శనాలు ప్రారంభమయ్యాయి. క్యూలు మధ్యాహ్నం కూడా కిక్కిరిసి ఉన్నాయి. లక్ష మందికి పైగా దర్శించుకుంటారని అంచనా, శుక్రవారం, మహాలక్ష్మీదేవి అలంకారంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆదాయం రూ.37.38 లక్షలు

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానం దసరా మహోత్సవాలలో నాలుగోరోజు గురువారం వివిధ రూపాల్లో మొత్తం రూ.37,38,042లు ఆదాయం సమకూరినట్టు ఈవో వీకే శీనానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.300లు టికెట్ల ద్వారా రూ.6,92,700లు, రూ.100ల ద్వారా రూ.2,67,600లు, లడ్డూ ప్రసాదం (ఒక్కొక్క లడ్డూ రూ.15లు) ద్వారా రూ.4,09,595లు, రూ.100ల లడ్డూ ద్వారా రూ.20,71,000లు లభించినట్టు పేర్కొన్నారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చనల (టికెట్ రూ.3వేలు) టికెట్ల ద్వారా రూ.66వేలు, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన (టికెట్ రూ.5వేలు) టికెట్ల ద్వారా రూ.10 వేలు, చండీ హోమం (టికెట్ రూ.4వేలు) టికెట్ల ద్వారా రూ.16వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన (టికెట్ రూ.5,116లు) టికెట్ల ద్వారా రూ.35,812లు పుస్తకాలు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.9,885లు, తలనీలాల సమర్పణకు (టికెట్ రూ.40) టికెట్ల ద్వారా రూ.85,680లు, ఇతరత్రా రూ.8,500లు, లడ్డూ ప్రసాదం ఆన్‌లైన్ ద్వారా రూ.65,270లు, మొత్తం కలిపి రూ.37,38,042లు లభించినట్టు ఈవో వివరించారు.





కనకదుర్గమ్మకు కాణిపాకం పట్టు వస్త్రాలు



కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం తరపున కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్, ఈవో పి.కిషోర్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రుల్లో ఐదో రోజు మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మకు కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం తరపున పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసం, దసరాకు రెండు పర్యాయాలు అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించే సంప్రదాయం ఉందని చెప్పారు. కాణిపాకం దేవస్థాన ఈవో పెంచల కిశోర్, స్థానాచార్యుడు ఫణీంద్ర స్వామితో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించినట్టు చెప్పారు. ఇంద్రకీలాద్రిపై భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్న అధికార యంత్రాంగాన్ని అభినందించారు.



మెగా డీఎస్సీ విజయవంతం

» కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం



వన్‌టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీని అత్యంత పారదర్శకంగా నిర్వహించి విజయం సాధించిందని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. ఆటోనగర్‌లోని జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి నారా లోకేశ్ పర్యవేక్షణలో విద్యాశాఖ మంత్రిగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన 150రోజుల్లో పూర్తిస్థాయిలో నిర్వహించి, ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించారన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సమర్థవంతంగా పూర్తిచేసిన ఘనత లోకేశ్‌కే దక్కిందన్నారు. టీడీపీ కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) మాట్లాడుతూ, ఉపాధ్యాయ నియామకాలు చంద్రబాబు, లోకేశ్ హయాంలో మాత్రమే జరిగాయన్నారు. కొట్టేటి హనుమంతరావు, ఎస్ఎం ఫైజాన్, పరిశపోగు రాజేష్, పామర్తి కిషోర్ బాబు, సోలంకి రాజు జైన్, బత్తుల దుర్గారావు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో చైర్మన్ జీవన్ వెంకట్రావు, సొసైటీ డైరెక్టర్లు

త్వరలో గోదావరి కృష్ణ కో-ఆపరేటివ్ సొసైటీ 131 బ్రాంచ్‌ల ఏర్పాటు

» చైర్మన్ మేడూరు జీవన్ వెంకటరావు

గొల్లపూడి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గోదావరి కృష్ణ కో-ఆపరేటివ్ సొసైటీ ఇప్పటివరకు 23 బ్రాంచీలను స్థాపించిందని రానున్నరోజుల్లో రాష్ట్రం మొత్తంలో 131 బ్రాంచ్‌లు స్థాపించాలన్న సంకల్పంతో తామంతా పనిచేస్తున్నట్టు గోదావరి కృష్ణ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మేడూరు జీవన్ వెంకటరావు తెలిపారు. శుక్రవారం గొల్లపూడి శివారు సీఏ కన్వెన్షన్‌లో 6వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 నుంచి 2025 మార్చి 31 నాటికి 83.60 లక్షలు డిపాజిట్లు చేశారని అన్నారు. అదేవిధంగా రూ.59.41 లక్షలు లోన్లను ఇచ్చినట్టు తెలిపారు. మార్చి నుంచి సెప్టెంబరు వరకు మొత్తంగా రూ.100 కోట్ల డిపాజిట్లను అధిగమించినట్టు తెలిపారు. ఇప్పటివరకు ఉమ్మడికృష్ణాలో 23 బ్రాంచిలు ఏర్పాటు చేశామని, రానున్న రోజుల్లో రాష్ట్రంలోని అభివృద్ధి చెందుతున్న 131 మండలాల్లో తమ బ్రాంచ్‌లను ఏర్పాటు చేసే సంకల్పంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. చిరు వ్యాపారులకు రోజువారి తక్కువ వడ్డీకి ఇవ్వాలనే ఉద్దేశంతో సొసైటీ స్థాపించినట్టు తెలిపారు. రూ.200 కోట్లు డిపాజిట్లు సేకరించి, లక్షమంది చిరు వ్యాపారులకు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ధర్మనిధి ఆదాయ పథకంలో ఆలయాలు, చర్చిలు, మసీదులు, సేవా సంస్థలు, వికలాంగ సంస్థలు, తదితర సంస్థలు డిపాజిట్లు చేస్తే 14.4% అంటే నెలకు రూ.లక్ష డిపాజిట్ చేస్తే వారికి రూ.1200 వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ దామర్ల పూర్ణిమ సొసైటీ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

దసరా పర్వదినాన మెగా కార్నివాల్

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తారు. ఈ కార్నివాల్ ఏర్పాట్లను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం సమీక్షించారు.

ఏర్పాట్ల పరిశీలన

కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం ఈ కార్నివాల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. బందరు రోడ్డులోని డి అడ్రస్ మాల్ ఎదుట ఏర్పాటు చేస్తున్న సభావేదిక స్థలాన్ని పరిశీలించారు.

ముఖ్య అతిథుల రాక.. భద్రతా చర్యలపై దృష్టి

ఈ కార్నివాల్‌కు ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరవుతుండటంతో భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొనే అవకాశం ఉండటంతో రహదారిపై రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యేక సదుపాయాలు సిద్ధం చేయాలని ఎంపీ సూచించారు. కార్నివాల్‌లో పాల్గొనబోయే కళాకారులు, ప్రేక్షకుల కోసం నీటి సదుపాయం, వైద్య శిబిరాలు, పార్కింగ్, శానిటేషన్ వంటి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, భద్రతను దృష్టిలో పెట్టుకుని అదనపు సిబ్బందిని సిద్ధం చేయాలని పోలీసులకు సూచించారు.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దసరా ఉత్సవాలు : ఎంపీ కేశినేని శివనాథ్

'విజయవాడ దసరా ఉత్సవాలు కేవలం నగర స్థాయిలోనే కాకుండా దేశ, ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించేలా ఈ కార్నివాల్ నిర్వహించనున్నాం. మొత్తం 3 వేల మంది కళాకారులతో జరిగే ఈ అద్భుత ప్రదర్శన ద్వారా గిన్నిస్‌బుక్ రికార్డుల్లో ఎక్కనున్నాం. విజయవాడ దసరా ఉత్సవాలు భవిష్యత్తులో మరింత విశిష్టంగా నిలుస్తాయి.' అని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఈ ఏర్పాట్ల పరిశీలనలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, పాలచూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం పీఎస్ ముట్టడికి యత్నం

(5వ పేజీ తరువాయి)

నేతలతో చర్చలు జరిపారు. ఎస్సైకు మెమో జారీ చేశామన్నారు. దసరా పండుగ తర్వాత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఎమ్మార్పీఎస్ నేతలు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంకొల్లు జమలయ్య, కోటా దానియేలు, మందా వెంకటేశ్వరరావు, ఆలూరి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీఐపీల తాకిడితో సామాన్య భక్తులకు ఇబ్బందులు

» ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడి దసరా ఉత్సవాలలో పెద్ద ఎత్తున వీఐపీలు అమ్మవారి దర్శనానికి రావటంతో సామాన్య భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, వీఐపీలు వారికి కేటాయించిన సమయాలలో మాత్రమే అమ్మవారి దర్శనానికి రావాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ తెలిపారు. శుక్రవారం కొండపైన మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. కలెక్టర్, పోలీసు కమిషనర్, దేవదాయ శాఖ అధికారులు సంయుక్తంగా భక్తులకు సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం సులువుగా కలిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వీఐపీలు తమకు కేటాయించిన సమయాలలో మాత్రమే అమ్మవారి దర్శనానికి రావాలని, వేరే సమయంలో దర్శనానికి వస్తే ఏమీ చేయలేకపోతున్నామని, దానివల్ల సామాన్య భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యలు లేకుండా భక్తులకు త్వరగా అమ్మవారి దర్శనం కలిగించే విధంగా వీఐపీలు సహకరించాలని కోరారు. ఏదైనా చిన్న చిన్న సంఘటనలు జరిగినా వెంటనే వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు 90వేలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని చెప్పారు.

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు

లబ్బీపేట: దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిలక్ష్మిగా దుర్గమ్మ దర్శనమిచ్చారు. అమ్మవారిని హోంమంత్రి అనిత, మంత్రి అచ్చెన్నాయుడులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అనిత క్యూలో భక్తులతో ఏర్పాట్లపై అడిగితెలుసుకున్నారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.



ఏర్పాట్లపై భక్తులతో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత









నగరం.. ధగ ధగ

దసరా.. విజయవాడ ఉత్సవ్‌లతో మెరిసిన రహదారులు రాత్రివేళ నగర అందాలు చూడాలంటే రెండు కళ్లు చాలవు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ ధగధగలాడుతోంది. నగరం యావత్తూ విద్యుత్ కాంతులతో వెలిగిపోతోంది. ఇటు దసరా ఉత్సవాలు.. అటు విజయవాడ ఉత్సవ్ తో విజయవాడ నగరం యావత్తూ దేదీప్యమానంగా మెరిసిపోతుంది. రాత్రి వేళ నగర అందాలను చూడాలంటే రెండు కళ్లు చాలడం లేదు. సప్తవర్ణ శోభితంతో విజయవాడ మెరిసిపోతోంది. ఎంత చూసినా తనివితీరనిది. రాత్రుళ్లు విద్యుత్ కాంతులను చూసేందుకు నగర ప్రజలు వస్తున్నారు. అందాలతో సెల్ఫీలు తీసుకుంటున్నారు. దసరా ఉత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రి, కనకదుర్గానగర్, కనకదుర్గా ఫ్లైఓవర్లు, ప్రకాశం బ్యారేజీ ఇలా పరిసర ప్రాంతాలన్నీ దేదీప్యమానంగా వెలుగొందుతుంటే.. మరోవైపు విజయవాడ నగరంలో ప్రధాన జాతీయ రహదారులు ఎన్‌హెచ్-65, ఎన్‌హెచ్-16, అంతర్గత ప్రధాన రహదారులు బందరు రోడ్డు, ఏలూరు రోడ్డు, ఈట్ స్ట్రీట్‌లు లైటింగ్‌తో ప్రకాశిస్తున్నాయి. నగరంలో వ్యాపార దుకాణాలు, మాల్స్, హోటల్స్ ఇలా ఎటు చూసినా విద్యుత్ కాంతుల సోయగం కనిపిస్తోంది. కనువిందు చేయనున్న ఈ దృశ్యాలను వీక్షించాలంటే బెజవాడ రావాల్సిందే!

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117,125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

విధులకు గైర్హాజరైతే చర్యలు: డీఎంహెచ్‌వో



విజయవాడ,ఆంధ్రజ్యోతి: దసరా ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపుల విధులకు గైర్హాజరైన వారిపైశాఖాపరంగా చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం మహా మండపంలోని వైద్య శిబిరాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, పనితీరును ప్రశ్నించారు.అత్యవసర పరిస్థితిలో ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.



కూరగాయల లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

టీటీడీ నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ

లబ్బీపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి గద్దె శ్రీనివాసరావు, గిరి బాల ఆధ్వర్యంలో 10టన్నుల కూరగాయలతో వెళ్తున్న లారీని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శుక్రవారం మొగల్రాజపురంలోని గిరిబాల జీజేఎంఆర్ ఫిల్లింగ్ స్టేషన్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాలలో లక్షలాదిగా వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం ద్వారా ఉచితంగా అన్నప్రసాదం అందజేస్తారని అటువంటి కార్యక్రమంలో భాగస్వాములు కావడం ఎంతో అదృష్టం అని అన్నారు. మండవ కుటుంబరావు ప్రారంభించిన ఈ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగించడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గద్దె శేషుబాబు, వసుధ, జగన్ మోహనరావు దివిజ తదితరులు పాల్గొన్నారు.



కరెన్సీనగర్ దాసాంజనేయ దేవాలయంలో, మద్దిరావమ్మ తల్లి , ఆర్ఆర్ గార్డెన్‌లో, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు, శ్రీలలితా పరమేశ్వరి దేవి, శ్రీమరకత రాజేశ్వరి, అభయాంజనేయస్వామి ఆలయంలో, కాళీమాత, మహాశక్తి ఆలయంలో, ధనకొండ అమ్మవారు

మహాలక్ష్మీ.. కరుణించమ్మా

భారతీనగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో అమ్మవారు పలు అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ పందిళ్లలో విశేష పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుణదల పాత పంచాయతీ కార్యాలయం సమీపంలోని శ్రీమద్దిరావమ్మ తల్లి దేవస్థానంలో, కరెన్సీనగర్ దాసాంజనేయ స్వామి ఆలయంలో, ఆర్ఆర్ గార్డెన్‌లోని శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, పటమట దర్శిపేటలోని శ్రీరాజరాజేశ్వరి లలితాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో, పటమట దత్తపీఠంలోని శ్రీమరకత రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని శుక్రవారం మహాలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆటోనగర్‌లో కరెన్సీనోట్లతో అలంకరణ

ఆటోనగర్: జవహర్ ఆటోనగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. ఐదు, రెండు రూపాయలు కరెన్సీ నోట్లు, కాయన్లతో అమ్మవారికి దండగా అలంకరించారు. పూజారి ఆచార్య కస్తూరి రాజ్‌గోపాల్ అమ్మవారికి పూజలు చేశారు.

మహాలక్ష్మిగా ధనకొండ అమ్మవారు

మొగల్రాజపురం: మొగల్రాజపురం ధనకొండపై దుర్గాభవానీ మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో...

సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకల్లో శుక్రవారం అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. నాలుగువేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం లలితాపారాయణం, దశవిధ హారతులు, నీరాజన మంత్రపుష్పం, వేదస్వస్తి సమర్పించారు. అనంతరం అమ్మవారిని ఊరేగించారు. అమ్మవారి అవతారాల ప్రాశస్త్యం తెలిపే నృత్యప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం వేదిక అలంకార దాతగా శ్రీ బృందా గ్రీన్ ఎస్టేట్స్ వారు, స్వర్ణాభరణ అలంకరణ దాత రాధేగోల్డ్ అండ్ డైమండ్స్ వారు ఉన్నారు.



విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, దేవీభక్త బృందం ఆధ్వర్యంలో



పూజలు చేస్తున్న కొక్కెర తిరుపతయ్య

దేవీ భక్త బృందం ఆధ్వర్యంలో..

రామలింగేశ్వరనగర్: పటమట ఎన్ఎస్ఎం స్కూలు దగ్గర కౌండిన్యనగర్‌లో దేవీభక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికపై శుక్రవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఉభయ దాతలు మల్లెల జగన్మోహనరావు శివ నాగేంద్రం, జ్వాలాపురి శేషఫణి లక్ష్మీ సౌజన్య చేతుల మీదుగా పూజా కార్యక్రమం నిర్వహించారు.

సంగుల పేరయ్య వీధిలో..

రాణిగారితోట,: రాణిగారితోట సంగుల పేరయ్య వీధిలో ఏర్పాటు చేసిన దసరా నవరాత్రి ఉతవాల్లో శుక్రవారం అమ్మవారు లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. విఘ్నేశ్వర బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో టీడీపీ తూర్పు బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కెర తిరుపతయ్య అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ● రాణిగారితోటలో ఉన్న మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో దర్శనం ఇచ్చారు. కార్పొరేటర్ అడపాశేషు ఆధ్వర్యంలో జరిగాయి.

త్రిశక్తిపీఠంలో ..

కృష్ణలంక: త్రిశక్తి పీఠంలోని కాళీమాత అమ్మవారు, కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో, కృష్ణలంకలోని సిద్ధేశ్వరీ పీఠంలో భక్తులకు మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి కుంకం పూజ, అభిషేకం, చండీహోమం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయండి

● అధికారులకు నగర కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం



మ్యాన్‌హోల్ పరిశీలిస్తున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని రహదారులకు మరమ్మతులు నిర్వహించి గోతులు లేకుండా చూడాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం గురునానక్ కాలనీ, ఎన్ఏసీ కల్యాణమండపం, రమేష్ హాస్పటల్ సిగ్నల్స్, బెంజిసర్కిల్, వెటర్నరీ హాస్పటల్, ఎంజీ రోడ్డు, కృష్ణలంక, వినాయకునిగుడి, కృష్ణవేణి ఘాట్, కేశఖండనశాల, హోల్డింగ్ ఏరియా, కెనాల్ రోడ్డు, క్యూ లైన్ ప్రాంతాలను కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. రమేష్ హాస్పటల్ సిగ్నల్ నుంచి గురునానక్ కాలనీ వెళ్లే రోడ్డు పెద్ద పెద్ద గోతులు ఉండడాన్ని గమనించి అధికారులు వెంటనే మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డుపై వర్షపు నీటి నిల్వలు ఎక్కడ ఉండరాదని, నగరంలోని మ్యాన్‌హోల్ రోడ్డులకు సమానంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. దసరా ఉత్సవాలకు వచ్చిన భక్తులతో మాట్లాడి వారికి ప్రస్తుతం నగరపాలక సంస్థ అందిస్తున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అందుకు వారు ఏర్పాట్లు చాలా బాగున్నాయని తెలిపారు. అనంతరం కృష్ణలంక సాయిబాబా గుడి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, ఈఈ జి. సామ్రాజ్యం, పాల్గొన్నారు.

హిందీ భాషాభివృద్ధికి సహకరించండి

● మంత్రి అచ్చెన్నాయుడుకు హిందీ ప్రచారసభ ప్రతినిధుల వినతి



మంత్రి అచ్చెన్నాయుడును సన్మానిస్తున్న గైబువల్లి ప్రతినిధుల బృందం

భారతీనగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హిందీ భాషాభివృద్ధికి సహకరించాలని హిందీ ప్రచారసభ హైదరాబాద్ ప్రాంతం జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి ప్రతినిధుల బృందం కోరింది. శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశుసంవర్థక, మత్స్య శాఖమంత్రి కె. అచ్చెన్నాయుడును తన కార్యాలయంలో కలిసి, ఆయనను సన్మానించి, వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్.గైబువల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో హిందీ భాష అందరూ మాట్లాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ హిందీ భాషాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

అనంతరం నగరానికి వచ్చిన ప్రముఖ సినీ రచయిత, డైరెక్టర్, నిర్మాత వీరశంకర్‌ను హిందీ ప్రచారసభ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ అకౌంట్‌బిలిటి, ట్రాన్స్‌పెరెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ జి.శ్రీకాంత్, ఎడుక్ వ్యవస్థాపక సీఈవో శ్రీనివాస ముద్దలాపురం, హిందీ ప్రతినిధులు శివ, ఇంతియాజ్ పాల్గొన్నారు.

అనంత్ డైమండ్స్ ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ



ప్రసాదం పంపిణీ చేస్తున్న అడ్మిన్ డీసీపీ సరిత తదితరులు

లబ్బీపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రుల పర్వదినాలలో భక్తులకు అమ్మ ప్రసాదం పంపిణీ చేయడం చాలా మంచికార్యక్రమం అని అడ్మిన్ డీసీపీ సరిత అన్నారు. అనంత్ డైమండ్స్ ఆధ్వర్యంలో శక్రవారం బందర్ రోడ్డులోని షోరూం వద్ద భక్తులకు ప్రసాదాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమాన్ని అడ్మిన్ డీసీపీ సరిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సురక్ష కమిటీ కన్వీనర్ కుదరవల్లి నరసయ్య, అనంత్ డైమండ్స్ ఎండీ జాస్తీ అనంత్ పద్మశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవితఖైదు

విజయవాడ లీగల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భార్యను హత్య చేసిన భర్తపై నేరం రుజువుకావడంతో జీవితఖైదు, రూ.1200 జరిమానా విధిస్తూ మహిళా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.రాజేశ్వరి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం చొప్పా నర్సింహారావు కుమార్తె అప్పల నరస అలియాస్ శేషను విజయవాడ ముత్యాలంపాడుకు చెందిన మామిడి దుర్గారావుకు ఇచ్చి 2013లో వివాహం చేశారు. వీరికి ఇద్దరు సంతానం. కొంతకాలం తర్వాత భర్త దుర్గారావు భార్యపై అనుమానం పెంచుకొని గొడవ పడుతూ వేధిస్తున్నట్లు, ఆమెను విశాఖ జిల్లా నక్కపల్లి గ్రామంలోని పుట్టింటికి పంపి అక్కడ పెద్దల సమక్షంలో మాట్లాడాడు. ఆ సమయంలో విజయవాడ వస్తే చంపుతానని భర్త బెదిరించినట్లు, ఈ క్రమంలో కొద్దిరోజులకు అప్పల నరస విజయవాడ వచ్చి బుడమేరు మధ్యకట్ట సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని నివసిస్తోంది. 2021 సెప్టెంబరు 24న దుర్గారావు ఆమె ఇంటికి వచ్చి విజయవాడ ఎందుకు వచ్చావని గొడవ పడి మెడకు చీరతో ఊపిరాడకుండా హత్య చేసినట్లు మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై నిందితుడిని అరెస్టు చేశారు. కేసు విచారణలో 12 మంది సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి భర్తపై నేరం రుజువుకావడంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

అలరించిన 'మహాకాళి' కూచిపూడి నాట్యరూపకం



మహాకాళి నాట్య రూపంలో అభినయం

విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం, ఆర్ట్ ఇండియా ఫౌండేషన్ (హైదరాబాద్) సంయుక్త నిర్వహణలో శుక్రవారం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో ప్రదర్శితమైన 'మహాకాళి' కూచిపూడి నాట్యరూపకం ఆద్యంతం భక్తి ప్రపత్తులతో సాగింది. దసరా ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవి ఏడో అవతారంగా సర్వత్రా పూజలందుకుంటున్న కాళీమాతను ఈ నృత్యరూపకం మహాశక్తి స్వరూపిణిగా ఆవిష్కరించింది. శుంభ, నిశుంభ రక్తబీజాది అసురులను అంతమొందించడానికి దేవి మహాకాళీగా అవతరించే ఘట్టాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించింది. డాక్టర్ తడకమళ్ల అనురాధ నృత్య దర్శకత్వం వహించగా, సంగీతం, నట్టువాంగం, గాత్రం దండిభొట్ల శ్రీనివాస వెంకటశాస్త్రి నిర్వహించారు. అనురాధ (జొన్నల గడ్డ) తడకమళ్ల, కాత్యాయని కనక్, ధూళిపాళ్ల అపర్ణ, పీబీ వైష్ణవి, అనూషా శ్రీనివాస్, ఒగ్గు ప్రవీణ్, బక్కి శీనయ్య, గౌతం తదితర నృత్య కళాకారులు తమ ప్రదర్శనతో అలరించారు. తొలుత సిద్ధార్థ కళాపీఠం ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ లలిత ప్రసాద్, ఉపాధ్యక్షుడు వెల్లంకి నాగభూషణ రావు, కార్యదర్శి బీవీఎస్ ప్రకాశ్, ఆర్ట్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ నృత్య దర్శకురాలు ఆచార్య అనురాధ జె.తడకమళ్ల జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అనురాధను సత్కరించారు.

ఆటోనగర్ ఐలా పాలకవర్గం ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధం

● మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్



ఆటోనగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జవహర్ ఆటోనగర్ ఐలా(ఇండస్ట్రీయల్ ఏరియా లోకల్ అథారిటీ) సర్వీస్ సొసైటీ పాలకవర్గం ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఐలా సర్వీస్ సొసైటీ మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం ఆయన జవహర్ ఆటోనగర్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సొసైటీ సభ్యుల్లో ఆస్తిపన్ను కనీసం 60 శాతం, సభ్యుత్వ రుసుం 60 శాతం మంది చెల్లించి ఉంటేనే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాలకవర్గం ఎన్నికలకు అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయం తాను ఇప్పటికే ఎంపీ కేశినేని శివనాథ్‌తో చర్చించి ఏపీఐఐసీ ఎండీతో కూడా మాట్లాడామని తెలిపారు. దీనిపై జవహర్ ఆటోనగర్‌లో ఐలా సర్వీస్ సొసైటీకి పన్ను చెల్లించే వారంతా ఆస్తిపన్ను, సభ్యుత్వ రుసుం చెల్లించాలని ఆయన కోరారు. సొసైటీలో మొత్తం 1860 మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. తాను 2022 వరకు రెండు పర్యాయాలు చైర్మన్‌గా పనిచేశానని, తన పదవీ కాలం ముగిసిన తరువాత ఇప్పటి వరకు ఐలా సర్వీస్ సొసైటీ పాలకవర్గ ఎన్నికలు జరగలేదని వివరించారు.

పాలకవర్గం ఉండాల్సిందే...

ఆటోనగర్‌లోని ప్రజలు ఎదుర్కొనే సమస్యలు పరిష్కారం కావాలంటూ తప్పనిసరిగా ఐలా పాలకవర్గం ఉండాల్సిందేనని సుంకర దుర్గాప్రసాద్ చెప్పారు. ఐలా పాలకవర్గం లేకపోవడంతో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని చెప్పారు. ఆటోనగర్‌కు పూర్వస్థితి రావాలంటే ఐలాకు పాలకవర్గం రావాలని, దీనికి ఎన్నికలే మార్గమని తెలిపారు.

జనసేన జిల్లా కార్యాలయం ప్రారంభం నేడు

జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను

విద్యాధరపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో జనసేన పార్టీ జిల్లా కార్యాయాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జనసైనికులకు, నాయకులకు, వీర మహిళలకు అందుబాటులో ఉండేవిధంగా కార్యాలయాన్ని భవానీపురంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

18 మందితో దుర్గగుడి ధర్మకర్తల మండలి

● ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులు ● తెలంగాణ నుంచి ఒకరికి అవకాశం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి ప్రభుత్వం ధర్మకర్తల మండలిని నియమించింది. మొత్తం 18 మందికి మండలిలో స్థానం కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది. శరన్నవరాత్రి ఉత్సవాలకు ముందు పోరంకి గ్రామానికి చెందిన బొర్రా రాధాకృష్ణను చైర్మన్‌గా నియమించింది. ఆ సమయంలో ధర్మకర్తల మండలిని నియమిస్తుందని భావించారు. ఈలోగా శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమవ్వడంతో ప్రభుత్వం తాత్కాలికంగా 96 మందితో ఉత్సవ కమిటీని నియమించింది. ఇందులో ఉమ్మడి కృష్ణాజిల్లాకు కూటమి నేతలకు స్థానం కల్పించారు. శరన్నవరాత్రులు ఐదో రోజుకు చేరుకున్న సమయంలో ప్రభుత్వం ధర్మకర్తల మండలిని నియమించింది. కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, అనంతపురం, నెల్లూరు జిల్లాలకు ఈ మండలిలో ప్రాతినిధ్యం కల్పించారు. 16 మందిని సభ్యులుగాను, మరో ఇద్దరిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించింది. అవ్వారు శ్రీనివాసరావు(విజయవాడ పశ్చిమ, బీజేపీ), బడేటి ధర్మారావు(విజయవాడ సెంట్రల్, టీడీపీ), గూడపాటి వెంటక సరోజినీ దేవి(మైలవరం, టీడీపీ) జీవీ నాగేశ్వర రావు(రేపల్లె, టీడీపీ), హరికృష్ణ(హైదరాబాద్, తెలంగాణ టీడీపీ) జింకా లక్ష్మీదేవి(తాడిపత్రి, టీడీపీ), మన్నె కళావతి(నందిగామ, టీడీపీ), మోరు శ్రావణి(దెందులూరు, టీడీపీ), పద్మావతి ఠాకూర్(విజయవాడ పశ్చిమ, జనసేన). పనబాక భూలక్ష్మి(నెల్లూరు రూరల్ , టీడీపీ) పెనుమత్స రాఘవరాజు(విజయవాడ సెంట్రల్, బీజేపీ), వెలగపూడి శంకర్‌బాబు(పెనమలూరు, టీడీపీ), సుకాశి సరిత (విజయవాడ పశ్చిమ, టీడీపీ), తంబాళపల్లి రమాదేవి(నందిగామ, జనసేన), తోటకూర వెంటక రమణారావు(తెనాలి, జనసేన) అన్నవరపు వెంటక శివ పార్వతి (పెనమలూరు, టీడీపీ)కి స్థానం కల్పించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మార్తి రమాబ్రహ్మం(విజయవాడ) ఏలేశ్వరపు సుబ్రహ్మణ్య కుమార్(విజయవాడ)ను ధర్మకర్తల మండలిలో నియమించారు.

హనుమాన్, అంబికగా రష్యన్ దంపతుల పేర్లు

● భారత్ పర్యటనలో మార్పు



శాస్త్రోక్తంగా పేర్లు మార్చుకుంటున్న రష్యన్ దంపతులు

గుణదల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవన ప్రయాణానికి సరైన మార్గం సనాతన ధర్మమని, అటువంటి పవిత్రమైన ధర్మం తమకెంతో ఆదర్శనీయమంటూ రష్యన్ దంపతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. భారతీయుల కట్టుబొట్టు తమకెంతో నచ్చిందని అన్నారు. రష్యాకు చెందిన దంపతులు భారతదేశ పర్యటనకు వచ్చారు. దానిలో భాగంగా వారు శుక్రవారం బీఆర్‌టీఎస్ రోడ్డు వద్ద రామాలయాన్ని సందర్శించారు. అక్కడ అమ్మవారి దసరా నవరాత్రులు చేసే విధానం రష్యన్ దంపతులను ఆకట్టుకుంది. దీంతో ఆ దంపతులు ఏకంగా వారు జన్మతహా పెట్టుకున్న నామకరణాలను మార్పు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. భర్త పేరు హనుమాన్‌గానూ, భార్య పేరు అంబికగా శాస్త్రోక్తంగా అక్కడే ఉన్న వేదపండితుడి సమక్షంలో మార్పు చేసుకున్నారు. ఆలయ అర్చకులు శంకర నారాయణ శర్మ నామకరణాలు మార్పు చేసుకున్న రష్యన్ ఆది దంపతులకు వేద ఆశీర్వాదం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నాయుడు మధుసూదన్ రావు, గోపిశెట్టి సత్యప్రసాద్, 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లేశ్వరి బలరాం తదితరులు పాల్గొన్నారు.

పద్మావతికి న్యాయస్థానంలో చుక్కెదురు

● ప్రసాదంపాడు సర్పంచ్ ఎన్నికకు క్లీన్‌చిట్

ప్రసాదంపాడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలు -2021లో ప్రసాదంపాడు పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తాను దాఖలు చేసిన నామినేషన్‌ను ఎన్నికల అధికారి ఉద్దేశపూర్వకంగా తిరస్కరించారని పేర్కొంటూ కోర్టుకెక్కిన మురుపాక పద్మావతికి న్యాయస్థానంలో చుక్కెదురైంది. పద్మావతి రామవరప్పాడు పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలిగా విధులు నిర్వహించేది. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉండడంతో ఆమె నామినేషన్‌ను అప్పటి రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. దీంతో ప్రసాదంపాడు పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా సర్నాల గంగారత్నం సర్పంచ్‌గా గెలుపొందారు. దీన్ని సవాల్ చేస్తూ అధికారులపై అప్పటి రాజకీయనేతలు తన నామినేషన్ తిరస్కరించేలా ప్రభావితం చేశారని పద్మావతి న్యాయస్థానంలో పిటీషన్ దాఖలు చేశారు. విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు విచారణ చేపట్టింది. జాయింట్ కలెక్టరతోపాటు పలువురిని విచారించిన న్యాయమూర్తి పిటీషన్‌ను కొట్టేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎంను తప్పుదారి పట్టిస్తున్న అధికారులు

● ఏపీ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు

గాంధీనగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రియల్ టైం గవర్నెన్స్ పేరుతో సీఎం చంద్రబాబును అధికారులు తప్పుదారి పట్టిస్తున్నారని ఏపీ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు ఆరోపించారు. 2014-19లో కూడా అధికారులు చంద్రబాబును తప్పుదారి పట్టించి అధికారం కోల్పోయేలా చేశారని గుర్తు చేశారు. వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ఆర్‌టీజీఎస్ నమ్ముకుంటే భవిష్యత్‌లో కూటమి ప్రభుత్వానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన హెచ్చరించారు. రెవెన్యూశాఖపై పలు పత్రికల్లో అభియోగాలు వస్తున్నాయని, వీటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

కేసు నుంచి తప్పించడం సరికాదు : ముత్తయ్య

గాంధీనగర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఓటుకు నోటు కేసులో ఏ-4 గా తన ప్రమేయం లేకుండా వేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సరైందికాదని జెరూషలేము ముత్తయ్య ఆరోపించారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటుకు నోటు కేసులో ఏపీ సీఎం చంద్రబాబు దోషిగా తెలితే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూలిపోతుందని, అందువల్లనే సుప్రీంకోర్టులో తన వాదనను వినిపించకుండానే, ఆ కేసు నుంచి తనను తప్పించారని ఆరోపించారు. చంద్రబాబును నిర్దోషిగా ప్రకటించేందుకు కుట్రలు చేస్తున్నారని దీన్ని ప్రజలు గ్రహించాలన్నారు. డబ్బులతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కొనుగోలు చేసి ప్రభుత్వాలను కూల్చడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టని అన్నారు.

నిందితులెవరనేది న్యాయస్థానమే తేలుస్తుంది

● సెన్సేషన్ కోసం అసత్యాలు ప్రచారం చేస్తే ఉపేక్షించం

● హైకోర్టు సీనియర్ న్యాయవాది జొన్నలగడ్డ దివాకర్

విజయవాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, నిందితులు ఎవరనేది న్యాయస్థానమే తేలుస్తుందని హైకోర్టు సీనియర్ న్యాయవాది జొన్నలగడ్డ దివాకర్ తెలిపారు. నగరంలోని శుక్రవారం తన ఆఫీసులో మీడియాతో మాట్లాడుతూ, జెరూసలేం ముత్తయ్యను కొంతమంది నాయకులు వెనకుండి ప్రభుత్వంపై బురదజల్లేలా మాట్లాడిస్తున్నారన్నారు. ముత్తయ్యకు, ఓటుకు నోటు కేసుకు సంబంధం లేదని, గతంలో హైకోర్టు క్వాష్ ఇచ్చిందని దివాకర్ చెప్పారు. ఈ కేసులో ఏ-4 గా ఉన్న ముత్తయ్య పేరును కోర్టు తొలగించిందన్నారు. నాడు తెలంగాణ ప్రభుత్వం అప్పీల్‌పై సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును సమర్థించిందని, ఈ కేసుకు ఆయనకు సంబంధం లేదని కోర్టులు చెప్పిన విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. గతంలో వైసీపీ నాయకుడు ఆళ్ల రామకృష్ణారెడ్డికి ఓటుకు నోటు కేసు విషయంలో సుప్రీం కోర్టు చీవాట్లు పెట్టిందని, సెన్సేషన్ కోసం అసత్యాలు ప్రచారం చేస్తున్న వారిని ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు. దమ్ముంటే వారు కోర్టు ద్వారానే తేల్చుకోవాలని, వాళ్ల వేసే వేషాలకు కోర్టు ద్వారానే సమాధానం చెప్తామని తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న కేసులో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌పై లేని ఆరోపణలు చేస్తున్న వారిపై పరువునష్టం, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూర్తిస్థాయిలో బీఎస్ఎన్ఎల్ టవర్లు

● నేడు ప్రధాని మోదీ జాతికి అంకితం ● రాష్ట్రంలో 5985 టవర్లు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల్లోకి పూర్తిస్థాయిలో అడుగుపెట్టబోతోంది. దేశవ్యాప్తంగా నిర్మించిన 4జీ టవర్లను ప్రధాని మోదీ శనివారం జాతికి వర్చువల్‌గా అంకితం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని బీఎస్ఎన్ఎల్ రాష్ట్ర సర్కిల్ విజయవాడలో ఏర్పాటు చేసింది. ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరుకాబోతున్నారు. బీఎస్ఎన్ఎల్ రాష్ట్రంలో 5985 టవర్లను నిర్మించింది. గిరిజన ప్రాంతాల్లో సిగ్నల్స్‌ను మరింత సామర్థ్యంతో అందజేయడానికి వీలుగా 1232 టవర్లను నిర్మించారు. ఈ టవర్ల డీబీఎన్ (డిజిటల్ భారత్ నిధి)తో నిర్మించింది. దీనివల్ల 2641 మారుమూల గిరిజన గ్రామాలకు నెట్‌వర్క్ సేవలు అందుతాయని బీఎస్ఎన్ఎల్ డీజీఎం శేషాచలం తెలిపారు. 4జీ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, విద్యార్థులు, వ్యాపారులకు ఎంతో వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు.







అన్‌లిమిటెడ్ జోష్!

విజయవాడ ఉత్సవ్ ఐదో రోజు

విజయవాడ కల్చరల్/విజయవాడ సిటీ / ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్‌లిమిటెడ్ జోష్! హద్దే లేని ఆనందం.. అపరిమిత సాంస్కృతికానందం! విజయవాడ ఉత్సవ్ మరింతగా తనదైన ముద్ర వేస్తోంది. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా పున్నమి, తుమ్మలపల్లికళా క్షేత్రం, ఘంటసాల సంగీత కళాశాలలో విభిన్న నృత్య, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. అంతులేని ప్రజాదరణను చూరగొంటున్నాయి. ఐదో రోజున త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పున్నమి ఘాట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పున్నమిఘాట్‌లో ఆయనకు సాదర స్వాగతం లభించింది.

పున్నమి ఘాట్ వేదికపై కళల జాతర

విజయవాడ ఉత్సవ్ ఐదో రోజు సాంస్కృతిక వేడుకలు భవానీపురం పున్నమి ఘాట్ వేదికపై అద్భుతంగా సాగాయి. ఆధ్యాత్మికత, సంప్రదాయం, ఆధునికత, భక్తి, వినోదం వంటి ప్రదర్శనలు సాగి పున్నమి ఘాట్‌ను కళల జాతరగా మార్చాయి. నటరాజ కృష్ణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నాట్యాచారిణి కృష్ణవేణి బృందం ప్రదర్శించిన 'కృష్ణవేణి తరంగం' విజయవాడ వైభవాన్ని చాటింది. ఆధ్యాత్మిక గీతాలతో అభిలాషా పాండా మంత్రముగ్ధం చేసింది. భక్తితత్వాన్ని ప్రతిబింబించే భక్తి గీతాల ద్వారా అభిలాషా పాండా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది.. ఆధ్యాత్మికత, సంప్రదాయం, ఆధునికత కలగలిసిన ప్రదర్శనలు విజయవాడ ఉత్సవ్ ప్రత్యేకతను ప్రతిబింబించాయి.



తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..

గుంటూరుకు చెందిన ప్రభుత్వ సంగీత పాఠశాల అధ్యాపకుడు బి.సురేష్ బాబు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు కట్టిపడేశాయి. జయము జయము లలితా కళావాహిని, నారాయణనాయ, శివపథం వంటి కూచిపూడి నృత్యాలతో వనారంభం, నర్సపల్లే, దసరా పల్లె గీతాలతో చిన్నారులు చేసిన జానపద నృత్యాలు జనాలను ఆకట్టుకున్నాయి. గుంటూరుకు చెందిన లక్ష్మీ శ్రీనివాస బృందం గాత్ర కచేరి రసరమ్యంగా సాగింది. నగరానికి చెందిన గంగాధర బ్రదర్స్ బృందం ఆలపించిన జానపత గేయాలు ఉర్రూతలూగించాయి. నాది నకిలీసు గొలుసు, కోడెపాయె లచ్చన్నది, ఎల్లమాకే ఓ పిల్లా వంటి పాటలతో మైమరపించాయి. నరసరావుపేటకు చెందిన వనపర్తి దుర్గారావు బృందం ప్రదర్శించిన తోలుబొమ్మలాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రేక్షకులు ఆసక్తిగా వీక్షించారు. చివరగా శకుని పౌరాణిక నాటకం రక్తి కట్టించింది.



ఘంటసాల సంగీత కళాశాలలో..

రఘుకుల తిలకా రారా.. నినెత్తి ముద్దులాడెదరా.. అంటూ నాట్యాచార్య సప్పా శివకుమార్ ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాల విద్యార్థుల బృంద గాత్రకచేరి శ్రోతలను ఆనంద డోలికల్లో ముంచెత్తింది. తెనాలికి చెందిన రాంప్రసాద్ బృందం కాళికా వేషాలతో ప్రత్యేక విన్యాసాలు, అమ్మవారి వివిద రూపాలు, అవతారాలతో చేసిన జానపదాలు జనరంజకం చేశాయి. అమలాపురానికి చెందిన అయ్యప్ప గరగలు నృత్యం ఆలయ సంప్రదాయాన్ని ఒడిసిపట్టాయి. తలపై పూర్ణకుంభంతో బ్యాలెన్స్ చేస్తూ కనురెప్పలు, కర, పాద విన్యాసాలతో చేసిన నృత్యాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. చివర్లో ప్రదర్శించిన తరమెళ్లిపోతుందో నాటిక సందేశాత్మకంగా సాగింది. ఈ నాటికకు కరణం రమేష్ రచనా దర్శకత్వం వహించారు.

ఎంపీ చిన్ని ఎగ్జిబిషన్ ఏర్పాట్ల పరిశీలన

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా ఎగ్జిబిషన్‌ను శనివారం యువరత్న నందమూరి బాలకృష్ణ ప్రారంభిస్తున్నారు. ఏర్పాట్లను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పరిశీలించి ఎలాంటి లోపాలు లేకుండా అన్ని విభాగాలను సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. స్టాళ్లు, విద్యుత్, భద్రత, పార్కింగ్, ప్ర జా సౌకర్యాలపై నిర్వహకుల నుంచి ప్రత్యక్షంగా వివరాలు తెలుసుకున్న ఆయన సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పాట్లు చేయాలని సూచించారు.



తిలకిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి దంపతులు, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు కామినేని, సుజనాచౌదరి, ఎంపీ కేశినేని చిన్ని

పవిత్ర సంగమంలో

కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పవిత్ర సంగమం వేదికగా నిర్వహిస్తున్న విజయనర్తనం కార్యక్రమంలో శుక్రవారం నాట్యాచారని పద్మశ్రీ హేమంత్ బృందం శివాష్టకం, దశావతారాలు, కరగం తమిళ సంప్రదాయ ఆలయ నృత్యాలు ప్రదర్శించారు. కూచిపూడి, జానపద నృత్యాలు ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన వి.మాధవి పవన్‌కుమార్ బృందం 20 మంది విద్యార్థులతో కూచిపూడి నాట్యం చేశారు. హైదరబాద్‌కు చెందిన దాసరి కృష్ణప్రియ నవీన్ బృందం అమ్మవారి జాతరను జానపద రూపంలో ప్రదర్శించారు. బాహుబలి సాంగ్స్, ఊరూ.. పల్లెటూరు.., భారతీ శాంభవీ వంటి జానపదాలు నర్తించి నయానందకరం చేశారు. చివరిగా డ్రీం ఆడియో బృందం ఆలపించిన సినీ గీతాలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన, చైర్మన్ చిట్టిబాబు కళాకారులను అభినందించి, జ్ఞాపికలను అందించి సత్కరించారు.

కనకదుర్గానగర్ అమ్మవారి సన్నిధిలో

అమ్మవారి సన్నిధిలో కనకదుర్గ మండపంలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్విరామంగా కళాప్రదర్శనలు సాగాయి. భక్తి విభావరి సంగీత కచేరీలు, కూచిపూడి, భరత నాట్యాలు, జానపద, బుర్రకథలు ప్రదర్శించారు. 500 మంది కళాకారులు పాల్గొని అమ్మవారికి భక్తిపూర్వకంగా తమ కళతో అర్చన చేసి, నీరాజనాలు అర్పించారు. కళాకారులకు అమ్మవారి దర్శనంతో పాటు ప్రసాదాలు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమాన్ని పీఆర్వో గంగాధర్, సైదా పర్యవేక్షించారు.

విజయవాడ ఉత్సవ్‌లో నేటి కార్యక్రమాలు

గొల్లపూడిలో ఎగ్జిబిషన్ ప్రారంభం: శనివారం సాయంత్రం 5 గంటలకు ఎగ్జిబిషన్‌ను సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రారంభిస్తారు. 6 గంటలకు సింగర్ సునీల్ లైవ్ మ్యూజిక్

పున్నమిఘాట్‌లో : శాస్త్రీయ నృత్య ప్రదర్శన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు.

తుమ్మలపల్లి కళాక్షేత్రం లో : సాయంత్రం 6 గంటలకు డాక్టర్ లలిత సింధూరి(రాజమహేంద్రవరం) శిష్య బృందం కూచిపూడి నాట్య ప్రదర్శన, 6.30 గంటలకు సంగీత కచేరి, రాత్రి 7 గంటలకు ప్రముఖ నాట్యకళాకారిణి దేవీ భవానీ బృందం కూచిపూడి నాట్యప్రదర్శన, రాత్రి 7.30 గంటలకు అక్తర్ హుస్సేన్(విశాఖ) మ్యాజిక్ షో, రాత్రి 8 గంటలకు పి.నాగబాబు (కోనసీమ) వీరనాట్యం ప్రదర్శన, రాత్రి 8.30 గంటలకు అనపర్తి భీమన్న బృందం (కాకినాడ) తోలుబొమ్మలాట, రాత్రి 9 గంటలకు సాంఘిక నాటకం ప్రదర్శన

ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో : సాయం త్రం 6 గంటలకు వి.ఎస్.ఆర్.కె కళాక్షేత్ర బృందం (హైదరాబాద్) ఆంధ్రనాట్యం, సాయంత్రం 6.30 గంటలకు ఘంటసాల సంగీత, నృత్య ప్రభుత్వ కళాశాల విద్యార్థుల సంగీత కచేరి, రాత్రి 7 గంటలకు ఉషా మాధవి కూచిపూడి నృత్య ప్రదర్శన, రాత్రి 7.30 గంటలకు విభూది లవరాజు బృందం(రాజమండ్రి) బుర్రకథ కార్యక్రమం, రాత్రి 8 గంటలకు ఏ.సుబ్బారావు (కాకినాడ) తోలుబొమ్మలాట, రాత్రి 8.30 గంటలకు శ్రీ వెంకట లక్ష్మీ దుర్గా నాట్యమండలి కళాసేవా సమితి (తెనాలి) పౌరాణిక పద్య నాటకం.

అమరావతి రైతులకు ఈ-లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపు

కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక (జరీబు, మెట్ట), మల్కాపురం (ప్రత్యామ్నాయ ప్లాట్లు) గ్రామాల రైతులకు శుక్రవారం విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ విధానంలో 97 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 41 నివాస ప్లాట్లు కాగా, 36 వాణిజ్య ప్లాట్లు, 20 ప్రత్యామ్నాయ ప్లాట్లు. మొత్తంగా 56 మంది రైతులు, భూ యజమానులకు ఈ-లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ప్లాట్లను కేటాయించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందజేశారు. కాగా, సీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం రాజధాని ప్రాంత వాసులు, రైతు కూలీలు తమ అర్జీలను నోడల్ అధికారి పి.జయశ్రీకి అందజేశారు. ఫిర్యాదులలో పలు ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని సూచించారు.

ఐఎస్‌ఓపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎర్రంశెట్టి అచ్యుత్ రామయ్య

విజయవాడ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియా (ఐఎస్‌ఓపీ) కార్యవర్గం ఎన్నికయినట్టు రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా ఎర్రంశెట్టి అచ్యుత్ రామయ్య, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ డి.వి.మహేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ అల్లు పద్మజ, డాక్టర్ డొంకాడ రాజశేఖర్, డాక్టర్ కె.అపరంజి, డాక్టర్ రాకేష్, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ వినీలనాథ్, డాక్టర్ ఉదయ్ శంకర్ ఎన్నికైనట్లు చెప్పారు.

డ్వాక్రా ఉత్పత్తులకు విజయ మార్కెటింగ్

● కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు



విజయ బ్రాండ్ నూతన ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న చలసాని, దాసరి, అధికారులు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత డ్వాక్రా మహిళలు తయారు చేసే ఆహర ఉత్పత్తులను విజయ బ్రాండ్ ద్వారా మార్కెటింగ్ చేయనున్నట్లు విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. విజయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించటంతో పాటు, దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలబెట్టేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

జంక్షన్‌లో కాకాని కల్యాణ మండపంలో యూనియన్ 35వ సర్వసభ్య సమావేశం చైర్మన్ చలసాని ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. సమావేశం అనంతరం చలసాని విలేకరులతో మాట్లాడారు. డ్వాక్రా ఉత్పత్తులను మా ర్కెటింగ్ చేసి ఆ వర్గాలు ఆర్థిక సాధికారతను సాధించే దిశగా కృషి చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. లక్షా యాభై వేల కుటుంబాలకు భరోసాగా నిలిచిన విజ య డెయిరీపై అవినీతి ఆరోపణలు చేస్తూ, యూనియన్ ప్రతిష్టను దిగజార్చడానికి కొంత మంది చేసిన ప్రయత్నాలను కూడా సమావేశం తీవ్రంగా ఖండించినట్లు తెలిపారు. పాడి రైతులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, గిట్టుబాటు ధర నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ, దేశంలోనే ఏకైక అగ్రగామి సంస్థగా విజయ డెయిరీ ఖ్యాతిగడించిందన్నారు. భవిష్యత్తులో. వినియోగదారుల మీద భారం పడకుండా పాల సేకరణ ధర రూ.100లకు పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. విజయ బ్రాండ్ ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్ తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. విజయ బ్రాండ్ నూతన ఉ త్పత్తులు కాజుకట్లీ స్వీట్, క్రీం బన్, బన్ మస్కాలను చలసాని మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సమావేశంలో ఎండీ కొల్లి ఈశ్వర బాబు, ప్రొక్యూర్‌మెంట్ జీఎం పారిఅగువేలు, ఆపరేషన్ జీఎం ఎం.లక్ష్మారావు, సేల్స్ జీఎం సీహెచ్. రమేష్, డైరక్టర్లు, పాల ఉత్పత్తి సంఘాల అధ్యక్షులు, క్లస్టర్స్ మేనేజర్లు పాల్గొన్నారు. అధిక పాల సేకరణ చేసిన సంఘాల అధ్యక్షులకు ప్రశంసా పత్రాలు చలసాని అందజేశారు.

అసెంబ్లీ వాయిస్

ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించే పారిశ్రామిక పాలసీ

● రాష్ట్రానికి దిగ్గజ ఐటీ సంస్థలు

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన పారిశ్రామిక పాలసీని భవిష్యత్తుకు బ్లూ ప్రింట్ గా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రా వు అభివర్ణించారు. నియోజకవర్గానికి రెండు ఎంఎస్‌ఎంఈలు కేటాయించినందుకు అసెంబ్లీ వేదికగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. శాసనసభ సమావేశంలో శుక్రవారం యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ ప్రస్తుతం ఏపీలో పరిశ్రమల అభివృద్ధికి అమలు చేస్తున్న వ్యూహం 4.0, పారిశ్రామిక ప్రోత్సాహకాలు బ్రాండ్ ఆంధ్రాను పునరుద్ధరించే విధంగా ఉన్నాయన్నారు.

బ్రాండ్ సీబీఎన్, లోకేష్ బాబు కృషితో దిగ్గజ ఐటీ సంస్థలు టీసీఎస్, గూగుల్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలు రాష్ట్రానికి తరలి వస్తున్నాయని తెలిపారు. సీఎం చంద్రబాబు సహకారంతో పాత ధరలకే పరిశ్రమలకు భూములను కేటాయించామని గుర్తు చేశారు. మల్లవల్లి సెజ్‌ను అభివృద్ధి చేసేందుకు అన్ని రకాలుగా చర్యలు చేపట్టామన్నారు. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో 31% ఎయిర్ ట్రాఫిక్ పెరిగిందని, దానికి అనుగుణంగా విమానాశ్రయ విస్తరణ పనులను వేగంగా చేపడుతున్నామని తెలిపారు. నియోజకవర్గంలో 15 వేల మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో 2024కు ముందు 2800గా ఉన్న ఉద్యోగుల సంఖ్య ప్రస్తుతం 6000కు చేరిందని తెలిపారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో పరిపాలన భవనం, 132 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్, నీటి సౌకర్యం త్వరితగతిన కల్పిం చాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీరపనేనిగూడెంలో ఎంఎస్ఎంఈ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2029 నాటికి రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభు త్వం కృషి చేస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమర్ రాజా బ్యాటరీస్, లులు గ్రూప్, పేజ్ ఇండస్ట్రీస్ లాంటి ప్రము ఖ సంస్థలు రాష్ట్రం వదిలి వెళ్లిపోయాయన్నారు. అశోక్ లేలాండ్ సంస్థను సైతం వెనక్కి పంపి నిరుద్యోగ శాతాన్ని పెంచారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు తక్షణ అనుమతులు, డీమ్డ్ అప్రూవల్స్ వంటి సంస్కరణలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

యాజమాన్యాలను బ్లాక్ మెయిల్ చేసేందుకే జగన్ సర్కార్ జీవోలు

● ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): : పరిశ్రమల యాజమాన్యాలను చెప్పు చేతల్లో పెట్టుకుని బ్లాక్ మెయిల్ చేసేందుకు గత వైసీపీ ప్రభుత్వం కొన్ని జీవోలను చేసిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ఏ పీ ఎంఎస్‌ఎంఈ పాలసీపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ వన్ ఎంటర్‌ప్రెన్యూర్.. వన్ పాలసీ 69 జీవోలో కొన్ని లోపాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే టెండర్లలో లోకల్ ప్రొక్యూర్‌మెంట్ కింద 25 శాతం పర్చేజ్ ప్రిఫరేషన్ ఇవ్వడం వల్ల ఉపయో గం లేదన్నారు. పెద్ద సంస్థలు టెండర్‌లో పాల్గొన్నప్పుడు ఎంఎస్‌ఎంఈలు పోటీ పడగలిగే పరిస్థితి ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మే రకు 25 శాతం ప్రొక్యూర్‌మెంట్ స్థానిక ఎంఎస్ఎంఈలకు ఇవ్వాలన్నారు. స్థానికులకు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, 25 శాతం బయట రాష్ట్రాల వారిని తీసుకోవాలని గత వైసీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో ఇచ్చిందన్నారు. స్థానికంగా కార్మికుల లభ్యత ఉంటే బయట నుంచి ఉద్యోగులను తెచ్చుకోవాలని ఏ యాజమాన్యం కోరుకోదన్నారు. కేవలం పరిశ్రమల యాజమాన్యాలను చెప్పు చేతల్లో పెట్టుకొని బ్లాక్ మెయిల్ చేసేందుకు అప్పట్లో జగన్ ప్రభుత్వ ఉద్దేశపూర్వకంగానే ఈ జీవో ఇచ్చిందన్నారు. ఈనిబంధన కింద గత ప్రభుత్వ హయాంలో ఎక్కడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. ఈనిబంధనను తొలగించాలన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందన్నారు. అదే దీక్షతో ముందుకు పోతుందన్నారు. ఈ లక్ష్యాలను సాధించాలంటే స్థానికంగా ఉన్న ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించి కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 25 శాతం ప్రాధాన్యత ఇచ్చి రేటులో కూడా ఎల్ 1 కంటే 15 శాతం తగ్గించి ఇవ్వాలన్నారు. త ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చాలని కోరారు.

మసీదు, ఈద్గా స్థలాలకు త్వరగా అనుమతులివ్వాలి

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



ఆటోనగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని టవర్ లైను విస్తరణలో తొలగించాల్సిన మసీదుకు ప్రత్యామ్నాయ స్థలం, ముస్లింలు పర్వదినాల్లో ప్రార్థనలు చేసుకునేందుకు ఈద్గా స్థలానికి ప్రభుత్వం అనుమతులు ఇప్పించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అసెంబ్లీలో కోరారు. అసెంబ్లీలో శుక్రవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో ఎమ్మెల్యే గద్దె పాల్గొని సంబంధిత మంత్రులకు విజ్ఞప్తి చేశారు. నగరపాలక సంస్థ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నాల్గో డివిజన్ ఆటోనగర్ పక్కనే ఉన్న హైటెన్షన్ టవర్ లైన్ రోడ్డు వంద అడుగుల విస్తరణ కోసం స్థానికంగా ఉన్న మస్జిద్-ఎ-కౌసర్‌ను మార్చాల్సి వచ్చిందని ఆయన ఆయన తెలిపారు. దీనికి సంబంధించి నగర కార్పొరేషన్ స్థలాన్ని కేటాయిస్తూ తీర్మానం ఆమోదించి ప్రభుత్వానికి నివేదిక పంపారని పేర్కొన్నారు. ముస్లిం లకు ఈద్గాలను కేటాయించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని గద్దె గుర్తుచేశారు. పెనమలూరు, తూర్పు నియోజకవర్గాల పరిధిలోని ముస్లింలకు అనుకూలంగా ఉండే స్థలాన్ని అన్వేషించి ప్రభుత్వాన్ని అనుమతి కోరినట్లు, అందుకు అధికారులు సుముఖత వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. సదరు స్థలాన్ని ఈద్గాకు కేటాయించడానికి, స్థలం పరిరక్షణకు ప్రహరీ నిర్మాణానికి కూడా తగిన అనుమతులు, నిధులు కేటాయించాలని మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్‌ను గద్దె కోరారు. ముస్లింల ధార్మిక అవసరాల కోసం గళమెత్తి తమకు మద్దతు ఇచ్చినందుకు మస్జిద్-ఎ-కౌసర్ అండ్ ఇస్లామిక్ సెంటర్ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గద్దెకు ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం 27 ● సెప్టెంబరు 2025



విజయదశమికి వెరైటీగా..

దసరా పండుగ వస్తుందనగానే రకరకాల పిండి వంటలు చేసుకుంటూ ఉంటాం. ఒక్కో ప్రాంతంలో ఒక్కో వంటకం ప్రాశస్త్యంలో ఉంటుంది. మనం కూడా వాటిని ప్రయత్నించవచ్చు. ఎప్పటిలా కాకుండా ఈ పండుగ రోజున విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...

పాల పాయసం (కేరళ)

కావాల్సిన పదార్థాలు

బాస్మతి బియ్యం- అర కప్పు, చిక్కటి పాలు- ఒక లీటరు, పంచదార- ఒక కప్పు, యాలకులు- నాలుగు, కుంకుమ పువ్వు రేకులు- అయిదు, నెయ్యి- రెండు చెంచాలు, జీడిపప్పు- కొద్దిగా, బాదం పలుకులు- కొన్ని, కిస్‌మిస్‌లు- కొన్ని, ఉప్పు- చిటికెడు

తయారీ విధానం:



బాస్మతి బియ్యంలో నీళ్లు పోసి రెండుసార్లు కడగాలి. స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో మూడు కప్పుల నీళ్లు, కడిగిన బాస్మతి బియ్యం వేసి కలపాలి. మూతపెట్టి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించి దించాలి. కుక్కర్ చల్లారాక మూత తీసి బాస్మతి అన్నాన్ని గరిటెతో మెత్తగా మెదపాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి బాగా మరిగించాలి. తరువాత అందులో బాస్మతి అన్నం మిశ్రమాన్ని వేసి బాగా కలుపుతూ పావుగంటసేపు ఉడికించాలి. ఆపైన పంచదార, యాలకుల పొడి, కుంకుమ పువ్వు రేకులు వేసి కలపాలి. పంచదార కరిగిన తరువాత పాయసం గిన్నెను స్టవ్ మీద నుంచి దించాలి. స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి నెయ్యి వేసి కరిగించాలి. అందులో జీడిపప్పు, బాదం పలుకులు, కిస్‌మిస్‌లు వేసి దోరగా వేయించి పాయసంలో కలపాలి. చివరగా చిటికెడు ఉప్పువేసి కలిపితే రుచికరమైన పాల పాయసం రెడీ!

దెహరోరి (ఛత్తీస్‌గఢ్)



కావాల్సిన పదార్థాలు

బియ్యప్పిండి- ఒక కప్పు, పెరుగు- ఒక కప్పు, బేకింగ్ సోడా- అర చెంచా, బొంబాయి రవ్వ- రెండు చెంచాలు, పంచదార- ఒక కప్పు, యాలకుల పొడి- అర చెంచా, నూనె- తగినంత, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పలుకులు- కొన్ని

తయారీ విధానం

- వెడల్పాటి గిన్నెలో బియ్యప్పిండి, బేకింగ్ సోడా, బొంబాయిరవ్వ, యాలకుల పొడి, పెరుగు వేసి అరగ్లాసు నీళ్లు పోసి బాగా కలపాలి. ఆపైన గిన్నెమీద మూత పెట్టి నాలుగు గంటలు నానని వ్వాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో చక్కెర వేసి కొన్ని నీళ్లు చిలకరించి వేడిచేయాలి. గులాబ్‌జామ్ పాకంలా రానివ్వాలి.
- స్టవ్ మీద మూకుడు పెట్టి సగానికిపైగా నూనె పోసి వేడిచేయాలి. బియ్యప్పిండి మిశ్రమాన్ని చెంచాతో తీసుకుంటూ నూనెలో బోండాల మాదిరి వేయాలి. ఇవి దోరగా వేగిన తరువాత వాటిని తీసి పంచదార పాకంలో వేయాలి. పావుగంట తరువాత బోండాలన్నీ పూర్తిగా పాకం పీల్చుకుని దెహరోరీలు తయారవుతాయి. వీటి మీద జీడిపప్పు, బాదం పలుకులు చల్లి సర్వ్ చేయడమే.

వెజిటబుల్ కిచిడీ (వెస్ట్ బెంగాల్)

కావాల్సిన పదార్థాలు

బియ్యం- ఒక కప్పు, పెసర పప్పు- పావు కప్పు, నూనె- రెండు చెంచాలు, జీలకర్ర- ఒక చెంచా, దాల్చిన చెక్క- రెండు చిన్న ముక్కలు, మిరియాలు- అయిదు, లవంగాలు- నాలుగు, యాలకులు- రెండు, బిర్యానీ ఆకులు- రెండు, అనాస పువ్వు- ఒకటి, పచ్చి మిర్చి- మూడు, కరివేపాకు- కొద్దిగా, జీడిపప్పు- తగినంత, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, కేరట్ ముక్కలు- అర కప్పు, బీన్స్ ముక్కలు- పావు కప్పు, ఆలుగడ్డ ముక్కలు- అర కప్పు, క్యాబేజీ తరుగు- పావు కప్పు, టమాటా ముక్కలు- పావు కప్పు, పచ్చి బఠాణీలు- పావు కప్పు, పాలకూర తరుగు- అర కప్పు, ధనియాల పొడి- ఒక చెంచా, ఉప్పు- తగినంత, పసుపు- చిటికెడు, నెయ్యి- రెండు చెంచాలు

తయారీ విధానం

ఒక గిన్నెలో బియ్యం, పెసరపప్పు వేసి నీళ్లు పోసి రెండుసార్లు కడగాలి. తరువాత నిండా నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో నూనె వేసి వేడిచేయాలి. తరువాత జీలకర్ర, దాల్చిన చెక్క, మిరియాలు, లవంగాలు, యాలకులు, అనాస పువ్వు, బిర్యానీ ఆకులు, పచ్చి మిర్చి ముక్కలు, కరివేపాకు, జీడిపప్పు, అల్లం వెల్లుల్లి పేస్టు, వేసి బాగా కలుపుతూ వేయించాలి. ఆపైన కేరట్ ముక్కలు, బీన్స్ ముక్కలు, ఆలుగడ్డ ముక్కలు, క్యాబేజీ తరుగు, టమాటా ముక్కలు, పచ్చి బఠాణీలు, పాలకూర తరుగు, ధనియాల పొడి, ఉప్పు, పసుపు వేసి బాగా కలపాలి. కుక్కర్ మీద మూతపెట్టి పది నిమిషాలు మగ్గించాలి. తరువాత మూత తీసి నానబెట్టుకున్న బియ్యం-పెసరపప్పు మిశ్రమం, నెయ్యి వేసి కలపాలి. ఆపైన రెండున్నర గ్లాసుల నీళ్లు పోసి కలిపి మూత, విజిల్ పెట్టాలి. రెండు విజిల్స్ వచ్చే వరకు మధ్యస్థాయి మంటమీద ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. అంతే వెజిటబుల్ కిచిడీ రెడీ!



కడకణి (మహారాష్ట్ర)

కావాల్సిన పదార్థాలు

గోధుమ పిండి- రెండు కప్పులు, శనగపిండి- ఒక కప్పు, బెల్లం తురుం- ఒక కప్పు, వేడినీళ్లు- అర కప్పు, నూనె- తగినంత, ఉప్పు- చిటికెడు, శొంఠి పొడి- ఒక చెంచా, నెయ్యి- మూడు చెంచాలు, యాలకుల పొడి- అర చెంచా



తయారీ విధానం

- వేడి నీళ్లలో బెల్లం తురుం వేసి కరిగించి వడబోయాలి. వెడల్పాటి గిన్నెలో గోధుమ పిండి, శనగ పిండి, ఉప్పు, శొంఠి పొడి, యాలకుల పొడి, నెయ్యి వేసి బాగా కలపాలి. తరువాత కొద్దికొద్దిగా బెల్లం నీళ్లు పోసుకుంటూ ముద్దలా కలపాలి. మూత పెట్టి పావుగంటసేపు నానని వ్వాలి. తరవాత ఈ పిండిని కొద్దికొద్దిగా తీసుకుంటూ పలుచని చపాతీల మాదిరి వొత్తాలి. చపాతీల మధ్యలో ఫోర్క్‌తో సన్నని గీతలు గీయాలి. లేదా చపాతీ అంతటా సన్నని రంధ్రాలు కూడా చేయవచ్చు.
- స్టవ్ మీద మూకుడు పెట్టి నూనె పోయాలి. నూనె వేడెక్కిన తరువాత ఒక్కో చపాతీ వేసి ఎర్రగా వేయించి పళ్లెంలోకి తీయాలి. కరకరలాగే ఈ కడకణీలు పదిరోజుల వరకూ నిల్వ ఉంటాయి.

దుర్గా నవరాత్రులు



నేటి అలంకారం

శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి

ఆశ్వయుజ శుద్ధ పంచమి, శనివారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఈ రోజు శ్రీ లలితా త్రిపురసుందరీదేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. త్రిపురాత్రయంలో లలితాదేవి రెండో శక్తి. దేవీ ఉపాసకులకు ఈ తల్లి ముఖ్యదేవత. త్రిగుణాతీతమైన కామేశ్వర స్వరూపం ఆమెది. లక్ష్మీ సరస్వతులు ఇరువైపులా ఉండి వింజామరలు వీస్తుండగా శ్రీచక్ర అధిష్ఠాన శక్తిగా ఆమె కొలువై ఉంటుంది. చెరుకుగడ, విల్లు, పాశాంకుశాలను ధరించి, శివుడి వక్షస్థలంపై కూర్చుని భక్తులకు వరాలిస్తుందనీ, పంచ, దశాక్షరీ మహా మంత్రాధి దేవతగా తనను కొలిచే భక్తుల్నీ, ఉపాసకుల్నీ అనుగ్రహిస్తుందనీ భక్తులు నమ్ముతారు. లలితాదేవి విద్యా స్వరూపిణి. సమస్త సుఖాలు ప్రసాదించే శక్తి స్వరూపిణి అనీ, మాంగల్య సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుందనీ భక్తుల విశ్వాసం. లలితాదేవి అనుగ్రహం కోసం సువాసినీ పూజ చెయ్యాలనీ, వివిధ పూలతో, కుంకుమతో అర్చించాలనీ పురాణాలు పేర్కొంటున్నాయి. త్రిమూర్తులు, సకల దేవతలు ఆమెను కొలుస్తారనీ, ఆమెను ఆరాధించిన వారికి ఎల్లప్పుడూ సుఖ సౌఖ్యాలు కలుగుతాయనీ చెబుతున్నాయి.

నైవేద్యం : అల్లం గారెలు, ఐదురకాల తీపి పదార్థాలు


అలంకరించే చీర రంగు : బంగారు వర్ణం

అర్చించే పూల రంగు: వివిధ రకాలు

పారాయణ చెయ్యాల్సినవి: లలితా సహస్రనామం.

బఠానీ నిండా బలమే!

'బఠానీ' అన్న పేరు వింటే ఏదో విదేశీ పదం అనిపిస్తుంది. కానీ, ఇది మనదే! బఠానీ అంటే పెద్దది.. గొప్పది అని అర్థం. ఉలవల కన్నా గింజలు పెద్దవి ఉంటాయి కాబట్టి వీటికి బఠానీ అని పేరు వచ్చి ఉండచ్చు. ఇక సంస్కృతంలో వీటిని రేణుకలు, మండచణక, కలాయ అని వేర్వేరు పేర్లతో పిలుస్తారు. మన దేశంలో దక్షిణాది రాష్ట్రాల్లో బఠానీ పంట ఎక్కువగానే పండుతుంది. లేత పచ్చి బఠానీ కాయల్లో ప్రొటీన్, పీచు ఎక్కువగా ఉంటాయి. తినటానికి చాలా రుచికరంగా కూడా ఉంటాయి. ఎక్కువ ప్రాంతాల్లో వీటిని ఉడకబెట్టుకొని లేదా కాల్చుకొని తింటారు. పచ్చి బఠానీ కాయల్లో గింజలు సున్నగా నిగనిగలాడుతూ ఉంటాయి. కేవలం బటానీలకు మాత్రమే కాదు.. బఠానీ చెట్టు లేత ఆకులకు కూడా అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. అవేమిటో తెలుసుకుందాం.



- లేత బఠానీ ఆకులు తేలికగా జీర్ణమవుతాయి. వీటికి అన్ని రకాల దోషాలను హరించే శక్తి ఉంది.
- మధుమేహం, స్థూలకాయ సమస్యలు ఉన్నవారికి బఠానీ గింజల కన్నా ఆకులే ఎక్కువ మేలు చేస్తాయి. ఎందుకంటే బటానీలు వాతాన్ని పెంచుతాయి. ఆకులు వాతాన్ని తగ్గిస్తాయి.
- బఠానీ ఆకులు దప్పికను తగ్గిస్తాయి. వేడిని పెంచుతాయి. జీర్ణ ప్రక్రియ సజావుగా అయ్యేలా చేస్తాయి.

ఆఫ్రికాలోని దేశాల్లో బటానీలు, క్యారెట్‌లను ఎక్కువగా తింటారు. ఇక మన దగ్గర కొన్ని ప్రాంతాల్లో- లేత బటానీ ఆకులు, తీగలు, కాయలను చిన్న చిన్న ముక్కలుగా తరిగి ఉడికిస్తారు. ఈ మిశ్రమంలో ఇతర కాయగూరలతో కలిపి మరికొంత సేపు మగ్గనిస్తారు. దానిలో ఉప్పు, సుగంధ ద్రవ్యాలు, పెరుగు వేసి కలుపుతారు. ఇది చాలా రుచికరంగా ఉంటుంది.

- బఠానీ ఆకులు క్రమం తప్పకుండా తింటే నోటిలోని అల్సర్స్ తగ్గుతాయి. రుచి పెరుగుతుంది.
- బఠానీలలో ప్రొటీన్, ఫైబర్, విటమిన్లు ..ఫాస్ఫరస్, మాగ్నీషియం, కాపర్, ఐరన్, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి.

● గంగరాజు అరుణాదేవి

ఈ రైతు బిడ్డ... డీఎస్పీ



చిన్నప్పటి నుంచీ ఒకటే ఆశయం... ఉన్నత హోదా అలంకరించాలని. ఆ దృఢ సంకల్పమే ఆమెను లక్ష్యం వైపు నడిపించింది. కుటుంబ కష్టాలు... ప్రతికూల పరిస్థితులు... ఇవేవీ ఆమె అవరోధంగా భావించలేదు. చదివింది ప్రభుత్వ పాఠశాలలో అయినా... అకుంఠిత దీక్షతో అనుకున్నది సాధించారు. మండ్ల కవిత... ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో 480వ ర్యాంకు సాధించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఎంపికయ్యారు. ఒక పేద రైతు బిడ్డ సాధించిన ఈ అపురూప విజయం 'నవ్య' పాఠకుల కోసం...

మండ్ల కవిత స్వస్థలం... వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని శానాయపల్లి. ఆమె తండ్రి మండ్ల నాగయ్య. తల్లి పార్వతమ్మ. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. కవిత రెండో కూతురు. పెద్ద కూతురు విజయలక్ష్మికి పెళ్లయింది. కుమారుడు సాయితేజ సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నాడు. వ్యవసాయమే ఆధారమైనా... పిల్లలను ఉన్నత చదువులు చదివించాలనుకున్నారు నాగయ్య. పంటపై వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో... వ్యవసాయ పనులతో పాటు జేసీబీ ఆపరేటర్‌గా కూడా పని చేశారు. ప్రస్తుతం గ్రామంలోనే పాల వ్యాపారం చేస్తున్నారు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో కవిత విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలోనే సాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. పదో తరగతిలో 9.7 జీపీఏతో ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. 2020లో బాసర ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 9.32 సీజీపీఏ సాధించారు.

వారి కష్టానికి ఫలితం: కవిత

"మమ్మల్ని చదివించడానికి మా నాన్న అహర్నిశలూ కష్టపడ్డారు. వ్యవసాయంతోపాటు ఇతర పనులు కూడా చేశారు. ఆ కష్టం వృథా కాకూడదని, నాపై అమ్మానాన్న పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని అనుకున్నాను. బాగా చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ముందుకు వెళ్లాను. ట్రాన్స్‌కోలో ఏఈగా ఉద్యోగం వచ్చినా... కచ్చితంగా సివిల్స్‌లో ఉద్యోగం సంపాదించాలనే ఉద్దేశంతోనే కోచింగ్‌కు వెళ్లాను. నాకు వచ్చిన మార్కులతో ఏ ఉద్యోగం వచ్చినా చేయడానికి సిద్ధపడ్డాను. ఇప్పుడు డీఎస్పీగా ఎంపికయ్యాను. ఎంతో ఆనందంగా ఉంది. నా కోసం అమ్మానాన్నలు పడ్డ కష్టానికి ఫలితం ఈ విజయం."



చిన్ననాటి కల...

2014లో పాఠశాల వార్షికోత్సవంలో కవిత ఉపన్యాసానికి... ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి ముగ్ధులయ్యారు. 'పెద్దయ్యాక ఏమవుతావు' అని ఆయన అడిగితే... 'కలెక్టర్ అవుతా' అంటూ ఆమె సమాధానం చెప్పారు. అదే లక్ష్యంతో పట్టుదలగా చదివారు. సివిల్స్‌కు సన్నద్ధం అవుతున్న క్రమంలో టీజీ ట్రాన్స్‌కోలో ఏఈగా ఎంపికయ్యారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని శ్రీరంగాపురం ఏఈగా పని చేశారు. అంతటితో ఆమె సంతృప్తి చెందలేదు. మళ్లీ గ్రూప్ వన్ కోసం ఎనిమిది నెలలు సెలవుపెట్టి తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందారు. చివరకు ఆమె కష్టం ఫలించింది. ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో 480వ ర్యాంకు (బీసీ-ఏ విభాగంలో పదో ర్యాంకు) సాధించారు. డీఎస్పీగా అర్హత పొందారు. తమ కూతురు డీఎస్పీగా ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందంటూ ఆమె తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

● **నోముల రవీందర్‌రెడ్డి,** మహబూబ్‌నగర్

అవగాహనా అవసరమే!

మేకప్‌లో ఉపయోగించే సౌందర్య సాధనాల గురించి మనకు తెలిసింది ఎంతో తక్కువ. కానీ వాటి పట్ల అవగాహన పెంచుకోవడం వల్ల ఏ ఉత్పత్తి ప్రయోజనం ఏ మేరకు ఉంటుందో, ఆ ప్రయోజానాన్ని పూర్తి స్థాయిలో పొందడం కోసం ఎలాంటి మెలకువలు పాటించవచ్చో తెలుస్తుంది.

లిప్ లైనర్: పెదవులకు చక్కని ఆకృతిని తెచ్చి పెడుతుంది. లిప్‌స్టిక్ చెదరకుండా నిలిపి ఉంచుతుంది.

హైలైటర్: మేకప్ పూర్తయిన తర్వాత, ముక్కు, చుబుకం, నుదుటి మీద హైలైటర్ అప్లై చేయడం మర్చిపోకూడదు. ఇలా చేయడం వల్ల వేసుకున్న మేకప్ మరింత ఆకర్షణీయంగా మారుతుంది.

టోనర్: చర్మం నునుపుగా, బిగుతుగా మేకప్‌కు అనువుగా మారడం కోసం టోనర్ వాడడం తప్పనిసరి. అలాగే మొటిమలు, మచ్చలు ఉన్న చోట టోనర్‌ను అప్లై చేసుకుని, వాటిని కనిపించకుండా దాచేయవచ్చు.



మాయిశ్చరైజర్: మేకప్ సమంగా పరుచుకోవడం కోసం మేకప్‌కు ముందు మాయిశ్చరైజర్ వాడుకోవాలి. మాయిశ్చరైజర్ వాడడం వల్ల చర్మం మీద మేకప్ పగుళ్లు ఏర్పడకుండా ఉంటాయి. చర్మం పొడిబారిపోకుండా ఉంటుంది.

ప్రైమర్: చర్మానికీ, మేకప్‌కూ మధ్య ప్రైమర్ అడ్డుగా ఉండి, చర్మం మీది రంధ్రాలు కనిపించకుండా చేస్తుంది. దీంతో చర్మ రంధ్రాలు పూడుకుపోకుండా ఉంటాయి.

ఫౌండేషన్: స్కిన్ టోన్‌ను సమం చేసి, మేకప్‌కు బేస్‌గా మారుతుంది. కాబట్టి, ఫౌండేషన్‌ను ముఖం మీద సమంగా పరుచుకోవాలి.

కన్‌సీలర్: చర్మపు రంగుకు ఒకటి లేదా రెండు టోన్ల తేలిక రంగు కన్‌సీలర్ ఎంచుకోవాలి. దీంతో మచ్చలను దాచేసి, ముఖంలో కనురెప్పలు, ముక్కు, చుబుకం, చెక్కిళ్లను హైలైట్ చేసుకోవచ్చు.

కాంటూర్: దీంతో ముఖానికి ఆకారాన్ని తీసుకురావచ్చు. ముక్కు, చుబుకం, చెక్కిళ్లను ఆకర్షణీయంగా మలుచుకోవచ్చు.

బ్లష్: చెక్కిళ్లను హైలైట్ చేయడం కోసం దీన్ని వాడుకోవాలి.

ప్రయాణంలో వాంతులా..?

కొంతమంది ప్రయాణం చేసేటప్పుడు వాంతులు, వికారం, తలనొప్పి లాంటి సమస్యలతో ఇబ్బంది పడుతూ ఉంటారు. కారు, బస్సు, రైలు, విమానం.. దేనిలో ప్రయాణిస్తున్నా వీరికి తిప్పలు తప్పవు. అలాంటప్పుడు చిన్న చిట్కాలు పాటించి ఎలా ఉపశమనం పొందాలో తెలుసుకుందాం...

- ప్రయాణాలప్పుడు ఎక్కువగా ఆహారం తీసుకోకూడదు. బయలుదేరడానికి అరగంట ముందు.. తేలికగా జీర్ణమయ్యే వాటిని కొద్దిగా మాత్రమే తినాలి. నూనె పదార్థాలు, మసాలాలు దట్టించిన ఆహారం తినకూడదు. ప్రయాణం మధ్యలో కాఫీ, టీ లేదా సోడా తాగితే తిన్న ఆహారం వేగంగా జీర్ణమవుతుంది. అప్పుడు ఎలాంటి సమస్యలూ రావు.
- కారు లేదా బస్సులో ముందు వరుస సీటులో కూర్చోవడం మంచిది. వెనక కూర్చుంటే వాంతుల సమస్య అధికమవుతుంది. రైల్లో అయితే కదిలే దిశవైపుగా కూర్చోవాలి.
- కిటికీ పక్కన కూర్చోవడం ఉపశమనంగా ఉంటుంది. బయటి నుంచి వచ్చే గాలి ముఖానికి తగులుతూ ఉంటే తలతిరగడం, వాంతులు తగ్గుతాయి. ఏసి సౌకర్యాన్ని వినియోగించుకుంటే చాలావరకు సమస్యలను అధిగమించవచ్చు.
- అల్లం... కడుపులో వికారాన్ని తగ్గిస్తుంది. కాబట్టి అల్లం మురబ్బా తినడం వల్ల ప్రయోజనం ఉంటుంది. అల్లం టీ లేదంటే వేడినీటిలో శొంఠి పొడి కలుపుకుని తాగినా మంచిదే. రెండు యాలకులు లేదా తులసి ఆకులు నములుతూ ఉన్నా వాంతులు కావు.
- పసుపు పచ్చని నిమ్మకాయను చేత్తో పట్టుకుని గట్టిగా నొక్కుతూ వాసన చూస్తే వెంటనే కడుపులో వికారం, వాంతులు తగ్గిపోతాయి.
- ప్రయాణిస్తున్నప్పుడు పుస్తకం చదవడం, మొబైల్ చూడడం లాంటివి సమస్యలను పెంచుతాయి. కిటికీలో నుంచి ప్రకృతిని చూడడం, కొత్త వ్యక్తులను పరిచయం చేసుకోవడం, పక్కన ఉన్నవారితో కబుర్లు చెప్పడం లాంటివి చాలావరకు ఉపశమనం కలిగిస్తాయి.



- కారులో ప్రయాణిస్తుంటే కొద్దిసేపు విరామం తీసుకోవడం ఫలితాన్నిస్తుంది. అదే బస్సులో అయితే అయిదు నిమిషాలు నిలబడడం మంచిది. రైల్లో పది నిమిషాలు అటూ ఇటూ నడవడం వల్ల ప్రయోజనం ఉంటుంది.







అమ్మవారికి రూ.4.50కోట్లతో అలంకరణ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లా అమలాపురంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మ వారి సన్నిధిలోని వాసవీమాతను శుక్రవారం రూ.4కోట్ల 50లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. - అమలాపురం, ఆంధ్రజ్యోతి

బెజవాడలో దసరా సందడి

బెజవాడలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఒకవైపు ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామివార్ల దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు, మరోవైపు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొంచుకుంటున్నారు. శుక్రవారం ఐదోరోజు దుర్గమ్మ శ్రీమహాలక్ష్మి రూపంలో భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం దుర్గా ఘాట్ వద్ద కృష్ణా నవ హారతిని తిలకించడానికి వచ్చిన భక్తులు జయజయధ్వానాలతో ఆ ప్రాంతాన్ని మార్మోగించారు. బెజవాడలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉత్సవ వేదికలు భక్తులతో కళకళలాడాయి. పున్నమి ఘాట్ వద్ద సాంస్కృతిక సంబరాలు అంబరాన్ని తాకాయి. భవానీ మాలధారుల ప్రత్యేక దాండియా కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. చిన్నాపెద్దా కలిసి సందడి చేశారు.



మంత్రి నారాయణ సమక్షంలో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, ఆర్కి టెక్చర్ అండ్ ప్లానింగ్ ఎంఓయూ చేసుకుంటున్న దృశ్యం

నివేదికల రూపకల్పన కీలకం

- సుస్థిర నగరాల నిర్మాణాలపై మంత్రి నారాయణ
- ఎస్పీఏవీతో మున్సిపల్‌శాఖ ఎంఓయూ

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సుస్థిర నగరాల నిర్మాణానికి నివేదికల రూపకల్పన అత్యంత కీలకమని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. రాష్ట్రంలో సుస్థిర నగరాల నిర్మాణానికి అవసరమైన నివేదికల రూపకల్పనకు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ సహకరించనుంది. దీనికి సంబంధించి మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ మధ్య శుక్రవారం సచివాలయంలో మంత్రి నారాయణ సమక్షంలో అవగాహన ఒప్పందం జరిగింది. మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ సిరికొండ రమేష్ ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. మున్సిపల్‌శాఖలో ఉన్న పట్టణ ప్లానింగ్, ఇతర విభాగాలు అధునాతన సాంకేతికత, పరిశోధనలకు ఈ ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు. అమరావతితో పాటు భవిష్యత్తుకు అవసరమైన పట్టణాభివృద్ధికి ప్లానింగ్ స్కూల్ సహకరిస్తుందన్నారు. పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్మించనున్న మెట్రో ప్రాజెక్టులు పర్యావరణ హితంగా ఉండేలా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ సహకరిస్తుందని తెలిపారు. నగరాల్లో జీఐఎస్ మాస్టర్ ప్లాన్‌ల తయారీకి ఎస్పీఏ సహకరిస్తుందన్నారు. ఈ ఎంఓయూ ద్వారా శాఖాపరంగా వచ్చే కీలక మార్పుల ద్వారా దేశంలోనే సుస్థిర పట్టణాభివృద్ధిలో ఏపీ ముందంజలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మైసూరును మరిపిస్తున్న 'విజయవాడ ఉత్సవ్'

- ప్రశంసించిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి
- ఉర్రూతలూగించిన బాలీవుడ్ గాయని అభిలిప్సా



త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమా, సుజనాచౌదరి, కేశినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా

విజయవాడ సిటీ/విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ వారసత్వ సంపదను పండుగలు రక్షిస్తాయని త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి అన్నారు. పున్నమి ఘాట్‌లో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఆయన సతీమణి రేణుకతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మైసూరు ఉత్సవాలను మరిపించేలా విజయవాడ దసరా ఉత్సవాలు జరుగుతున్నాయని ప్రశంసించారు. విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకోవడం తన అదృష్టంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డిని ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమ, సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్, బుద్దా వెంకన్న తదితరులు ఘనంగా సత్కరించారు. పున్నమి ఘాట్‌లో ఐదో రోజు శుక్రవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. బాలీవుడ్ గాయని అభిలిప్సా పాండా తన అద్భుత గాత్రంతో కృష్ణమ్మ ఒడిలో ఆధ్యాత్మికతను ఉప్పొంగించారు. గర్బా నైట్‌లో భాగంగా హిందీ పాటకు దాండియా బృందంతో నాట్యం చేయించారు. స్థానిక కళాకారులు మహిషాసుర సంహారాన్ని నృత్యరూపంలో కళ్లకు కట్టారు.

ఉత్సవ్‌లో నేడు

శనివారం సాయంత్రం గొల్లపూడిలో విజయవాడ ఎగ్జిబిషన్‌ను సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రారంభిస్తారు. తర్వాత సింగర్ సునీల్ లైవ్ మ్యూజిక్ జరుగుతుంది. పున్నమి ఘాట్‌లో శాస్త్రీయ నృత్య ప్రదర్శన, డివోషనల్ లైవ్ కార్యక్రమం ఉంటుంది. తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా.. రాజమహేంద్రవరానికి చెందిన నాట్యాచారిణి డాక్టర్ లలిత సిందూరి శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన, సంగీత కచేరి, మ్యాజిక్ షో, తదితర కార్యక్రమాలు ఉంటాయి. ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో ఆంధ్ర నాట్యం, సంగీత కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శన, బుర్రకథ, తోలుబొమ్మలాట, పౌరాణిక పద్య నాటకం శ్రీకృష్ణ తులాభారం ప్రదర్శిస్తారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ ఆదేశాలు

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ఇటీవల విజయవాడ, గుంటూరులో డయేరియాతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి పరిస్థితులు వచ్చినప్పుడు అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. డయేరియా, జీఈ కేసులు వచ్చిన ప్రాంతాలను కంటైన్మెంట్ చేయాలి. ఫుడ్ స్టాళ్లను పూర్తిగా నిలిపివేయాలి. నీటి నాణ్యత పరీక్షలు చేయించాలి. డ్రెయిన్ల వెంబడి ఉండే మంచినీటి పైపులైన్లకు లీకేజీ లేకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలి' అని ఆదేశించారు. మున్సిపల్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖలు సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం వల్ల కేసులు పెరిగితే సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, జీఎస్టీ సంస్కరణలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకోసం నెల రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు. జీఎస్టీ 2.0 ప్రయోజనాలపై దసరా నుంచి దీపావళి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

అక్టోబరు 5న ఏపీపీ రాత పరీక్షలు

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకానికి అక్టోబరు 5న రెండు విడతల్లో రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేపర్-1 ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ నెల 28 నుంచి బోర్డు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల కోసం పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఆగస్టు 4న నోటిఫికేషన్ జారీచేసింది. ఈ పోస్టుల కోసం 2103 దరఖాస్తులు అందాయని, 1139 మంది పురుషులు, 964 మంది మహిళా అభ్యర్థులు ఈ రాత పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

ఏపీటీపీసీ బోర్డు డైరెక్టర్ల నియామకం

- నలుగురు షేర్ హోల్డర్లు కూడా..

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ బోర్డును ప్రభుత్వం పునర్నిర్మించింది. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శిని ఛైర్మన్‌గా, ఏపీటీపీసీ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టరు, పరిశ్రమలశాఖ డైరెక్టరు, అడిషనల్ సెక్రటరీ లేదా జాయింట్ సెక్రటరీ, ఎస్టీసీ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్‌లను డైరెక్టర్లుగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఏపీటీపీసీ బోర్డు షేర్‌హోల్డర్స్ (వాటాదారులు)గా ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీలు ఎన్.వి.వీరకుమారి, ఎస్.హనుమంతరావు, అసిస్టెంట్ సెక్రటరీలు ఎస్.శివనాగ రాజేశ్వరి, ఎం.వెంకటేశ్వర్లును నియమించింది. ఇంతకు ముందే పలువురు అధికారులను షేర్‌హోల్డర్స్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవరిస్తూ పరిశ్రమలశాఖ మంగళవారం తాజా ఉత్తర్వులు జారీ చేసింది.

చౌక బంగారం ఆశ చూపి డబ్బులు దోచేస్తారు!


నెల్లూరులో 'ట్రాప్' ముఠా ఆగడాలు

- మీడియేటర్లతో వల.. మాయ మాటలతో ఓ ఇంటికి తీసుకెళ్లి దాడులు
- రెండు నెలల్లో పది దోపిడీలు

నెల్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'హాయ్.. సార్!! మీరు చౌకగా బంగారం కావాలా?. మార్కెట్ ధర కంటే బాగా తగ్గించి ఇస్తాం. విదేశాల నుంచి మేలిమి బంగారం తెప్పిస్తాం. వాటికి బిల్లులు ఉండవు. అందుకే అంత తక్కువ ధరకు అమ్ముతున్నాం. మంచి అవకాశం!.' అంటూ ఆ ట్రాప్ గ్యాంగ్ ముఠా సభ్యులు మాయ మాటలు చెబుతారు. వారి వలలో పడ్డారా!? ఇక అంతే!. దౌర్జన్యంగా డబ్బు లాగేస్తారు. ఈ ముఠా ఆగడాలు నెల్లూరు జిల్లాలో ఇటీవల పెచ్చుమీరాయి. గతంలో కావలి కేంద్రంగా నడిచిన ఆ ముఠా దందా ఇప్పుడు నెల్లూరు విస్తరించింది. గడిచిన రెండు నెలల కాలంలో నెల్లూరులో వీరి వలలో 10మంది వరకూ పడినట్లు సమాచారం. తిరుపతికి చెందిన డాక్టర్ ఫిర్యాదుతో తాజాగా నెల్లూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఆ ముఠాపై కేసు నమోదు చేశారు. తిరుపతికి చెందిన ఆ డాక్టర్ ఆ గ్యాంగ్ మీడియేటర్ మాటలు నమ్మి తక్కువ ధరకు బంగారాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధపడ్డారు. గత నెలలో రూ. 14.50 లక్షలతో నెల్లూరుకు వచ్చి ట్రాప్ గ్యాంగ్‌కు చిక్కారు. ఆ ముఠా సభ్యులు డాక్టర్‌ను ఓ ఇంటిలోకి తీసుకెళ్లి ఆయన తెచ్చిన డబ్బు లాక్కుని బంగారం ఇవ్వకుండా బయటకు గెంటేశారు. ఈ విషయాన్ని సదరు డాక్టర్ నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావుకు చెప్పగా, ఆయన ఓ టీంతో రహస్యంగా ట్రాప్ గ్యాంగ్ ఆగడాలపై విచారణ చేసినట్లు సమాచారం.

పక్కాగా ప్లాన్ చేస్తారు..

నెల్లూరు కొత్తకాలువ సెంటర్ వద్ద ఒంగోలుకు చెందిన ఓ వ్యక్తి, మహిళ భార్యాభర్తలమని చెప్పి రెండు నెలల క్రితం ఇంటిని అద్దెకు తీసుకున్నారు. వీరు ట్రాప్ గ్యాంగ్‌లో సభ్యులు. కావలికి చెందిన ఓ వ్యక్తి ఈ గ్యాంగ్‌కు లీడర్ కాగా, వెంకటేశ్వరపురానికి చెందిన బావ, బావమ్మర్దులు కీలక సభ్యులు. వీరు మీడియేటర్లను పెట్టుకుని ట్రాప్ చేస్తారు. వలలో పడ్డవాళ్లని ఆ మీడియేటర్లు కొత్త కాలువ సెంటర్‌కు తీసుకురాగానే ఇక మిగిలిన కథంతా గ్యాంగ్ ప్రధాన సభ్యులు చూసుకుంటారు. బంగారం కొనుగోలుకు డబ్బుతో వచ్చిన వారిని అద్దెకు తీసుకున్న ఇంటికి తీసుకెళ్లి భయపెడతారు. ఎదురు తిరిగితే కొడతారు. డబ్బు లాక్కుని బయటకు గెంటేస్తారు. రెండు నెలల నుంచి సుమారు పది మంది వీరి చేతిలో మోసపోయినట్లు, భయంతోనే పోలీసులకు ఫిర్యాదు చేయనట్లు తెలుస్తోంది. ఈ మోసాల విలువ రూ.కోట్లలోనే ఉంటుందని సమాచారం. గతేడాది ముత్తుకూరు మండలం జెన్‌కో రోడ్డులో ఇదే తరహా ట్రాప్‌లో ఉన్న నిందితులే ఇప్పుడు నెల్లూరులో పాగా వేశారని, గూడూరు, సూళ్లూరుపేటల్లో కూడా వీరి దందాలు నడుస్తున్నాయని తెలుస్తోంది.



ఎఫ్ఐఆర్‌లో 'గ్యాంగ్' పేర్లెందుకు లేవో?

తాజాగా నమోదైన కేసులో ఓ మీడియేటర్‌తో పాటు వెంకటేశ్వరపురానికి చెందిన వ్యక్తి, ఇంటిని అద్దెకు తీసుకున్న మహిళ పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. కానీ గ్యాంగ్ ప్రధాన సభ్యులను చేర్చకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ట్రాప్‌లో కీలకంగా ఉన్న ఒంగోలుకు చెందిన వ్యక్తి నెల్లూరులో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారికి సోదరుడిగా ప్రచా రం జరుగుతోంది. అయితే ఈ ట్రాప్ గ్యాంగ్‌తో పోలీసులకు సంబంధాలున్నట్లు గతేడాది ముత్తుకూరులో నమోదైన కేసులో బయటపడింది. ఈ క్రమంలోనే నెల్లూరు రూ రల్ పోలీసు స్టేషన్‌లో ఐదుగురు సిబ్బందిపై గతేడాది బదిలీ వేటు వేశారు. అయినా కూడా కొందరు పోలీసులు ఈ గ్యాంగ్‌కు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా నమోదైన కేసులో లోతుగా విచారణ జరుగుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

దర్శకుడు వైవీఎస్ చౌదరికి మాతృవియోగం



దర్శకుడు, నిర్మాత వైవీఎస్ చౌదరి మాతృమూర్తి రత్నకుమారి (88) కన్నుమూశారు. గురువారం రాత్రి ఆవిడ తుది శ్వాస విడిచినట్లు దర్శకుడు చౌదరి తెలిపారు. 'లారీ డ్రైవర్ అయిన మా నాన్న యలమంచిలి నారాయణ రావు సంపాదనతో మా అమ్మ మమ్మల్ని పెంచి పెద్ద చేశారు. పనిమనిషి ప్రమేయం లేని జీవితాన్ని మాకు అందించాలనే తపనతో ప్రతి రోజూ తెల్లారే లేచి అన్నీ తానే చేసేవారు. మమ్మల్ని పెంచడానికి తన జీవితాన్ని అంకితం చేశారు. మా అవసరాలకు తగ్గట్లుగా తన నోటి లెక్కలతోనే బడ్జెట్ కేటాయించిన ఆర్థిక రంగ నిపుణురాలు మా అమ్మ. ఆవిడకు తెలిసిన లెక్కలు, మమ్మల్ని పెంచిన విధానం ఏ చదువు, ఏ విద్యా నేర్పించలేనివి. తన విధానాలతో మాలో కూడా స్ఫూర్తిని నింపిన మహనీయురాలు మా అమ్మ' అంటూ నివాళులు అర్పించారు వైవీఎస్ చౌదరి.

సంక్రాంతికి వినోదాల విందు



తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి మరో కుటుంబ కథా చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. మారి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బేనర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సంక్రాంతికి కానుకగా 2026 జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా ఈ చిత్ర టీజర్‌ని యూనిట్ విడుదల చేసింది. బంగారు ఆభరణాల ప్రకటనతో టీజర్ ప్రారంభమౌతుంది. సినిమా ప్రోమోలో భాగంగా ఒంటి నిండా ఆభరణాలు ధరించిన మీనాక్షి చౌదరి, తమ సినిమాకు బదులు ఆభరణాల గురించి మాట్లాడుతుంది. దాంతో నవీన్ పొలిశెట్టి ఆమె ఆభరణాలను తాను ధరించి 'అనగనగ ఒక రాజు' సినిమా సంక్రాంతికి వస్తోంది అని చెప్పడం సరదాగా ఉంది. టీజర్‌లో నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి పోటీ పడుతూ నవ్వులు పంచారు. ఈ చిత్రానికి డీవోపీ: జె.యువరాజ్, సంగీత దర్శకుడు: మిక్కీ జె.మేయర్.

మరోసారి భయపెట్టనున్న నవాజుద్దీన్



ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్న జంటగా ఆదిత్య సర్పోత్‌దార్ తెరకెక్కించిన రొమాంటిక్ హారర్ కామెడీ చిత్రం 'థామ్మా'. మడాక్ ఫిల్మ్స్ బేనర్‌పై దినేశ్ విజన్, అమర్ కౌశిక్ నిర్మిస్తున్నారు. మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా ఇప్పటికే వచ్చిన 'స్త్రీ', 'ముంజ్యా', 'భేదియా', 'స్త్రీ 2' చిత్రాలు ప్రేక్షకులను మెప్పించాయి. ఇప్పుడు అదే కోవలో 'థామ్మా' వస్తోంది. దీపావళి సందర్భంగా అక్టోబరు 21న థియేటర్లలో సందడి చేయనుంది. తాజాగా యూనిట్ ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేసింది. 'యక్షాసన్' అనే బేతాళుడి పాత్రలో నవాజుద్దీన్ సిద్దిఖీ కట్టి పడేశారు. మరోసారి ప్రేక్షకులను నవాజుద్దీన్ తన భీకర నటనతో భయపెట్టబోతున్నట్లు ట్రైలర్‌ని చూస్తే అర్థమవుతోంది.

'దృశ్యం 3' సెట్‌లో మోహన్‌లాల్‌కు సత్కారం



ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ పురస్కారం అందుకొన్న మలయాళ చిత్రరంగ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు శుక్రవారం 'దృశ్యం 3' చిత్రం సెట్‌లో సాదర స్వాగతం లభించింది. ఆ చిత్రంలో మోహన్‌లాల్‌కు భార్యగా నటిస్తున్న మీనా, దర్శకుడు జీతూ జోసెఫ్ అభినందనలు తెలిపి, కేక్ కట్ చేయించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను మీనా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

'అవతార్ 3' విడుదలకు సిద్ధం



హాలీవుడ్ స్టార్ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన అద్భుత ప్రపంచం 'అవతార్' సంచలన విజయాలు నమోదు చేసిన విషయం విదితమే. హాలీవుడ్ రూపురేఖలనే మార్చేసిన ఈ అవతార్ యూనివర్స్‌లో ఇప్పటికే రెండు భాగాలు విడుదలై ప్రేక్షకులను మెప్పించాయి. ఇప్పుడు మూడో భాగం 'అవతార్: ఫైర్ అండ్ యాష్' డిసెంబరు 19న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రెండు నెలల క్రితమే ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. తాజాగా మరో కొత్త ట్రైలర్‌ని విడుదల చేసింది. ఇందులో పోరాట ఘట్టాలు కట్టిపడేసేలా ఉన్నాయి. రెండు తెగల మధ్య జరిగిన యుద్ధాన్ని దర్శకుడు అద్భుతంగా ఆవిష్కరించారు. అలాగే పండోరాకు చెందిన అద్భుతమైన నీటి అడుగు ప్రపంచాన్ని మరోసారి ప్రేక్షకులకు అందించనుంది.



నెల్లూరు జిల్లా అల్లూరులో ఉత్పత్తి లేక ఖాళీగా ఉన్న ఉప్పు మడులు

కరిగిపోతున్న ఉప్పు రైతు కష్టం!

- ఉత్పత్తిపై రుతుపవనాలు, తుఫాన్ల ప్రభావం
- నెల్లూరు జిల్లాలో ఖాళీగా ఉప్పు కయ్యలు
- గిట్టుబాటు ధర ఉన్నా అనుకూలించని వాతావరణం
- నిల్వ చేసుకునే సౌకర్యం లేక అవస్థలు

ఉప్పు ఉత్పత్తిదారులకు వాతావరణ మార్పులు శాపంగా మారాయి. నెల్లూరు జిల్లాలో సాధారణంగా ఈ సీజన్‌లో ఉప్పు కుప్పలతో కళకళలాడాల్సిన కయ్యలు(మడులు) ఖాళీగా దర్శనమిస్తున్నాయి. రుతుపవనాల ఆగమనం, తుఫాన్ల కారణంగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ఈ దుస్థితి ఏర్పడింది. ఏటా జనవరి నుంచి ఉప్పు ఉత్పత్తికి పనులు ప్రారంభమై కయ్యలను మరమ్మతులు చేసుకొని మార్చి నుంచి అక్టోబరు వరకు ఉప్పు ఉత్పత్తి చేపడతారు. ఈదఫా రుతుపవనాలు ముందుగానే రావడంతో గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి!.

(అల్లూరు-ఆంధ్రజ్యోతి)

వాతావరణంలో ఉష్ణోగ్రతపై ఆధారపడి సాగు చేసే ఉప్పు పంటకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మంచి పేరుంది. గతంలో కేవలం ఐదు వేల ఎకరాల్లోపు ఉండే ఉప్పు ఉత్పత్తి విస్తీర్ణం నేడు గణనీయంగా 15 వేల ఎకరాల వరకు పెరిగింది. ఆక్వా రంగం కుదేలవడంతోపాటు ఉప్పుకు పెరిగిన ఆశాజనక ధరలే ఇందుకు కారణం. రెండేళ్లుగా ఉప్పునకు మద్దతు ధర లభించిందని రైతులు ఆనందంలో మునిగి తేలారు. అయితే, ఇప్పుడు ప్రతికూల వాతావరణం కారణంగా ఉత్పత్తి తగ్గుముఖం పట్టి రైతుల వెన్ను విరిగింది. ఏటా సీజనులో ఉత్పత్తయిన ఉప్పును నిల్వ చేసుకుంటే వర్షాకాలంలో ధరలు పెరిగి లాభాలను తెచ్చిపెట్టే అవకాశం ఉంటుంది. వేసవిలో ఉత్పత్తి బాగున్నా ఆశించినస్థాయిలో ధర లేకున్నా విక్రయిస్తుంటారు. కొంత ఉప్పును నిల్వ చేసుకుని అన్‌సీజనులో పెరిగిన ధరలకు విక్రయించి తద్వారా లాభాలు పొందుతారు. అయితే ఈ ఏడాది వేసవిలోనూ ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. కనిష్ఠ ధర క్వింటా రూ.300 ఉండగా గరిష్ఠంగా రూ.400 పలికింది. నాణ్యమైన ఉప్పు రూ.450 చొప్పున ఈ ఏడాది రైతుకు భారీగానే ఆదాయం రావాల్సి ఉంది. కానీ వాతావరణం రైతులపాలిట శాపంగా మారింది. ప్రస్తుతం ధరలు ఉన్నా ఇటీవల కురిసిన వర్షాలకు కయ్య(మడులు)ల్లో ఉప్పు కరిగిపోయింది. వాతావరణంలో చోటు చేసుకున్న చల్లదనానికి ఉత్పత్తి కూడా నిలిచిపోయింది. ఉత్పతి అయిన కాస్త ఉప్పు కూడా నిల్వ చేసుకునే స్థలం లేక అయినకాడికే అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

ఉత్పత్తి సాగితే లాభాలే!

సాధారణంగా ఒక ఎకరాలో ఉప్పు ఉత్పత్తికి రూ.25వేల వరకు ఖర్చవుతుంది. కనిష్ఠంగా 500 క్వింటాళ్ల ఉత్పత్తి అవుతుంది. క్వింటా రూ.300 పలికితే సీజను మొత్తంలో ఎకరానికి రూ1.5 లక్షలు వస్తుంది. ఇందులో ఖర్చులు రూ.25 వేలు-రూ.50వేలు పెట్టినా రూ.75వేల నుంచి రూ.లక్ష వరకు మిగులుతుంది. దీనికోసం ఆరు నెలలు ఎదురు చూడగా, ఈ ఏడాది రుతుపవనాల కారణంగా నష్టపోయామని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరలు బాగానే ఉన్నాయి



ఈ ఏడాది ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. గత ఏడాదికంటే సీజనులో ఈ ధరలు పలకడం గొప్ప విషయమే. కానీ ఉత్పత్తి లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి. ధరలు ఉంటే ఉత్పత్తి లేదు. ఉత్పత్తి ఉంటే ధరలు రావు. ఈ విధంగా మా ఉప్పు రైతులు జీవితాలు నిలకడ లేకుండా పోతున్నాయి.

- పులిని ఏడుకొండలు, తూర్పు గోగులపల్లి, అల్లూరు మండలం

తుఫానులే మా పాలిట శాపం



ఏటా రుతుపవనాలు సమయానికి రాకుండా ఆలస్యమవుతున్నాయనే వార్తలు విన్నాం. కానీ ఈ ఏడాది ముందుగానే రావడం తుఫానులు ఏర్పడి మా పాలిట శాపంగా మారింది. వర్షాకాలం సమీపిస్తున్న కారణంగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో ఉత్పత్తి నిలిచి, ఉపాధికి గండిపడింది.

- చెవికల శ్రీనివాసులు, ఇస్కపల్లి, అల్లూరు మండలం



'లడ్డూ' సిట్‌కు పచ్చజెండా

హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే.. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యిపై సిట్ యథావిధిగా దర్యాప్తు చేయొచ్చు

- నిర్దిష్ట అధికారిని దర్యాప్తు బృందం నియమించుకుంటే తప్పేంటి?
- పర్యవేక్షణంతా సీబీఐ డైరెక్టర్‌దే కదా!
- చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ అసహనం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారనే ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) యథావిధిగా దర్యాప్తు కొనసాగించవచ్చని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఈ సిట్‌లో తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) జె.వెంకట్రావును దర్యాప్తు అధికారిగా నియమించడాన్ని సమర్థించింది. ఆయన విషయంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేసింది. సిట్ ఒక నిర్దిష్ట అధికారిని నియమించుకోవాలనుకుంటే.. అందులో తప్పేముందని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. 'దర్యాప్తు మొత్తం సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో జరుగుతున్నప్పుడు.. విచారణ బాధ్యతలను సిట్ మరో అధికారికి అప్పగించడంలో ఎటువంటి తప్పూ లేదు. సిట్ దర్యాప్తు పర్యవేక్షణను వదిలేయలేదు కదా! అది కేవలం తమ నియంత్రణలో పనిచేసే ఒక దర్యాప్తు అధికారిని మాత్రమే నియమించుకుంది' అని స్పష్టం చేశారు. జగన్ ప్రభుత్వ సమయంలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం జరిగిందనే ఆరోపణలపై అనేక మంది సుప్రీంకోర్టును ఆశ్రయించడం.. దీనిపై విచారణకు సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని (సిట్) సర్వోన్నత న్యాయస్థానం నియమించడం.. ఇందులో సీబీఐ నుంచి ఇద్దరు, రాష్ట్ర పోలీసు శాఖ నుంచి ఇద్దరు, భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నుంచి సీనియర్ అధికారితో సిట్ ఏర్పాటు చేయడం తెలిసిందే. కేసు దర్యాప్తులో భాగంగా సిట్ పలువురిని విచారించింది. కొన్ని డెయిరీల ఉన్నతాధికారులను అరెస్టుచేసింది. ఈ క్రమంలోనే.. విచారణకు రావాలని దర్యాప్తు అధికారి వెంకట్రావు.. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ కదురు చిన్నప్పన్నకు నోటీసులు ఇచ్చారు. అయితే సుప్రీంకోర్టు మార్గనిర్దేశం ప్రకారం వెంకట్రావు నియామకం జరగలేదంటూ.. ఆయన ఇచ్చిన నోటీసులను చిన్నప్పన్న హైకోర్టులో సవాల్ చేశారు. వెంకట్రావు సిట్ సభ్యుడు కాదని, సుప్రీంకోర్టు నియమించలేదని.. ఆయన దర్యాప్తు అధికారిగా కొనసాగడానికి వీల్లేదని.. సీబీఐ డైరెక్టర్ సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లఘించారని హైకోర్టు జూలై 10న స్పష్టంచేసింది. కేసు దర్యాప్తుపై స్టే విధించింది. ఈ తీర్పును సీబీఐ డైరెక్టర్ గత నెల 5న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. సీబీఐ తరఫున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. సిట్ సంపూర్ణంగా సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తోందని.. అందులోని సభ్యులందరితో ఆయన సమావేశమై.. దర్యాప్తును స్వయంగా పర్యవేక్షిస్తున్నారని.. వెంకట్రావును దర్యాప్తు అధికారిగా నియమించడాన్ని ఆయన ఆమోదించారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వెంకట్రావును పరిమిత పాత్రలో నియమించారని తెలిపారు. ఎంతో కీలకమైన కేసులో దర్యాప్తు అధికారి నోటీసులిస్తే విచారణకు రానని చెప్పడం సరికాదన్నారు. అయితే.. చిన్నప్పన్నపై వెంకట్రావు ఒత్తిడి చేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. ఈ వ్యాఖ్యలపై సీజేఐ అసహనం వ్యక్తం చేశారు. 'అలా ఒత్తిడి చేస్తే, బెదిరింపులు వస్తే ఫిర్యాదు చేయండి. అంతేగానీ.. విచారణకే రాబోమని చెప్పడమేంటి' అని ఆక్షేపించారు. హైకోర్టు ఉత్తర్వులపై ధర్మాసనం స్టే విధించింది. చిన్నప్పన్నకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నవంబరు 14కు వాయిదా వేసింది.

సిట్ దర్యాప్తు ఇక వేగవంతం

తిరుపతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో తిరుమల లడ్డూప్రసాదంలో కల్తీ నెయ్యి కేసు దర్యాప్తు ఎట్టకేలకు తిరిగి ప్రారంభం కానుంది. సుమారు వంద రోజుల తర్వాత ఒకట్రెండు రోజుల్లో తిరుపతి కేంద్రంగా సిట్ విచారణ తిరిగి మొదలు కానుంది. ఇప్పటికే బాగా ఆలస్యమైన నేపథ్యంలో రెట్టింపు వేగంగా దర్యాప్తును సాధ్యమైన త్వరగా ముగించాలని సీబీఐ ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం. గత మూడు నెలలుగా సిట్ దర్యాప్తుపై నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోవడంతో పెండింగ్‌లో ఉన్న నిందితులను, సాక్షుల విచారణ ప్రక్రియ మళ్లీ మొదలు కానుంది.

కవయిత్రి ఎన్ అరుణ కన్నుమూత



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కవయిత్రి, ఆచార్య ఎన్ గోపీ జీవిత సహచరి అరుణ(77) ఇకలేరు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శుక్రవారం సాయంత్రం రామాంతపూర్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. అరుణ స్వస్థలం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బోధన్. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగులో సహాధ్యాయులైన గోపీ, అరుణలది ప్రేమ వివాహం. అరుణ ఐదు పదుల వయసు దాటిన తర్వాత కవిత్వం రాయడం ప్రారంభించారు. 'మౌనమూ మాట్లాడుతుంది', 'సూది నా జీవన సూత్రం', పాటల చెట్టు, కవితా సంపుటాలుగా వెలువడ్డాయి.

డిప్యూటీ సీఎం పవన్‌కు తగ్గని జ్వరం

- చికిత్స నిమిత్తం హైదరాబాద్ పయనం

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కొంతకాలంగా ఆయన మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయంలోనే ఉంటున్నారు. ఈ సమయంలో ఆరోగ్య సమస్యలు రావడంతో నాలుగు రోజులుగా క్యాంప్ కార్యాలయంలోనే వైద్యం చేయించుకుంటున్నారు. వైద్యులు చికిత్స అందిస్తున్నా జ్వర తీవ్రత తగ్గలేదు. మరోవైపు దగ్గు కూడా ఎక్కువగా ఉండటంతో ఆయన తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లో వైద్య పరీక్షల చేయించుకోవాలని నిర్ణయించారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. కాగా, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ పరామర్శించారు. ఎక్స్ వేదికగా పోస్టు చేసిన ఆయన, పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పవన్ త్వరగా కోలుకోవాలి: సీఎం చంద్రబాబు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వైరల్ జ్వరం నుంచి త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న పవన్ త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవ కొనసాగించాలని, ఓజీ విజయాన్ని ఆస్వాదించాలని చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ కూడా పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలంటూ ట్వీట్ చేశారు.

'అఖండ' కోసం జగన్‌ను కలుస్తానన్న బాలకృష్ణ

- వాళ్లకేం కావాలో చేయాలని నాటి సీఎం చెప్పారు: పేర్ని నాని
- బాలకృష్ణకు పిచ్చి అని దగ్గుబాటి పుస్తకంలో రాశారు: భూమన

మచిలీపట్నం/తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'అఖండ సినిమా కోసం బాలకృష్ణ నాతో మాట్లాడారు. సీఎం జగన్‌ను కలుస్తానని చెప్పారు. ఈ విషయాన్ని నాటి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా.. వాళ్లకు ఏం కావాలో చేసి పెట్టమని చెప్పారు. నా తల్లిదండ్రులపై ఒట్టేసి ఈ మాట చెబుతున్నా' అని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని చెప్పారు. మచిలీపట్నంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కు చంద్రబాబు.. ఇస్తున్న గౌరవాన్ని చూసి బాలకృష్ణ తట్టుకోలేకపోతున్నారని అన్నారు. చిరంజీవి, పవన్ అంటే బాలకృష్ణకు పడదని, ఆ ఉక్రోషంతోనే చిరంజీవిపై బాలకృష్ణ అసెంబ్లీలో విరుచుకుపడ్డారన్నారు. ఎమ్మెల్యే కామినేని అసెంబ్లీలో చిరంజీవిని పొగిడితే బాలకృష్ణ తట్టుకోలేకపోతున్నారన్నారు. మాజీ సీఎం జగన్‌ను సైకో అంటున్న బాలకృష్ణే నిజమైన సైకో అన్నారు. బాలకృష్ణకు 20 ఏళ్ల ముందే పిచ్చి పట్టిందన్న విషయాన్ని వాళ్ల బావ దగ్గుబాటి వెంకటేశ్వరరావు 'ఏది నిజం' అనే పుస్తకంలో రాశారని భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో ఆయన మాట్లాడుతూ... వైఎస్ దయ వల్లే కాల్పుల కేసు నుంచి బాలకృష్ణ విముక్తుడయ్యారని చెప్పారు.

బెయిల్ కోసం ఎత్తులు?



(మొదటి పేజీ తరువాయి)

రక్తం వస్తోందని, తాను బయట వైద్య పరీక్షలు చేయించుకుంటానని కసిరెడ్డి కోరారు. జైలు అధికారులు ఈ నెల 6న ఆయన్ను విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. జైలు మెడికల్ ఆఫీసర్ సిఫారసు చేసిన యూరాలజీ విభాగానికి తీసుకెళ్లగా.. తనకు కాలు నొప్పిగా ఉందంటూ కసిరెడ్డి ఆర్థోపెడిక్ విభాగానికి వెళ్లి ఎంఆర్ఐ పరీక్షలు చేయించుకున్నాడు. వరుణ్ అనే డాక్టర్ ఇచ్చిన మెడికల్ రిపోర్టులో రాజ్ కసిరెడ్డి ఎడమ తొడ ఎముకలో క్యాన్సర్ కారక కణాలు ఉండొచ్చని సందేహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'ఎంచాండ్రోమా-హెచ్‌పీఈ' పరీక్ష అవసరమని సూచించినట్టు సమాచారం. దీనిపై దర్యాప్తు అధికారులు ఆరా తీశారు. తమకు అందిన సమాచారాన్ని ప్రభుత్వ న్యాయవాదుల దృష్టికి తీసుకెళ్లారు. జైలు మెడికల్ ఆఫీసర్‌తో ఒక సమస్య చెప్పి, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాక మరో పరీక్ష చేయించుకోవడంపై సందేహాలు వ్యక్తం చేశారు. మద్యం కుంభకోణంలో కసిరెడ్డి కీలక నిందితుడు. పథక రచన నుంచి అమలు, వసూళ్లు, ముడుపుల సొమ్ము పంపిణీ, ఆ సొమ్ముతో స్థిరాస్తుల కొనుగోలు, హవాలా, ఇతర దేశాల్లో పెట్టుబడుల వరకూ అన్నింట్లోనూ రాజ్ కసిరెడ్డి పాత్రపై సిట్ ఆధారాలు సేకరించింది. కేసు దర్యాప్తులో తవ్వే కొద్దీ సంచలన విషయాలు వెలుగులోకి వస్తుండటంతో ఇప్పట్లో కేసు చివరి దశకొచ్చే అవకాశాలు కనిపించడం లేదు. పరిస్థితిని అంచనా వేసిన రాజ్ కసిరెడ్డి మూత్రనాళం సమస్యను ఎడమ తొడ ఎముకలోకి మార్చి బెయిల్ కోసం ఎత్తుగడ వేసినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ ఏసీబీ కోర్టు మెడికల్ బృందాన్ని ఏర్పాటు చేసి నిగ్గు తేల్చాలని విజయవాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఆదేశాలిచ్చింది. దీంతో అసలు విషయం ఏంటన్నది త్వరలో తేలనుంది. కోర్టు ఆదేశాల మేరకు ఆర్థోపెడిక్స్, పాథాలజీ, రేడియాలజీ, నెఫ్రాలజీ, రేడియేషన్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ వైద్యులతో మెడికల్ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ నెల 29న ఉదయం 9 గంటల నుంచి రాజ్ కసిరెడ్డికి అన్ని పరీక్షలు జరిపి పది రోజుల్లో కోర్టుకు సమగ్ర నివేదిక సీల్డ్ కవర్‌లో అందజేస్తారు. నిందితుడికి నిజంగానే ఆరోగ్య సమస్యలు ఉన్నా యా? లేదా పోలీసులు అనుమానిస్తున్నట్లు ఎడమతొడలో ఎముక నొప్పి కట్టుకథేనా? అన్నది తేలనుంది.

పీఎస్ఆర్‌కు బెయిల్ వచ్చాక..

ఏపీపీఎస్సీ, ముంబై నటి వేధింపుల కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులు విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా కొన్నాళ్లు ఉన్నారు. అనారోగ్య కారణాలతో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. జైలు నుంచి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించగా, ఆయనకు నిజంగానే ఆరోగ్య పరమైన సమస్యలు ఉన్నట్లు తేలింది. దీంతో విజయవాడ ఏసీబీ కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ తర్వాత లిక్కర్ స్కామ్ నిందితులు కూడా బెయిల్ కోసం అనారోగ్యం పేరిట ఎత్తులు వేస్తున్నారని దర్యాప్తు అధికారులు సందేహిస్తున్నారు.

స్కామ్‌లో కీలక నిందితులు

గత ప్రభుత్వంలో జరిగిన 3,500 కోట్ల లిక్కర్ స్కామ్‌లో కీలక వ్యక్తులు నిందితులుగా ఉన్నారు. వారిలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు ఐటీ సలహాదారుగా వ్యవహరించిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిది మొదటి స్థానం. గత ప్రభుత్వంలో ముఖ్యులైన మిథున్ రెడ్డి, విజయ సాయిరెడ్డి, ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, సత్యప్రసాద్, సజ్జల శ్రీధర్ రెడ్డితో కలిసి మద్యం దోపిడీకి పథక రచన చేశాడు. మద్యం షాపులకు జే బ్రాండ్లు సరఫరా చేసిన మద్యం సరఫరాదారుల నుంచి ముడుపులు వసూలు చేసేందుకు బూనేటి చాణక్య, తుకేకుల కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులతో మరో గ్యాంగ్ ఏర్పాటు చేసుకున్నాడు. ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఇప్పటి వరకూ 19 సంస్థలు, 29 మంది వ్యక్తులను నిందితులుగా చేర్చింది. పన్నెండు మందిని అరెస్టు చేసి జైలుకు పంపింది. వారిలో ఏ-1 రాజ్ కసిరెడ్డితో పాటు వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహా ఎనిమిది మంది ఇప్పటికీ విజయవాడ, రాజమహేంద్రవరం జైళ్లలో ఉన్నారు. నలుగురు బెయిల్‌పై విడుదలయ్యారు.

సవేంద్రరెడ్డి కేసు సీబీఐకి!

దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని కేంద్ర దర్యాప్తు సంస్థకు హైకోర్టు ఆదేశం

- సుమోటో ప్రతివాదిగా సీబీఐ రాష్ట్ర విభాగాధిపతి
- 13 నాటికి ప్రాథమిక నివేదిక సమర్పించాలని స్పష్టీకరణ
- కేసు వివరాలను సీల్డ్ కవర్‌లో సీబీఐకి అప్పగించాలని రిజిస్ట్రీకి ఆదేశం
- సవేంద్రరెడ్డి అరెస్టు సమయంలో పోలీసులు చట్టనిబంధనలు అనుసరించలేదు
- ధర్మాసనం ప్రాథమిక అభిప్రాయం

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ వలంటీర్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సవేంద్రరెడ్డి అరెస్టు విషయంలో పోలీసులు తమ చట్టవిరుద్ధ చర్యలను కప్పిపుచ్చుకునేందుకు, గంజాయి కేసులోకి లాగారని హైకోర్టు ధర్మాసనం ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు జరపాలని సీబీఐని ఆదేశించింది. తదుపరి విచారణ జరిగే అక్టోబరు 13 నాటికి ప్రాథమిక నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. సీబీఐ ఏపీ విభాగాధిపతి(విశాఖపట్నం)ని సుమోటోగా వ్యాజ్యంలో ప్రతివాదిగా చేర్చింది. సవేంద్రరెడ్డి సెల్ టవర్ లొకేషన్ డేటా, తాడేపల్లి పోలీసు స్టేషన్ సీసీటీవీ ఫుటేజీ, కోర్టు ముందుంచిన రిమాండ్ రిపోర్టు ప్రతి, సవేంద్రరెడ్డి భార్య తాడేపల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును సీల్డ్ కవర్‌లో ఉంచి.. సీబీఐ దర్యాప్తు అధికారికి అందజేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. పిటిషన్ పై తదుపరి విచారణను అక్టోబరు 13కి వాయిదా వేసింది. అప్పటివరకు సవేంద్రరెడ్డిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచే ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తన భర్త, తాడేపల్లికి చెందిన కుంచాల సవేంద్రరెడ్డిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారని ఆయన భార్య లక్ష్మీప్రసన్న ఈ నెల 22న అత్యవసరంగా హైకోర్టులో హెబియస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం.. 22న రాత్రి 7.30-8.45 మధ్య సవేంద్రరెడ్డిని అరెస్టు చేశామని ప్రత్తిపాడు పోలీసులు చెబుతున్నారని.. మరోవైపు తన భర్తను కిడ్నాప్ చేశారని తాను రాత్రి 7 గంటలకే తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశానని లక్ష్మీప్రసన్న చెబుతున్న నేపథ్యంలో.. వాస్తవాలను తేల్చేందుకు 22న సాయంత్రం 5 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పోలీసు స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్‌ను తమ ముందుంచాలని తాడేపల్లి పోలీసులను ఆదేశించింది. అలాగే ఆ రోజు సవేంద్రరెడ్డి ఫోన్ టవర్ లొకేషన్‌ను గుర్తించి వివరాలు సమర్పించాలని జియో టెలికాం సంస్థకు స్పష్టం చేసింది. ఈ వ్యాజ్యం శుక్రవారం మరోసారి ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. తమ ముందుంచిన రికార్డులను పరిశీలించిన ధర్మాసనం పోలీసుల వైఖరిని తప్పుపట్టింది. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు జరిపి ప్రాథమిక నివేదిక సమర్పించాలని సీబీఐని ఆదేశించింది.



రైతాంగ సమస్యలపై సీఎంను కలిసేందుకు ప్రదర్శనగా వెళుతున్న పీసీసీ చీఫ్ షర్మిలను అడ్డుకుంటున్న పోలీసులు

షర్మిల 'చలో అసెంబ్లీ'ఉద్రిక్తం

- రైతుల సమస్యలపై సీఎంను కలుస్తానన్న కాంగ్రెస్ ఏపీ చీఫ్
- బెజవాడ నుంచి ట్రాక్టర్‌పై ర్యాలీ.. అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదం

విజయవాడ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను సీఎం చంద్రబాబుకు వివరించే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల శుక్రవారం చేపట్టిన 'చలో అసెంబ్లీ' తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. భారీ సంఖ్యలో తరలివచ్చిన శ్రేణులతో కలిసి విజయవాడలోని పార్టీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్ నుంచి అసెంబ్లీకి ట్రాక్టర్‌పై బయలుదేరిన షర్మిలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో షర్మిల సహా పార్టీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసి రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తానని షర్మిల ఇటీవల మీడియాకు చెప్పారు. ఈ క్రమంలో రైతుల సమస్యలు పరిష్కారం కాకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ.. శుక్రవారం ఉల్లిపాయల దండ మెడలో వేసుకుని అసెంబ్లీకి బయలుదేరారు. పంటలకు మద్దతు ధర లభించటం లేదని, 'ఈ-క్రాప్' సరిగా నమోదు కావడం లేదని, రైతులకు యూరియా కూడా అందడం లేదని, ఉల్లి రైతులను పట్టించుకోవటం లేదని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ట్రాక్టర్ ఎక్కి అమరావతికి బయలు దేరారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు.. హుటాహుటిన ఆంధ్రరత్నభవన్‌కు చేరుకుని షర్మిల సహా నాయకులను అడ్డుకున్నారు. రోడ్డుపై బ్యారికేడ్లు పెట్టి ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి న షర్మిల.. ట్రాక్టర్‌పైనే నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆందోళన నిర్వహించారు. పోలీసులు అనుమతులు లేవని చె ప్పే ప్రయత్నం చేయగా.. ఆమె వారి మాటను పట్టించుకోలేదు. ర్యాలీకి అనుమతి ఇచ్చే వరకు ఆం దోళన విరమించేది లేదని తేల్చి చెప్పారు. ఇటు కాంగ్రెస్ నాయకులు, అటు పోలీసుల హడావుడితో ఆంధ్రరత్నభవన్ దగ్గర తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

రైతులకు అన్యాయం

ఏపీలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, వారిని నడిరోడ్డు మీద వదిలేసి.. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని షర్మిల మండిపడ్డారు. పోలీసులు అడ్డుకున్న తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. రైతులకు సంబంధించిన అన్ని సబ్సిడీ పథకాలను ఎత్తేశారని షర్మిల ఆరోపించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదన్నారు. రైతులు సుభిక్షంగా ఉండేలా చర్యలు తీసుకుంటానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వారిని గాలికి వదిలేశారని విమర్శించారు. "టమాటా ధర రెండు రూపాయలా?. క్వింటా ఉల్లిపాయలకు రూ.50 ఇస్తారా?." అని ప్రశ్నించారు. మిర్చికి రూ.12 వేలు ఇస్తామని రూ.6 వేలు కూడా ఇవ్వలేకపోయారని అన్నారు. ఈ నేపథ్యంలో రైతుల సమస్యలను చంద్రబాబుకు విన్నవించాలని భావించినట్టు చెప్పారు. పోలీసులు తనను అడ్డుకోవడం అన్యాయమన్నారు. ప్రజల పక్షాన కాంగ్రెస్ నిలబడిందని, కానీ, పోలీసులతో తమను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జవిశెట్టి సోదరుల హత్య కేసులో.. పిన్నెల్లి సోదరులకు నోటీసులు

- నేడు విచారణకు రావాలని పోలీసుల తాఖీదు

మాచర్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలకు వెల్దుర్తి పోలీసులు నోటీసులు జారీ చేశారు. గుండ్లపాడుకు జవిశెట్టి సోదరుల హత్య కేసులో శనివారం విచారణకు రావాలని ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (ఏ-6), పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి (ఏ-7), వారి బంధువైన కండ్లకుంట సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి (ఏ-8)లకు ఈ నోటీసులిచ్చారు. రామకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి సుప్రీంకోర్టుకు వెళ్లి అరెస్టు కాకుండా తాత్కాలిక బెయిల్ పొందారు. అయితే కేసు విచారణకు మాత్రం హాజరుకావాలని వారిని సుప్రీం కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా నేతృత్వంలో రామకృష్ణారెడ్డికి స్వయంగా శుక్రవారం నోటీసు అందజేశారు. వెంకట్రామిరెడ్డి అందుబాటులో లేకపోవడంతో తండ్రి వెంకటేశ్వరరెడ్డికి నోటీసు అందించారు. వెంకటరెడ్డి కుటుంబసభ్యులకూ నోటీసులిచ్చారు.

సీఎం కుటుంబ సభ్యులపై.. అసభ్య పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్టు

- నిందితుడు మార్టూరు మండలం ద్రోణాదుల వాసి
- రిమాండ్‌కు తరలించినట్లు బాపట్ల ఎస్పీ వెల్లడి

బాపట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సభ్యులపై అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ శుక్రవారమిక్కడ విలేకరులకు ఆ వివరాలను తెలియజేశారు. మార్టూరు మండలం ద్రోణాదులకు చెందిన వి.భాగ్యారావు.. సీఎం కుటుంబ సభ్యుల వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ అసభ్యకర పదజాలంతో సమాజంలో కొన్ని వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని.. అతడిపై చర్యలు తీసుకో వాలని అదే ప్రాంతానికి చెందిన గద్దె అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. భాగ్యారావును అరెస్టు చేసినట్లు చెప్పారు అసభ్యకర పోస్టులను సోషల్ మీడియాలో పంపేందుకు ఉపయోగించిన అతడి మొబైల్‌ను సీజ్ చేశారు. అతడిని రిమాండ్‌కు తరలించారు. సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు. సమావేశంలో బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, మార్టూరు సీఐ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత పోస్టుల కేసులో.. వైసీపీ కార్యకర్త శివప్రసాద్ అరెస్టు

- ధర్మవరం నుంచి గుంటూరుకు తరలించిన సీఐడీ



గడ్డం శివప్రసాద్ (ఫైల్)

ధర్మవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు టీడీపీ కూటమి నాయకులకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వైసీపీ కార్యకర్త గడ్డం శివప్రసాద్‌ను గుంటూరు సీఐడీ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురానికి చెందిన శివప్రసాద్... వైసీపీ సోషల్ మీడియా విభాగంలో ఉన్నాడు. ధర్మవరంలో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. వైసీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబును, కూటమి నాయకులను గంగమ్మకు పొట్టేళ్లను నరికినట్లుగా నరికేస్తామని శివప్రసాద్ సోషల్ మీడియాలో ఈ నెల 6న పోస్టు పెట్టాడు. దీనిపై సీఐడీ బీఎన్ఎస్ సెక్షన్లు 196, 353(2), 351(3), రెడ్ విత్ 79 కింద సుమోటోగా కేసు నమోదు చేసింది. గుంటూరుకు చెందిన సీఐడీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో పోలీసు బృందం శుక్రవారం రాత్రి ధర్మవరం వచ్చి శివప్రసాద్‌ను అరెస్టు చేసింది. ధర్మవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు ఈ సమాచారం అందించి.. అతడిని గుంటూరుకు తరలించింది.

రాష్ట్రంలో యోగా ప్రచార పరిషత్

▸ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఆయుష్



అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యోగా ప్రచార పరిషత్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విశాఖలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం తర్వాత సీఎం చంద్రబాబు ప్రజారోగ్య సంరక్షణ దృష్ట్యా యోగా ప్రచార పరిషత్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగానే యోగా ప్రచార పరిషత్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్య శాఖ పరిషత్ ఏర్పాటుకు సన్నద్ధమయ్యింది. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో పరిషత్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పరిషత్ ఏర్పాటుకు అనుగుణంగా రాష్ట్రంలోని విశాఖ, విజయవాడ, ఒంగోలు, తిరుపతి కేంద్రాలుగా ప్రచార కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఈ పరిషత్ చైర్మన్‌గా ఆరోగ్యశాఖ మంత్రి వ్యవహరిస్తారు. ఇందులో పలువురు నిష్ణాతులను సభ్యులుగా నియమించాలని నిర్ణయించారు. యోగా, ప్రకృతి వైద్యం, ప్రజారోగ్య రంగాలకు చెందిన నిపుణులతో విడిగా ప్యానళ్ల కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్‌లోని యోగాధ్యయన పరిషత్‌ను ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం - 2014లోని పదో షెడ్యూల్‌లో చేర్చారు. పర్యవసానంగా, భౌగోళికంగా హైదరాబాద్‌లో ఉన్న 4 యూనిట్లు తెలంగాణ రాష్ట్ర పరిధిలోకి వెళ్లాయి. మన రాష్ట్రంలో యోగా, ప్రకృతి వైద్యం, పరిశోధనల్ని ప్రోత్సహించే యూనిట్లు లేవు. దీంతో రాష్ట్రంలో యోగా ప్రచార పరిషత్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరిషత్ ఏర్పాటు, విధి విధానాలను ఆయుష్ శాఖ సిద్ధం చేసింది. కమిటీలు ఏర్పాటు, వాటి పరిధికి సంబంధించిన మార్గదర్శకాలు సిద్ధం చేసింది. వార్షిక వ్యయం కింద రూ.5 కోట్ల వరకూ ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. సుమారు 70 మంది సిబ్బంది, నిపుణుల అవసరం ఉంటుందని అంచనా. ఈ పరిషత్‌ను సొసైటీని రిజిస్ట్రేషన్ చట్టం కింద ఏర్పాటు చేయనున్నారు. దీనివల్ల కేంద్ర ఆయుష్ శాఖ నుంచి అదనంగా గ్రాంట్లు పొందే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో యోగా, ప్రకృతి వైద్యం ప్రాధాన్యతపై అవగాహన పెంచడమే లక్ష్యంగా పరిషత్ కార్యకలాపాలు నిర్వహించనుంది.

ప్రజా పిటిషన్లకు ఆధార్ తప్పనిసరి!

▸ భూ సమస్యలకు సర్వే నంబర్

▸ ప్రభుత్వానికి రెవెన్యూ శాఖ ప్రతిపాదనలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ప్రజల నుంచి పిటిషన్ల స్వీకరణలో కీలక మార్పులు తీసుకురావాలని రెవెన్యూ శాఖ ప్రతిపాదించింది. వివిధ ప్రభుత్వ శాఖలకు ప్రజలు ఇచ్చే అర్జీల వాస్తవికతను తెలుసుకునేందుకు, ఆ తర్వాత ఆ అంశం పరిష్కారాన్ని పర్యవేక్షించేందుకు వీలుగా కీలక ప్రతిపాదనలు చేసింది. ప్రతీ పిటిషన్‌పై తప్పనిసరిగా పిటిషనర్ ఆధార్ నంబర్ నమోదు చేసే విధానం తీసుకువచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదించింది. పిటిషన్‌పై ఆధార్, ఫోన్ నంబర్ ఉంటే వాస్తవికతను తెలుసుకుని, నిర్దిష్ట కాలవ్యవధిలో సమస్య పరిష్కారం కోసం ఆయా శాఖలు పనిచేస్తాయని, దీని వల్ల డూప్లికేషన్ సమస్య కూడా ఉండదని రెవెన్యూ శాఖ నివేదించినట్లు తెలిసింది. భూ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే పిటిషన్లపై తప్పనిసరిగా సంబంధిత రైతు భూమి సర్వే నంబర్ ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. కూటమి సర్కారు ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టమ్-పీజీఆర్ఎ్స)ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వంలో సామాన్యులు, రైతులు, వ్యాపార, వాణిజ్య వర్గాలు, ఇతరులు ఎదుర్కొన్న సమస్యల పరిష్కారం కోరుతూ పెద్ద ఎత్తున ప్రభుత్వానికి విన్నపాలు వచ్చాయి. ఇవన్నీ ఐదారు లక్షలపైనే ఉన్నాయి. ఇందులో 80 శాతం రెవెన్యూవే ఉన్నాయని గుర్తించారు. ఇవికాకుండా రెవెన్యూ సదస్సుల నిర్వహణ ద్వారా మరో 2.80 లక్షల పిటిషన్లు వచ్చాయి. కొన్నింటిలో స్పష్టత కొరవడింది. పిటిషన్లలో భూమి సమస్యలు రాశారు కానీ సర్వే నంబర్, ఇతర వివరాలేవీ పొందుపరచలేదు. కొన్ని లక్షల పిటిషన్లపై వ్యక్తుల పేర్లు ఉన్నాయి కానీ అడ్రస్, ఫోన్ నంబర్ లేవు. దీంతో వాటి పరిష్కారం ప్రభుత్వ శాఖలకు పెద్ద పనిగా మారింది. పిటిషన్లు పరిష్కరించామని రెవెన్యూ శాఖ నివేదికలు ఇస్తుంటే, క్లోజ్ చేసిన అంశాలపై అవే విన్నపాలు పదేపదే వస్తున్నాయి. దీంతో సమస్యల పరిష్కారం సరిగ్గా జరగడం లేదని, క్షేత్రస్థాయి సమస్యలు ఎక్కడివక్కడే ఉంటున్నాయన్న భావన ప్రభుత్వ పెద్దల్లో నెలకొంది. తమకొచ్చే విన్నపాల్లో సింహభాగం డూప్లికేషన్, స్పష్టత లేనివే ఉంటున్నాయని రెవెన్యూ శాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలో దీనికి విరుగుడుగా కీలక ప్రతిపాదనలు చేసింది. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుపై సంబంధిత వ్యక్తి పేరు, అడ్రస్, ఆధార్, ఫోన్ నంబర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర వేదికల నుంచి తీసుకునే విన్నపాల్లో ఇవి ఉండేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. దీనివల్ల పీజీఆర్ఎస్‌కు వచ్చే పిటిషన్లలోని వాస్తవికత తెలిసిపోతుందని అధికారులు చెబుతున్నారు. పిటిషన్‌లోని అంశం తీవ్రమైనది అయితే వెంటనే పరిష్కారం కోసం తక్షణ ఆదేశాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఆ పిటిషన్‌ను పరిష్కరించాక నేరుగా సంబంధిత వ్యక్తితో మాట్లాడి సమస్య పరిష్కారమైందా? లేదా? తెలుసుకునే అవకాశం ఉంటుందని, దీని వల్ల పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రజాస్పందన ఎలా ఉందో మరింత స్పష్టంగా తెలుస్తుందని ఓ సీనియర్ అధికారి చెప్పారు. భూ సమస్యల పరిష్కారం కోరుతూ రైతులు ఇచ్చే పిటిషన్లలో తప్పనిసరిగా రైతు ఊరు, ఆధార్, ఖాతా నంబర్‌తో పాటు సర్వే నంబర్‌ను తప్పనిసరిగా జత చేయించాలని ఇప్పటికే జిల్లాలకు ఆదేశాలు ఇచ్చారు. ఈ ప్రతిపాదనల అమలుతో ఫిర్యాదుల్లో పారదర్శకత, వాస్తవికత ఉంటాయని, నిజమైన సమస్యలన్నీ కాలనుగుణంగా పరిష్కారం అవుతాయని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

ఆయాస.. ప్రయాసల్లో వ్యాయామ విద్య!



'గోపన్నపాలెం' పీఈటీ కళాశాల అభివృద్ధి పాట్లు

ఏలూరు జిల్లాలోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల... రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పీఈటీ కాలేజీ ఇదొక్కటే! ఐదు దశాబ్దాలుగా వ్యాయామ విద్యలో విద్యార్థులను సానపట్టే కేంద్రంగా బాసిల్లింది. నేడు అభివృద్ధికి నోచుకోక పాట్లు పడుతోంది. కాలేజీలోని హాస్టళ్లు, భోజనశాల, వంటగది వంటి భవనాలు శిథిలావస్థకు చేరాయి. సరిపడా అధ్యాపకులు లేక 400 సీట్లు ఉన్న కాలేజీలో విద్యార్థుల సంఖ్య 45కు పడిపోయింది. దాతలు సమకూర్చే వనరులే ఆయువుగా ప్రస్తుతం కొనసాగుతోంది.

- సదుపాయాల లేమితో కొట్టుమిట్టాడుతున్న వైనం
- శిథిలావస్థలో హాస్టళ్లు, పలు ఇతర భవనాలు
- అధ్యాపకుల కొరత.. విద్యార్థులకు తీవ్ర ఇక్కట్లు
- 400 సీట్లు ఉన్నా.. 50 లోపే భర్తీ
- రాష్ట్రంలోని ఏకైక ప్రభుత్వ కళాశాల దుస్థితి ఇదీ..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన ప్రభుత్వ వ్యాయామ కాలేజీ ఏలూరు జిల్లా దెందులూరు మండలం గోపన్నపాలెంలోని శ్రీ సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ఒక్కటే! ఇక్కడ బీపీఈడీ, డీపీఈడీ చదవితే ప్రభుత్వ కొలువు గ్యారెంటీ అనేలా ఉండేది గత పరిస్థితి. 1967లో విజయవాడలో ఆంధ్రా కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా ప్రైవేట్‌గా ఉన్న ఈ కళాశాలను గోపన్నపాలేనికి మార్చారు. 1970 దశకంలో బీపీఈడీ, డీపీఈడీ కోర్సులకు 200 సీట్ల వరకు అడ్మిషన్లు ఇచ్చేవారు. డిమాండ్ పెరగడంతో 1995 తర్వాత 400సీట్లకు పెంచారు. అప్పట్లో బాగా క్రీడల్లో రాణించిన ఉద్దండుల పిల్లలకు కూడా సీట్లు దక్కని స్థితి ఉండేది. ఈ కాలేజీ అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో కూడా క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన ఖ్యాతి గడించింది. కానీ ఇప్పుడు కళాశాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. హాస్టళ్ల, భోజనశాలు, వంటగది వంటి భవనాలు శిథిలావస్థకు చేరాయి. దాతల సహకారంతోనే వసతులు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. 400 సీట్లు భర్తీకి అవకాశం ఉన్నా.. విద్యార్థుల సంఖ్య 45కు పడిపోయింది. మరోవైపు అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది.

హయ్యర్‌కు మారడమే శాపం

2020లో కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యాపాలసీ ప్రకారం స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి హయ్యర్ ఎడ్యుకేషన్ పరిధిలోకి తీసుకురావడం ఈ కాలేజీకి శాపంగా మారింది. తదనంతర సంస్కరణల ఫలితంగా 2022 నుంచి ఇక్కడున్న అధ్యాపకులు ఇతర కళాశాలలకు బదిలీ, ప్రమోషన్‌పై వెళ్లిపోయారు. గతంలో ప్రిన్సిపాల్‌ను మినహాయిస్తే 8 మంది అధ్యాపకులు ఉండేవారు. ఇప్పుడు పీడీ ర్యాంకులో ఉన్న ఒక్కరు మాత్రమే ఉన్నారు. రూ.28 వేల వేతనంతో గెస్ట్ లెక్చరర్లు కొద్ది నెలలుగా బోధిస్తున్నారు. వీరికి జీతాల చెల్లింపునకు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. 14మంది కింది స్థాయి సిబ్బందికి ఇద్దరే పనిచేస్తున్నారు.

400 సీట్లకు 45 మంది చేరిక

2010 నుంచి ప్రైవేట్ కళాశాలల ఏర్పాటుకు అనుమతులివ్వడంతో ప్రైవేట్ కాలేజీలు విపరీతంగా పెరిగిపోయాయి. పలు కారణాలతో విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ కాలేజీలో 10 శాతానికి పడిపోయింది. కేవలం శ్రీకాకుళం, విశాఖపట్నం, గోదావరి జిల్లాల నుంచి మాత్రమే అదీ కొంత మంది విద్యార్థులే ఇక్కడ చదువుకుంటున్నారు. కరోనా తర్వాత చేరికలు 50 సీట్లకు దాటలేదు. బ్యాచులర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 36 మంది, డిప్లమో ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 9 మంది మాత్రమే ప్రస్తుతం ఉన్నారు. కొద్ది వారాల్లో వీరంతా శిక్షణ పూర్తి చేసుకోనున్నారు. ఇదిలా ఉండగా పీ సెట్ నిర్వహించి మూడు నెలలు అవుతున్నా కళాశాలలో అడ్మిషన్లకు ప్రభుత్వం ఇప్పటి వరకు అనుమతి ఇవ్వలేదు. వసతి గృహాలు, భోజనం చేసే రూమ్, టాయిలెట్లు సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త హాస్టల్ భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అయితే ఇదే సమయంలో ఇప్పటికే సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, టీడీపీ మండల అధ్యక్షుడు మిల్లు బాబు పిలుపునకు దాతలు స్పందించారు. క్యాడ్‌బరీ (కోకో విత్తన సంస్థ) రూ.30 లక్షల వ్యయంతో భోజనశాలను ఏర్పాటు చేసింది. ఇంకా ఓపెన్ జిమ్, వాటర్ ప్యూరిఫైర్ ప్లాంట్ పలు ఇతర సదుపాయాలను పలువురు దాతలు కల్పించారు. మరోవైపు బాలికలకు హాస్టల్ నిర్మాణానికి ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ ఎంపీ ల్యాండ్స్ నుంచి రూ.25 లక్షలు ప్రకటించారు. ప్రభుత్వం ఏలూరు జిల్లాకు కేటాయించిన బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పరిపాలన భవనాలను ఇక్కడ ఏర్పాటు చేసే యోచనలో ఉండటంతో హాస్టల్ నిర్మాణ ప్రతిపాదనకు బ్రేక్ పడింది.



శిథిలావస్థలో బాలికల హాస్టల్ భవనాలు



నాడు-నేడు కింద నిలిచిపోయిన బాలుర హాస్టల్ నిర్మాణం

ప్రభుత్వం స్పందిస్తుందని ఆశిస్తున్నాం



అధ్యాపకులు, ఇతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వం హాస్టల్ నిర్మించి వసతులు కల్పిస్తే పేద విద్యార్థులకు నెలకు రూ.5 వేల భారం తగ్గుతుంది. ఇటీవల ఎమ్మెల్యే చింతమనేని చొరవతో పెదపాడులో మూతపడిన హాస్టళ్ల స్థానంలో ఈ కళాశాలకు హాస్టల్ మంజూరు చేయించడానికి కలెక్టర్‌కు సిఫారసు చేశారు. త్వరలో అన్ని సౌకర్యాలు కల్పించడానికి విద్యా శాఖ మంత్రి లోకేశ్ కృషి చేస్తారని ఆశిస్తున్నాం.

- డాక్టర్ సాపట్ల నతానియేల్, ప్రిన్సిపాల్

మెస్ చార్జీలు భారంగా ఉన్నాయి



నేను బీపీఈడీ రెండో సంవత్సరం చదువుతున్నాను. మాలాంటి పేద విద్యార్థులు బీపీఈడీ చేయాలంటే ఇదొక్కటే ప్రభుత్వ కళాశాల దగ్గరలో ఉంది. మాకు మెస్ చార్జీలు భారంగా ఉన్నాయి. సాంఘిక సంక్షేమ హాస్టల్ కింద వసతులు కల్పిస్తే రాబోయే విద్యార్థులకు ఎంతో మేలు.

- బి.దసరాజు, బీపీఈడీ విద్యార్థి, శ్రీకాకుళం

మంత్రి లోకేశ్ చొరవ తీసుకోవాలి



మా కళాశాలకు విశాలమైన స్థలం ఉంది. 16 మంది బాలికలు ఇరుకైన ఒక్క గదిలోనే బస చేస్తున్నారు. ప్రభుత్వ కళాశాలను మరింత వృద్ధిలోకి తీసుకురావడానికి మంత్రి లోకేశ్ చొరవ తీసుకోవాలని కోరుతున్నాం. మాలాంటి విద్యార్థుల కోసం హాస్టల్ నిర్మించి పూర్తి చేయాలి.

- దివ్య, బీపీఈడీ విద్యార్థిని



విశాఖ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రులు లోకేశ్, గొట్టిపాటి, భరత్, నారాయణ, దుర్గేశ్, కొండపల్లి

విశాఖ పారిశ్రామిక సదస్సుకు పకడ్బందీ ఏర్పాట్లు

▸ లోకేశ్ అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం భేటీ

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే పారిశ్రామిక భాగస్వామ్య సదస్సును విజయవంతంగా నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో చైర్మన్ లోకేశ్ అధ్యక్షతన ఆ మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు సమావేశమయ్యారు. సీఐఐ ఆధ్వర్యంలో జరిగే 30వ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో భారీగా పెట్టుబడులను ఆకర్షించేలా వ్యూహాత్మక కార్యాచరణను అమలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే సంస్థలతో సదస్సులో అవగాహనా ఒప్పందాలు చేసుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టడంపై చర్చించారు. ఈ సందర్భంగా విశాఖ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు అధికారిక వెబ్‌సైట్‌ను మంత్రి లోకేశ్ ప్రారంభించారు.

ఆక్వా రైతులకు అండగా కేంద్రం

▸ లక్ష కోట్ల సముద్ర ఉత్పత్తుల ఎగుమతులే లక్ష్యం

▸ కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులకు అండగా నిలబడేందుకు కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా మత్స్య రంగాన్ని ఆధునీకరించి, ఎగుమతులను రూ. లక్ష కోట్లకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 2024-25లో 7.45 బిలియన్ డాలర్ల విలువైన సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసినట్లు తెలిపారు. భారత సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారుల సంఘం స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమానికి శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తానూ ఆక్వా రైతునని, ఆక్వా పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమిస్తామని ఈ సందర్భంగా చెప్పారు. ఆక్వా రంగ ఇబ్బందులను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు. సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రైతులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తున్నారని కొనియాడారు.

వెలిగొండ ఫీడర్ కాలువ లైనింగ్‌కు రూ.456 కోట్లు

▸ జలవనరుల శాఖ ఉత్తర్వులు

ఒంగోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో నిర్మాణంలో ఉన్న వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి మరో కీలక అడుగు ముందుకు పడింది. ఫీడర్ కాలువకు కాంక్రీట్ లైనింగ్, సిమెంటు గోడల నిర్మాణానికి రూ.456 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. కృష్ణా నది నుంచి టన్నెల్ ద్వారా నీటిని తీసుకుని 21.80 కి.మీ పొడవైన ఈ ఫీడర్ కాలువ ద్వారా రిజర్వాయర్‌కు తరలించాల్సి ఉంది. వెలిగొండ పనులు పూర్తికాకుండానే.. గత ఎన్నికలకు ముందు నాటి సీఎం వైఎస్ జగన్ ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు శిలాఫలకం వేసిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టు పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. గత ఏడాది అక్టోబరు 29న జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు.. రాష్ట్ర మంత్రులు డీఎస్‌బీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్‌లతో కలిసి ప్రాజెక్టును సందర్శించారు. పలు లోటుపాట్లను గుర్తించారు. ప్రత్యేకించి ఫీడర్ కాలువ తెగిపోయి, భారీ రంధ్రాలు పడి ఉండడం గమనించి తగు చర్యలు చేపట్టాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఈ కాలువకు పూర్తిగా కాంక్రీటుతో లైనింగ్ చేయాలని, అక్కడక్కడా సిమెంటు గోడలు నిర్మించాలని.. అందుకు రూ.456 కోట్లు అవసరమవుతాయని ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ప్రతిపాదనలు పంపారు. ఇటీవల సీఎం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో వచ్చే ఏడాది ఆగస్టుకు వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ పనులు, పునరావాస చర్యలకు రూ.2,059 కోట్లు అవసరమని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమీక్ష జరిగిన 20 రోజులకే వీటిలో కీలకమైన ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు రూ.456 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయడం గమనార్హం.



అధ్వానంగా ఉన్న వెలిగొండ ఫీడర్ కాలువ

ప్రజల వినతులపై అసెంబ్లీలో పిటిషన్లు

▸ సమర్పించిన పలువురు ఎమ్మెల్యేలు

▸ పలు అంశాలపై శాసనసభలో చర్చ

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శాసనసభ పిటిషన్ల కమిటీకి సమర్పించేందుకు శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలు పలు అంశాలపై పిటిషన్లు ఇచ్చారు. 20 మందికి పైగా ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో ప్రజల నుంచి అందిన వినతులను పిటిషన్ల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలను వారు అసెంబ్లీలో చర్చించారు.

- గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే ఆర్ఎంపీలకు శిక్షణ ఇవ్వాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కోరారు. తద్వారా చిన్నపాటి అనారోగ్య సమస్యలకు స్థానికంగానే పరిష్కారం లభిస్తుందన్నారు.
- మినిమం టైమ్ స్కేలు ప్రాతిపదికపై పనిచేస్తున్న 1998 డీఎస్సీ టీచర్లను వారి మండలాలు, క్లస్టర్లలోనే నియమించాలని ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు.
- 2019-24 మధ్య స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌లో టెండర్లు, ఇతర కొనుగోళ్ల అవినీతిపై విచారణ జరిపించాలని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు.
- జగ్గయ్యపేటలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య కోరారు.
- కొత్తవలసలోని ముగదలపాడు గ్రామంలో రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాకపోవడం వల్ల భూములు అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారం చూపి వారికి న్యాయం చేయాలన్నారు.
- డీఎస్సీ కారణంగా ఉద్యోగాలు కోల్పోయే ఆశ్రమ, గిరిజన పాఠశాలల్లోని తాత్కాలిక టీచర్లను ఆదుకోవాలని పాలకొండ ఎమ్మెల్యే ఎన్.జయకృష్ణ కోరారు.
- వైసీపీ హయాంలో జరిగిన నాడు- నేడు పనుల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు.
- రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని రాజాం ఎమ్మెల్యే కొండ్రు మురళి విజ్ఞప్తి చేశారు.

పరకామణి స్కాంపై విచారణ చేయాలి: జ్యోతుల నెహ్రూ

టీటీడీ పరకామణి స్కాంపై విచారణ జరిపించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ డిమాండ్ చేశారు. జీరో అవర్‌లో మాట్లాడుతూ.. సీవీ రవికుమార్ అనే ఉద్యోగి అక్రమంగా రూ.200 కోట్లు సంపాదించాడని ఆరోపించారు. ఆయన డాలర్లు కొట్టేసిన విషయం వీడియోల్లోనూ బయటపడిందన్నారు. గత ప్రభుత్వంలోనే కేసు నమోదైనా ఉద్దేశపూర్వకంగా లోక్‌అదాలత్‌లో రాజీ చేశారన్నారు. కొట్టేసిన ఆస్తులను చివరికి ఆ ఉద్యోగి టీటీడీకి దానం చేశాడని, దానిని బోర్డు ఆమోదం లేకుండా ఈవో ఆమోదించారని ఆరోపించారు. ఫిర్యాదుదారున్ని బెదిరించి రాజీ చేశారని, దీనిపై అన్ని ఆధారాలున్నాయని, సిట్ ద్వారా విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

జైల్లో చదువుతో.. గోల్డ్ మెడల్!

▸ గుంటూరుకు చెందిన మహిళా ఖైదీ ప్రతిభ



గోల్డ్ మెడల్ సాధించిన నాగరాజకుమారి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తూ డిగ్రీ చదువుకున్న ఓ మహిళ గోల్డ్ మెడల్ సాధించింది. జైలు అధికారులు తెలిపిన వివరాల మేరకు.. 2020లో జరిగిన హత్య కేసులో గుంటూరు జిల్లాకు చెందిన డి.నాగరాజకుమారికి శిక్ష పడింది. గత ఐదేళ్లుగా రాజమహేంద్రవరం మహిళా సెంట్రల్ జైలులో ఖైదీగా ఉంది. జైల్లో ఉంటూనే 2021 నుంచి 2024 వరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుకుంది. ఆమె ఇటీవల బెయిల్‌పై విడుదలైంది. వర్సిటీ గోల్డ్ మెడల్ వచ్చిన విషయాన్ని జైలు సూపరింటెండెంట్ వసంత సదరు నాగరాజకుమారికి శుక్రవారం తెలిపారు. మహిళా సెంట్రల్ జైలులో ఇప్పటి వరకు 32 మంది ఖైదీలు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీలు పూర్తి చేశారని, ఇద్దరు పీజీ చేశారని తెలిపారు.

జైలు అధికారుల ప్రోత్సాహంతోనే..

'జైలు అధికారుల ప్రోత్సాహంతో ఉన్నత విద్య అభ్యసించా. జైలు అనేది సంస్కరణలకు నిలయం. ఖైదీల జీవితాలను చక్కదిద్దేందుకు అక్కడి సిబ్బంది ఎంతో ప్రయత్నిస్తుంటారు. జైలులో చదువుకోవడమే కాకుండా టైలరింగ్, పెయింటింగ్ వంటివి నేర్చుకున్నా. ఈనెల 30న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో గోల్డ్ మెడల్ అందుకోవడానికి వెళ్తాను.' - డి.నాగరాజకుమారి

13 నుంచి విధులకు కొత్త టీచర్లు

▸ వచ్చే నెల 3 నుంచి 10 వరకు శిక్షణ.. పాఠశాల విద్యా శాఖ నిర్ణయం

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన కొత్త ఉపాధ్యాయులకు అక్టోబరు 3 నుంచి 10వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. అ సమయంలోనే వారికి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టులు ఇస్తారు. ఆ తర్వాత 13నుంచి కొత్త టీచర్లు విధులకు హాజరుకానున్నారు. మరోవైపు మెగా డీఎస్సీ తుది జాబితాలపై ఏమైనా అభ్యంతరాలుంటే అభ్యర్థులు అక్టోబరు 25 వరకు తెలపవచ్చని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఇందుకోసం జిల్లా స్థాయి పోస్టులకు ఆర్జేడీ, ఇద్దరు డీఈవోలతో జోనల్ కమిటీ, రాష్ట్రస్థాయి పోస్టులకు ముగ్గురు రాష్ట్రస్థాయి అధికారులతో కమిటీలను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ కమిటీలు 15రోజుల్లో ఫిర్యాదులను పరిష్కరిస్తాయన్నారు. అభ్యర్థులు జోనల్ స్థాయి కమిటీ నిర్ణయంపై సంతృప్తి చెందకపోతే రాష్ట్రస్థాయి కమిటీకి అప్పీల్ చేసుకోవచ్చని, రాష్ట్రస్థాయి కమిటీ నిర్ణయంపైనా సంతృప్తి చెందకపోతే తుది అప్పీలేట్ అథారిటీ(పాఠశాలవిద్య డైరెక్టర్)కు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. తుది అప్పీలేట్ అథారిటీ ఈ ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కరిస్తుందని కృష్ణారెడ్డి వివరించారు.

ఓటుకు నోటు కేసులో మత్తయ్యకు ఊరట

▸ తెలంగాణ ప్రభుత్వ పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం

▸ రేవంత్‌రెడ్డి, సండ్రల పిటిషన్లపై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసులో నాలుగో నిందితుడిగా ఉన్న జెరూసలేం మత్తయ్యకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మత్తయ్యపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు కొట్టేయడాన్ని సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. హైకోర్టు తీర్పును రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. 2015లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఓటు వేసేందుకు తనకు లంచం ఇవ్వజూపారని ఆరోపిస్తూ అప్పటి ఆంగ్లో ఇండియన్ నామినేటెడ్ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్సన్ ఫిర్యాదు చేశారు. 2015 జూలై 28న తెలంగాణ అవినీతి నిరోధక శాఖ హైదరాబాద్ ఏసీబీ కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేసింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న జెరూసలేం మత్తయ్యపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అదే ఏడాది జూలై 6న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. స్టీఫెన్సన్ సైతం పిటిషన్ దాఖలు చేశారు. గత వారం సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ తుది తీర్పును ఇచ్చింది.

రేవంత్, సండ్రల పిటిషన్లపై విచారణ 14కు వాయిదా

ఓటుకు నోటు కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను సర్వోన్నత న్యాయస్థానం అక్టోబరు 14కు వాయిదా వేసింది. ఈ కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల నియామావళి కింద విచారణ చేపట్టాలని కోరుతూ 22 జూలై 2021లో రేవంత్ రెడ్డి, ఈ కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ 13 ఏప్రిల్ 2021లో సండ్ర వెంకట వీరయ్య సుప్రీంకోర్టులో వేర్వేరుగా స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. రెండు పిటిషన్లను కలిపి శుక్రవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ ధర్మాసనం విచారించింది. సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం కలుగజేసుకుని ఈ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఇంప్లీడ్ అయ్యేందుకు అనుమతించాలని కోరారు. రేవంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసును రాష్ట్రం వెలుపలికి బదిలీ చేయాలని ఇదే ఎమ్మెల్యే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారని, సుప్రీంకోర్టు కొట్టేసిందని, తిరిగి ఆయనే మరోసారి ఇంప్లీడ్ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రస్తావించారు. ఉదయమే ఇదే కేసులో మత్తయ్యకు అనుకూలంగా తీర్పు వచ్చిన సంగతి ప్రస్తావనకు వచ్చింది. దాంతో ఆ తీర్పు కాపీ వివరాలను తమకు అందించాలని ఆదేశిస్తూ విచారణను అక్టోబరు 14కు ధర్మాసనం వాయిదా వేసింది.

పెండింగ్ కేసులపై సభాహక్కుల కమిటీ సీరియస్

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీల విషయంలో సభాహక్కులు ఉల్లంఘించిన అధికారులపై 2019 నుంచి ఇప్పటి వరకు 26 కేసులు పెండింగ్‌లో ఉండటంపై శాసనమండలి సభాహక్కుల కమిటీ(ప్రివిలేజ్ కమిటీ) సీరియస్ అయింది. కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఆధ్వర్యంలో ఈ కమిటీ తొలి భేటీ శుక్రవారం జరిగింది. కమిటీ సభ్యులు జయేంద్ర భరత్, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, తలసిల రఘురాం, రాజగొల్ల రమేశ్ యాదవ్, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యుల హక్కులు, అధికారాలు, అలాగే వచ్చిన ఫిర్యాదులపై విస్తృత చర్చ జరిగింది. 2019 నుంచి కేసులు పెండింగ్‌లో ఉండటంపై కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. పెండింగ్ కేసులన్నింటినీ అక్టోబరు 21లోగా పరిష్కరించాలని నిర్ణయించింది. సంబంధిత అధికారులకు ఫైనల్ నోటీసులు జారీచేసి వివరణ తీసుకోవాలని, వివరణ ఇవ్వని వారిపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

నాలా రద్దు బిల్లుకు ఆమోదం

- భూవినియోగ మార్పిడి ఫీజు స్థానిక సంస్థలకే
- ఈ ఫీజు ఎంత ఉండాలో అవే నిర్ణయిస్తాయి
- పెండింగ్‌లో ఉన్న నాలా దరఖాస్తులు 1,281
- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూమి (వ్యవసాయేతర అవసరాలకు మార్పు) చట్టం-2006 రద్దు బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ బిల్లును శుక్రవారం ఉదయం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ శాసనసభలో ప్రవేశపెట్టారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూ వినియోగ మార్పిడి ఫీజును స్థానిక సంస్థలకే అప్పగిస్తామని అనగాని తెలిపారు. ఫీజు ఎంత అన్నది పంచాయతీ, నగరపాలక సంస్థలే నిర్ణయిస్తాయని పేర్కొన్నారు. నాలా చట్టాన్ని అడ్డంపెట్టుకొని కొందరు అధికారులు ద్వంద్వ ప్రమాణాలు పాటించారని, మరి కొన్నిచోట్ల భూ వినియోగ మార్పిడిలో మితిమీరిన జాప్యం జరిగిందని చెప్పారు. దీనివల్ల అనేక సమస్యలు వచ్చాయని మంత్రి సభకు వివరించారు. చట్టం అమల్లో ఉండగా వచ్చిన నాలా దరఖాస్తుల్లో 1,281 పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని ఈ చట్టం పరిధిలోనే సెటిల్ చేస్తామని, ఫీజుల చెల్లింపునకు ఏడాది గడువు ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు.

అమరావతిలో అంతర్జాతీయ న్యాయ వర్సిటీ

అమరావతిలో అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (ఐఐయూఎల్ఈఆర్)ను ఏర్పాటు బిల్లును కూడా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. మంత్రి లోకేశ్ ఈ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ చొరవతోనే రాష్ట్రానికి అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వస్తోందని మంత్రి వెల్లడించారు. శాసనసభ తరఫున గవర్నర్‌కు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ వర్సిటీలో 20శాతం సీట్లు ఏపీ విద్యార్థులకే కేటాయించామన్నారు. న్యాయ విశ్వవిద్యాలయంలో పీజీ, పీహెచ్‌డీ, పరిశోధన వంటి అనేక అవకాశాలు ఉన్నాయని, అడ్మిషన్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలవుతుందని భరోసా ఇచ్చారు. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. బార్ కౌన్సిల్ ట్రస్టుకు చెందిన ఈ వర్సిటీకి డాక్టర్. బి.ఆర్. అంబేడ్కర్ పేరు పెట్టాలని, లోకల్ కోటాను మరింతగా పెంచాలని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.

ప్రైవేటు వర్సిటీల చట్టానికి సవరణ

ప్రైవేటు యూనివర్సిటీల చట్టం-2016 సవరణ బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రైవేటు యూనివర్సిటీ ఏర్పాటు చేయాలంటే అప్పటికే ఉన్న 100 ఉత్తమ విశ్వవిద్యాలయాల ధ్రువీకరణ తప్పనిసరి అనే నిబంధనను తొలగిస్తూ సవరణ బిల్లును ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టింది. ఈ నిబంధన నూతన విద్యాలయాల ఏర్పాటునకు తీవ్ర అడ్డంకిగా ఉందని, గత ప్రభుత్వం అనాలోచితంగా ఈ క్లాజు తీసుకొచ్చిందని అందుకే దాన్ని తొలగించాలని ప్రతిపాదిస్తున్నట్లు లోకేశ్ ప్రకటించారు. ఈ చట్ట సవరణ వల్ల ప్రస్తుతం ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలు ప్రైవేటు వర్సిటీలుగా మారడానికి ఆరేడు సంవత్సరాల పాటు వేచి ఉండాల్సిన అవసరం లేదు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ తాజా డీఎస్సీ కూటమి ప్రభుత్వానికి గర్వకారణమన్నారు. ఇకపై ఏటా డీఎస్సీ ఉంటుందని సీఎం చంద్రబాబు చెప్పిన విషయాన్ని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి అనుగుణంగా తమ విభాగాన్ని సన్నద్ధం చేసుకుంటామని లోకేశ్ తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్‌గా చంద్రయ్య కుమారుడు

- మూడు సవరణ బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత సాయి సాకేత్ మైనేనికి డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇచ్చే సవరణ బిల్లుకు శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. 'నియామకాల క్రమబద్ధీకరణ, సిబ్బంది సరళి, చెల్లింపుల విధానం' సవరణ బిల్లు ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అంతర్జాతీయ స్థాయిలో సాకేత్ ప్రతిభ కనబర్చారని, మొత్తంగా 43 పతకా లు సాధించారని వివరించారు. ఆయనకు కేంద్రం అర్జున అవార్డును ప్రదా నం చేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి పేరు తీసుకొచ్చిన సాకేత్‌కు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని చెప్పారు.

తోట చంద్రయ్య కుటుంబానికి న్యాయం

వైసీపీ హయాంలో దారుణ హత్యకు గురైన పల్నాడు జిల్లా వాసి తోట చంద్రయ్య కుమారుడికి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చే బిల్లును కూ డా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎలాంటి నేర చరిత్ర, ఫ్యాక్షన్ నేపథ్యం లేని చంద్రయ్య గత ప్రభుత్వంలో రాజకీయ ప్రేరేపిత హింసలో హత్యకు గురయ్యారని పయ్యావుల తెలిపారు. అప్పట్లో చంద్రబాబు వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.25లక్షల ఆర్థిక సాయం చేశారని గుర్తుచేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేశ్ దృష్టి పెట్టారని చెప్పారు. రాజకీయ హింసలో చనిపోతే ఆ కుటుంబానికి ఎందుకు ఉద్యోగం ఇవ్వకూడదని పట్టుబట్టారని వివరించారు.


జీఎస్టీపై గ్రామాల్లో 10వేల సమావేశాలు

దసరా అనంతరం జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని మంత్రి పయ్యావుల తెలిపారు. గ్రామాల్లోనే 10 వేలకు పైగా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. కేం ద్రం జీఎస్టీలో చేసిన మార్పులకు అనుగుణంగా 'ఏపీ జీఎస్టీ' చట్టానికి శుక్రవారం ఆయన ప్రవేశపెట్టిన సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం లభించింది. రాష్ట్రంలో ప్రతి గృహిణి, రైతు, రైతు కూలీ అందరికీ సంస్కరణలు అర్థమయ్యేలా పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడతామని మంత్రి పేర్కొన్నారు.

లాజిస్టిక్స్ హబ్ ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

రవాణాతోపాటు పైప్‌లైన్స్‌ద్వారా గ్యాస్, నీరులాంటివి రవాణా చేయవచ్చు. మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు వ్యవస్థ ద్వారా హయ్యర్ కార్గో చేయడం ద్వారా రవాణా వ్యయం తగ్గించుకోవచ్చు. డ్రైపోర్టులు కూడా పెద్దఎత్తున వస్తున్నాయి. లాజిస్టిక్స్‌లో ఎకో సిస్టమ్ తీసుకువస్తాం. దీనికోసం బ్లూ ప్రింట్ తయారు చేస్తాం." అని చంద్రబాబు తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..



అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న సీఎం

బుల్లెట్ ట్రైన్ వచ్చేస్తోంది...

"గత ప్రభుత్వం వ్యవస్థలను భ్రష్టు పట్టించింది. రాష్ట్రమంతా గుంతలు పడ్డ రోడ్లుతో అప్పట్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే గుంతలు పూడ్చి రహదారులను అభివృద్ధి చేశాం. రాష్ట్రంలోని వేర్వే రు ప్రాంతాల్లో 14,966 కిలోమీటర్ల రోడ్లను రూ. 4,500 కోట్లతో త్వరలోనే చేపడతాం. జాతీయ రహదారుల పనులను రూ.లక్షన్నర కోట్లతో తలపెడుతు న్నాం. జాతీయ రహదారుల్లో రాష్ట్రం దేశంలోనే రెం డో స్థానంలో ఉంది. హైస్పీడ్ రోడ్ కారిడార్ ప్రాజెక్టులు రాష్ట్రాభివృద్ధిని మరోస్థాయికి తీసుకెళతాయి. గతంలో హైదరాబాద్ నుంచి కోల్‌కతాకు వెళ్లాలంటే నాలుగు రోజులు పట్టేది. హైదరాబాద్-అమరావతి, చెన్నై-బెంగళూరును కలుపుతూ బుల్లెట్ ట్రయిన్ రాబోతోంది. విశాఖ రైల్వే జోన్‌ను సాధించాం. ఇం దుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు."

లాజిస్టిక్స్‌లో అపార అవకాశాలు..

"జాతీయ రహదారులు, రైల్వే స్టేషన్ల అభివృద్ధి, రైల్వే లైన్లపై స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి. ఈ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి. ఇవి రాష్ట్ర ప్రాజెక్టులు కావని అశ్రద్ధ చేయొద్దు. కాంట్రాక్టు సంస్థలపై అజమాయిషీకి ప్రయత్నిస్తూ, వాటిని ఇబ్బంది పెట్టవద్దు. రాష్ట్రంలో సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. ఐదు ఆపరేషనల్ నాన్‌మేజర్ పోర్టులున్నాయి. నాలుగు గ్రీన్ ఫీల్డ్ పోర్టులున్నాయి. నౌకాయానంలో దేశంలో రెండోస్థానంలో ఉన్నాం. ఈ విషయంలో గుజరాత్ తొలిస్థానంలో ఉంది. ప్రస్తుతం 182 మిలియన్‌టన్నుల కార్గోను మన పోర్టులు చేపడుతున్నాయి. 2.5 లక్షల కోట్ల మేర లాజిస్టిక్ రంగంపై వ్యయం చేసేందుకు అవకాశం మనకు ఉంది."

డీఎస్సీపై వైసీపీ అక్కసు

"15 నెలల్లోనే అన్ని రంగాల్లో 4,71,574 మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నిలుపుకొంటాం. తాజాగా 15,941 ఉపాధ్యాయ నియామకాలను చేపట్టాం. ఉపాధ్యాయ నియామకాలు చేస్తే తెలుగుదేశం పార్టీకి మంచిపేరు వస్తుందన్న ఆక్రోశంతో వైసీపీ 150 కేసులను న్యాయస్థానంలో వేసింది. కానీ, ఒక్క రూపాయి అవినీతి లేకుండా మెగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేశాం."

పెత్తందారీలా జగన్ వ్యవహరించారు

అంతఃరాష్ట్ర నదీజలాల రవాణాకు రాష్ట్రంలో అవకాశాలు మెండుగా ఉన్నాయి. లాజిస్టిక్ కనెక్టివిటీని పెంచడమే ప్రభుత్వ లక్ష్యం. అమరావతిలో ఎయిర్‌పోర్టు నిర్మిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు ఏర్పాటుచేస్తాం. ఏపీ లాజిస్టిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ నెలకొల్పుతాం. లాజిస్టిక్స్‌లో మనకు నైపుణ్యం తక్కువ. అందువల్లే లాజిస్టిక్ వర్సిటీ ఏర్పాటు చేస్తాం. లాజిస్టిక్ అంశంలో ప్రతిష్ఠాత్మక మెర్స్ అండ్ మార్క్స్ సంస్థ సహకారం అందిస్తోంది. ఏరో స్పేస్, ఎనర్జీ, అగ్రో ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, లైఫ్‌సైన్సెస్ తదితర రంగాలపై దృష్టి పెట్టాం. గత పాలకులు కియ కార్ల కంపెనీని వేధించారు. పారిశ్రామికవేత్తలతో జగన్ పెత్తందారీలా వ్యవహరించారు. అపోలో టైర్స్ యాజమాన్యం కంటనీరు పెట్టుకుంది. బెదిరించి మరీ ఎంఓయూలు రద్దు చేశారు.

నిన్న స్టీల్ సిటీ.. ఇకపై నాలెడ్జ్ సిటీ..

"విశాఖ నిన్నటిదాకా స్టీల్ సిటీ.. ఇకపై నాలెడ్జ్ సిటీ. రూపాయికే ఎకరా భూమి ఇస్తున్నామంటూ వైసీపీ ఆక్రోశం వెళ్లగక్కుతోంది. టీసీఎస్‌కు, కాగ్నిజెంట్‌కు భూములిస్తే తప్పేంటి? విశాఖకు గూగుల్ వస్తోంది. మిత్తల్ స్టీల్స్, అల్యూమినియం పరిశ్రమలు కూడా వస్తున్నాయి. రాష్ట్రంలో 50వేల హోటల్‌రూమ్‌లు అందుబాటులో ఉండేలా ఆ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నాం. విశాఖలో జీఎంఆర్ ఏవియేషన్ వర్సిటీ ఏర్పాటు చేయనుంది. భోగాపురం విమానాశ్రయంనుంచి వచ్చేఏడాది ఆగస్టునుంచి సేవలు ప్రారంభమవుతాయి."

నిత్య విద్యార్థిని.. సంస్కరణలకు ఆద్యుడిని..

"దసరా అంటే మైసూర్, కోల్‌కతా గుర్తుకువస్తాయి. ఇప్పుడు అదే స్థాయిలో విజయవాడ కనక దుర్గ ఉత్సవాలు దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం పొందుతున్నాయి. ఎకో టూరిటాన్ని ప్రోత్సహిస్తున్నాం. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారుకావాలన్నదే నాలక్ష్యం. రాష్ట్రంలో డేటా లేక్ తయారుచేశాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 784 ప్రభుత్వసేవలు అందిస్తున్నాం. వచ్చేఏడాది జనవరిలో అమరావతికి క్వాంటం కంప్యూటర్ వస్తుంది. అమెరికాలోని జినోమ్ వ్యాలీ తరహాలోనే అమరావతిలో క్వాంటం వ్యాలీ స్థాపిస్తాం. క్వాంటం కంప్యూటర్‌లను ఉత్పత్తి చేసే కేంద్రంగా అమరావతి మారనుంది. నేను నిత్య విద్యార్థిని. సంస్కరణలకు ఆద్యుడిని. నా సంస్కరణలకు సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరే సాక్షి. బుచ్చయ్య చౌదరి కూడా నిత్యవిద్యార్థి." అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ...చంద్రబాబు సాంకేతిక జ్ఞానాన్ని చూశాక, తాను 40 ఏళ్ల తర్వాత ఎందుకు పుట్టలేదా అని బాధపడుతున్నానన్నారు.

ఇదేనా పద్ధతి?

(మొదటి పేజీ తరువాయి)

లేఖలు ఇచ్చీ ఇచ్చీ తన లెటర్‌ప్యాడ్ అయిపోయింది కానీ ఇంత వరకు బదిలీ జరగలేదు' అని వ్యాఖ్యానించారు. దీనిపై సీఎం తీవ్రంగా స్పందించారు. ఇది తీవ్ర ఆక్షేపణీయమన్నారు. ఆ తర్వాత లాబీల్లో తనకు కనిపించిన సుధీర్ రెడ్డిని అక్కడే మందలించారు. ఇక... రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వైఖరి కూడా ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చింది. అన్నీ తెలిసిన ఆయన... సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారిని తన్నాలన్నట్లుగా వ్యాఖ్యలు చేయడం ఏమిటని సీఎం సీరియస్ అయ్యారు. నిజానికి... బూర వ్యాఖ్యలపై సభలోనే మంత్రి అనిత స్పందించారు. 'మీరు సీనియర్ అధికారిగా వ్యవహరించారు. చట్టాల గురించి తెలుసుకదా' అని వ్యాఖ్యానించారు. ఇక... గురువారం సీఎం సభలో ఉన్న సమయంలోనే ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోషల్ మీడియా పోస్టుల విషయంలో హోంశాఖ తీరు సరిగా లేదంటూ తప్పు పట్టారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన సీఎం... సీనియర్లు కూడా ఇలా మంత్రులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. గురువారం సభలో తన సమక్షంలోనే జరిగిన కైకలూరు, హిందూపురం ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, నందమూరి బాలకృష్ణ సంవాదంపై కూడా చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇది జరిగి ఉండాల్సిన పరిణామం కాదని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశాల రెండో రోజున ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సభలో పీసీబీ ఛైర్మన్ మీద ఆరోపణలు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేరునూ ప్రస్తావించారు. దీనిపైనా చంద్రబాబు స్పందించారు. మొత్తంగా ఇలాంటి పరిణామాలు దురదృష్టకరమని, వ్యక్తులను, మంత్రులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం సరికాదని అన్నట్లు తెలిసింది.

తేడా ఉండాలి కదా...

మనం అధికారంలో ఉండీ.. మనపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటే సిగ్గుపడాల్సి వస్తోందని పలువురు ఎమ్మెల్యేలు సభలో చేసిన వ్యాఖ్యలపైనా చంద్రబాబు స్పందించారు. అక్రమ నిర్బంధాలు, అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేస్తే మనకూ వైసీపీకీ మధ్య తేడా ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి కొన్ని పరిమితులు ఉంటాయని... చట్టం, న్యాయం, నిబంధనలు పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సభలో సీనియర్ ఎమ్మెల్యేలు కొందరు సబ్జెక్ట్ పరంగా మాట్లాడుతున్నారని... అలాంటి చర్చలను ఆహ్వానించాల్సిందేనని, మిగిలిన ఎమ్మెల్యేలు వారిని చూసి సభలో ఎలా మాట్లాడాలో తెలుసుకోవాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో బుచ్చయ్య చౌదరి సబ్జెక్ట్ పరంగా మాట్లాడుతున్నారని, ఎక్కడా వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవడంలేదని తెలిపారు. సభ్యుల తీరుపై చర్చించేందుకు శనివారం మధ్యాహ్నం టీడీఎల్పీ సమావేశం పెట్టాలని ఓ దశలో భావించారు. దీనిపై ఇంకా తుది నిర్ణయానికి రాలేదు.

చైర్మన్‌ను అవమానించారని మండలిలో రచ్చ

- పోడియం వద్ద వైసీపీ సభ్యుల ఆందోళన
- ప్రభుత్వ కార్యక్రమాలకు చైర్మన్‌ను ఆహ్వానించరా?
- మండలికే అవమానం: విపక్ష నేత బొత్స

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన రెండు కార్యక్రమాలకు మండలి చైర్మన్‌ను ఆహ్వానించకుండా ఆయన్ను అవమానించిందని వైసీపీ ఆరోపించింది. ఈ అంశంపై సభా నాయకుడైన సీఎం సమాధానం చెప్పాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం భోజన విరామం తర్వాత మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఇటీవల తిరుపతిలో జరిగిన పార్లమెంట్ మహిళా సభ్యుల సదస్సు, తాజాగా శాసనసభా ప్రాంగణంలో ప్రభుత్వ విప్‌లు, మీడియా పాయింట్ భవనం ప్రారంభోత్సవానికి మండలి చైర్మన్‌కు ఆహ్వానం లేదని చెప్పారు. ఈ రెండు కార్యక్రమాలకు స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ను ఆహ్వానించి, మండలి చైర్మన్‌ను పిలవకుండా అవమానించారని ఆరోపించారు. దీనిపై మంత్రులు అచ్చెన్నాయుడు, మనోహర్ జోక్యం చేసుకున్నారు. పొరపాటు ఎక్కడ జరిగిందో తెలుసుకుంటామని వారు చెప్పినా.. వైసీపీ సభ్యులు చైర్మన్ పోడియం వద్ద ఆందోళనకు దిగారు. సీఎం వచ్చి సమాధానం చెప్పాలని విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. బొత్స మాట్లాడుతూ.. చైర్మన్‌కు జరిగిన అవమానం మండలి సభ్యులకూ జరిగినట్లేనని, దీనిపై చర్చ జరగాలని అన్నారు. చైర్మన్ ఎస్సీ అయినందునే అవమానం జరిగిందని వైసీపీ సభ్యులు ఆరోపించారు. దీనిపై చైర్మన్ మోషేన్‌రాజు జోక్యం చేసుకుని.. 'నేను ఉన్నప్పుడు చర్చించడం సరికాదు.. ప్యానల్ చైర్మన్‌ను పెడదాం.. చర్చించుకోండి' అంటూ సభను కొద్దిసేపు వాయిదా వేశారు. తర్వాత మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'మండలి చైర్మన్‌ను ఆహ్వానించాల్సిందే. కానీ సభ, మండలి ద్వారా జరిగే ఏ కార్యక్రమానికీ ముఖ్యమంత్రికి సంబంధం ఉండదు. సభలో స్పీకర్, మండలిలో చైర్మన్ ప్రధానం. పొరపాటు ఎక్కడ జరిగిందో అసెంబ్లీ సెక్రటరీని అడిగి తెలుసుకుంటాం. ఇలాంటి వాటికి కమిటీ ఉంది. సంబంధం లేని విషయాన్ని, సంబంధం లేని వ్యక్తులకు ఆపాదించి మాట్లాడటం సరికాదు' అని అన్నారు. ఇలాంటి ఘటనలు ఆనవాయితీగా మారకూడదని బొత్స సూచించారు. సభను మరోసారి వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభించాక.. విపక్ష నేత బొత్స అదే అంశాన్ని ప్రస్తావించారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'అసెంబ్లీ అధికారులను అడిగితే.. వేరే షెడ్యూల్ ఉందన్నట్లు.. మీరే రానని అన్నారని చెప్తున్నారు' అని చైర్మన్‌ను ఉద్దేశిస్తూ అన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని చైర్మన్ అన్నారు. 'అధికారులు మిమ్మల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు' అని ఆయన అన్నారు. ఎస్సీ అనే చైర్మన్ పేరు వేయలేదని వైసీపీ సభ్యులు ఆరోపించారు. మంత్రులు మనోహర్, అచ్చెన్నాయుడు జోక్యం చేసుకుని కులాలు తెచ్చి చైర్మన్ స్థానానికి ఆపాదించి, అగౌరవ పర్వవద్దని సూచించారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పేర్లు వేసి, చైర్మన్ పేరు ఎందుకు వేయలేదని ఎమ్మెల్సీ త్రిమూర్తులు నిలదీశారు. దీనిపై ప్రభుత్వ వివరణ ఏమిటని మంత్రులను చైర్మన్ అడిగారు. సీఎం వచ్చి సమాధానం చెప్పాలని వైసీపీ సభ్యులు పట్టుబట్టారు. 'దీనిపై చర్చ కొనసాగిద్దామా? ప్రభుత్వ స్పందన తెలుపుతారా? కమిటీ ఏమైనా వేస్తారా? ఎవరో ఒకరు బాధ్యత తీసుకుని వివరణ ఇస్తే.. విషయాన్ని ఇంతటితో ముగిద్దాం' అని చైర్మన్ అన్నారు. సభ్యులు కూర్చుంటే చర్చిస్తామని అచ్చెన్నాయుడు అన్నారు. అప్పటికీ గందరగోళం కొనసాగడంతో సభను వాయిదా వేశారు.

విద్యారంగంలో కోనసీమను ముందుకు తీసుకెళ్తాం!

- పాలిటెక్నిక్ కాలేజీలు, ఇతర విద్యాసంస్థల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటాం: అసెంబ్లీలో మంత్రి లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో కోనసీమ ప్రాంతాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని మంత్రి లోకేశ్ శాసనసభలో తెలిపారు. పాలిటెక్నిక్ కాలేజీలతో పాటు, ఇతర విద్యాసంస్థల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శుక్రవారం ప్రశ్నోత్తరాల్లో సమయంలో మంత్రి సమాధానాలు ఇచ్చారు. కోనసీమలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యారంగం వెనకబడి ఉందన్నారు. పాలిటెక్నిక్ కాలేజీల ఏర్పాటుపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి నూతన సిలబస్‌ను తీసుకొస్తామని తెలిపారు.

ఎస్కే యూలో అక్రమాలపై చర్యలు

గత ప్రభుత్వంలో ఎస్కే యూనివర్సిటీలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు అందాయని లోకేశ్ పేర్కొన్నారు. వర్సిటీలో పదోన్నతులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, కంప్యూటర్ కొనుగోళ్లు, వాహనాల దుర్వినియోగం వంటి అంశాలపై దర్యాప్తు చేస్తున్నామని, 100 రోజుల్లోగా తగిన చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీలో విద్యార్థి మృతి బాధాకరమని మంత్రి లోకేశ్ విచారం వ్యక్తం చేశారు. దాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయ లబ్ధి పొందాలని కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. వర్సిటీల్లో రాజకీయాలు వద్దని హితవు పలికారు. ఏవైనా సమస్యలు ఉంటే విద్యార్థి సంఘాలు ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించుకోవాలన్నా రు. యూనివర్సిటీల పనిని ఇబ్బంది పెట్టాలనుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ వర్సిటీల్లో 3,282 పోస్టులు ఖాళీగా ఉన్నాయని లోకేశ్ వెల్లడించారు. వివిధ కోర్టు కేసుల కారణంగా పోస్టుల భర్తీలో జాప్యం జరుగుతోందని వివరించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబరు 26న విద్యార్థులతో అసెంబ్లీ నిర్వహించాలని మంత్రి లోకేశ్ ప్రతిపాదించారు.

పేదలకు అన్నం పెట్టే 'అన్న క్యాంటీన్ల'ను మూసేసిన మీరా మాట్లాడేది?

- వైసీపీపై వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్

అమరావతి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల అమలు సూపర్ హిట్ అయిందని మంత్రులు పేర్కొన్నారు. శుక్రవారం శాసనమండలిలో సూపర్ సిక్స్ హామీలపై జరిగిన లఘు చర్చలో పలువురు మాట్లాడారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను మూసేసిన వైసీపీ.. కూటమి ప్రభుత్వానికి నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. అభివృద్ధి, సంక్షేమం, విశ్వసనీయతకు కూటమి ప్రభుత్వం ప్రతిరూపమని.. అదే వైసీపీ అసలు రూపం ద్రోహం, అవినీతి, అహంకారమని విమర్శించారు. మీ తాత లేదా మీ తండ్రి లేదా మీ పేరు పెట్టుకుని అయినా అన్న క్యాంటీన్లను నడపాలని అప్పటి సీఎం జగన్‌ను సభలో కోరినా.. పట్టించుకోకుండా ఎత్తేశారని మండిపడ్డారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చిందని పేర్కొన్నారు. వైసీపీ తమ మ్యానిఫెస్టో గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వం మ్యానిఫెస్టోను అమలు చేయలేదన్నారు. తమ ప్రభుత్వం అన్నదాత సుఖీభవతో 47 లక్షల మంది రైతులకు తొలి విడత ఆర్థిక సాయం అందజేశామని, 3 లక్షల మంది కౌలు రైతులకూ రెండవ విడతలో సాయం అందజేయబోతున్నామన్నారు.

రాష్ట్రంలో మెగా ఇండస్ట్రియల్ పార్కులు: భరత్



సూపర్ సిక్స్. సూపర్ హిట్ అయిందని పరిశ్రమల మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. తమ ప్ర భుత్వం వచ్చిన 15 నెల ల్లో 5.50 లక్షల ఉద్యోగా లు కల్పించామని, ఐదేళ్లు అయ్యే నాటికి 20 లక్షల ఉద్యోగాలు కచ్చితంగా ఇస్తామని చెప్పారు 175 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని, 50 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ప్రారంభోత్సవాలు అయ్యాయని, 121 పార్కులను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

దీపం లబ్ధిదారుల ఖాతాల్లో 1,720 కోట్లు జమ: నాదెండ్ల



రాష్ట్రంలో 1.42 లక్షల కుటుంబాలు ఉంటే ఇప్పటి వరకు కోటి 4 లక్షల కుటుంబాలకు దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇప్పటి వరకు లబ్ధిదారుల ఖాతాల్లో రూ.1,720 కోట్లు జమ చేశామన్నారు. సూపర్ సిక్స్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచిత సిలిండర్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.

రోజూ లక్షల మందికి ఉచిత బస్సు

రాష్ట్రంలో రోజూ 22 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకుంటున్నారని రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. 40 శాతంగా ఉన్న మహిళా ప్రయాణికుల సంఖ్య 62 శాతానికి పెరిగిందన్నారు. రోజుకు మహిళా ప్రయాణికుల సంఖ్య 9.4 లక్షల నుంచి 22 లక్షలకు పెరిగిందన్నారు. కాగా, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏడు బిల్లులకు శాసనమండలి ఆమోదం తెలిపింది. వీటిలో ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ సవరణ బిల్లుతో పాటు పురపాలక శాఖకు చెందిన బిల్లులున్నాయి.

ఆడబిడ్డ నిధి హామీ అమలుకు ప్రయత్నం: కొండపల్లి



రాష్ట్రంలోని 18-59 సంవత్సరాల మధ్య మహిళలకు ఆడబిడ్డ నిధి హామీ అమలుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ పథకాన్ని కచ్చితంగా అమలు చేసేలా భవిష్యత్తులో విధివిధానాలు ప్రకటిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 45 ఏళ్ల దాటిన మహిళలందరికీ పింఛన్లు ఇస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు.

మావి సూపర్‌డూపర్ పథకాలు

'పులివెందుల'లో మా గెలుపే కూటమిపై ప్రజల్లోని సంతృప్తికి నిదర్శనం: అచ్చెన్న



సూపర్‌సిక్స్ పథకాలపై చర్చ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు, విపక్షనేత బొత్స సత్యనారాయణ మధ్య మాటలయుద్ధం సాగింది. ఆడబిడ్డ పథకం అమలు కావాలంటే ఏపీని అమ్మాలని మంత్రి అచ్చెన్నాయుడు గతంలో అన్నారని వైసీపీ సభ్యుడు ఇజ్రాయెల్ వ్యాఖ్యానించడం మండలిలో గందరగోళానికి దారితీసింది. దీనిపై మంత్రి అచ్చెన్న తీవ్రంగా స్పందించారు. "గత వైసీపీ పాలనలో ఏపీలో ఏమైనా మిగిల్చారా? ఆర్థికవ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారు. రూ.9 లక్షల కోట్ల మేర అప్పులుచేశారు. వ్యవసాయ అనుబంధ శాఖల్లో రూ.కోట్ల బకాయిలు పెట్టారు. వాటన్నింటినీ ఎప్పటికి తీర్చాలి? ఈ విషయంలో మాట్లాడటానికి వైసీపీ వాళ్లకు సిగ్గుండాలి. ఐదేళ్లలో ఒక్కపరిశ్రమ కూడా తేలేదు. డీఎస్సీ ఇవ్వలేదు. అలాంటిది మాకు శ్రీరంగనీతులు చెబుతారా? సూపర్‌సిక్స్ అమలు చేసినందుకు కూటమి ప్రభుత్వాన్ని అభినందించాల్సిందిపోయి, ఇంకా మాట్లాడతారా? ప్రజలు జగన్‌ను, వైసీపీని ఛీ కొట్టినా ఇంకా బుద్ధిరాలేదు" అంటూ ఆగ్రహించారు. దీనిపై విపక్షనేత బొత్స జోక్యం చేసుకుంటూ, సభ్యులు మాట్లాడుతుంటే మంత్రి ఎలా అడ్డుపడతారని ప్రశ్నించారు. తన పేరు ప్రస్తావించినందుకే మాట్లాడాల్సి వచ్చిందని అచ్చెన్న అనగా.. ఎందుకు సహనం కోల్పోతున్నారని బొత్స వ్యాఖ్యానించారు. సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కాదు..సూపర్‌డూపర్ అని ఈ సందర్భంగా అచ్చెన్న అన్నారు. వైసీపీకి రెండు జడ్పీటీసీ స్థానాల్లో డిపాజిట్ రాకపోవడమే సూపర్‌సిక్స్‌పై ప్రజలు సంతృప్తికి నిదర్శనమన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


MARUTI SUZUKI
NEXA
THIS NAVRATRI, FIND INSPIRATION IN EVERY MILE.
AVAIL GST BENEFITS OF UP TO ₹1 07 000*
NOW STARTING AT ₹10 76 500 FOR GRAND VITARA AND ₹11 52 300 FOR XL6.
GRAND VITARA
XL6
NEXA SAFETY SHIELD
*OFFER VALID TILL 30TH SEPTEMBER 2025 ONLY
CONSUMER OFFERS OF UP TO ₹1 63 000^
EXCHANGE BONUS OF UP TO ₹1 00 000^
UP TO 100% WAIVER ON CAR LOAN PROCESSING FEE**
SCAN TO CONNECT TO A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY @ WWW.NEXAEXPERIENCE.COM
Contact us at 1800-200-6392 1800-102-6392
For detailed T&C kindly visit nearest dealership. Maruti Suzuki India Limited reserves the rights to discontinue offers without notice and offers may vary across variants. ^Offers include consumer offer, exchange bonus and institutional or rural offers (wherever applicable) on select models/variants. Finance is at the sole discretion of the financer. 3 years or 100 000 km, whichever is earlier. Above offers are valid until stocks last. Black glass shade on the vehicle is due to the lighting effect. Images used are for illustration purposes only. Car colour may vary due to printing on paper. Revised prices effective from September 22, 2025. *Prices subject to applicable GST rates as notified by the Government. **By selected finance partners.